
బుధవారం 7-2-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 317


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వాసమల్లి



జెఎల్‌ఎఫ్ 2024

నీలగిరి కొండల తొలి వెలుతురు

'నీలగిరుల్లోని ప్రతి కొండ మాకు దేవునితో సమానం' అంటుంది వాసమల్లి. నీలగిరిలో అంతరించిపోతున్న 'తోడా' తెగకు చెందిన వాసమల్లి ఆ తెగలో మొదటి గ్రాడ్యుయేట్. లిపిలేని తోడా భాషకు డిక్షనరీ తయారు చేసే పనిలో ఉంది. తోడా తెగ పాటలను సేకరిస్తే సాహిత్య అకాడెమీ ప్రచురించింది. 'చంద్రునిలో ఉండే కుందేలు మా తెగదేనని మా విశ్వాసం' అందామె. 'ఊటీ' అని అందరూ పిలుచుకునే 'టూరిస్ట్ కేంద్రం'లో తోడా తెగ విశిష్ట జీవనాన్ని నమోదు చేస్తున్న వాసమల్లి జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో మాట్లాడింది.

'నీలగిరి కొండల్లో విహారానికి వచ్చేవాళ్లు మేం మాట్లాడుకునే భాష విని భలే ఉందే, ఇదేం భాష అనుకుంటారు. మా తర్వాతి తరాలు అలా అనుకో కూడదని తోడా భాషను కాపాడే ప్రయత్నం చేస్తున్నాను. మా భాషకు లిపి లేదు. కాని యాభైకి మించిన ధ్వన్యక్షరాలు ఉన్నాయి. వాటిని నమోదు చేస్తున్నాను. తోడా డిక్షనరీ తయారు చేస్తున్నాను. తోడాలు పాడుకునే పాటలు, చెప్పుకునే కథలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని సేకరించి పుస్తకం వేశాను' అంటుంది వాసమల్లి.

అరవై ఏళ్లు దాటిన వాసమల్లి కేవలం 1500 మంది మాత్రమే మిగిలిన తోడా తెగకు ప్రతినిధి.'నీలగిరుల్లో మొత్తం ఆరు తెగలు ఉన్నాయి. అన్నీ అంతరించిపోయే ప్రమాదపు అంచున ఉన్నాయి' అంటుందామె.

జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో జానపదుల కథల గురించి మాట్లాడడానికి వచ్చిన వాసమల్లి 'ఆదిమ తెగలు మానవ నాగరికతకు పాదముద్రలు. భాష మరణిస్తే సమూహం కూడా మరణిస్తుంది. మా తోడా భాష ఎంతో సుందరమైనది. మా తర్వాతి తరాలు దానిని కాపాడుకోవాలనేదే నా తపన' అంది.

బర్రెలే ఆస్తి

'తోడాలకు బర్రెలే ఆస్తి. నీలగిరుల్లోని కొండ బర్రెలు ప్రత్యేకంగా ఉంటాయి. వాటిని 'ఇర్ర్' అంటారు. వాటి పాల నుంచి తీసిన నెయ్యితో మాత్రమే మేము దేవుని దీపాలను వెలిగించాలి. వాటిని మేము దైవాంశాలుగా చూస్తాం. తోడాలు శాకాహారులు. ఇర్ర్‌లను కోయడం, తినడం చేయం. మా తోడాల్లో ఎవరైనా చనిపోతే ఒక బర్రెను ఎంపిక చేసి పడమరవైపు తోలేస్తాం. అది కూడా ఏదో ఒక రోజున మరణించి ఆ చనిపోయిన వ్యక్తి దగ్గరకు తోడు కోసం వెళుతుందని మా నమ్మకం' అని చెప్పిందామె.

> **ఆయుష్మంతులు**
>
> తోడాలు కొండగొర్రెల్లా తిరుగుతూనే ఉంటారు. అడవి పళ్లు, ఆకుకూరలు తింటారు. ప్రశాంతంగా జీవిస్తారు. రోగాలు రావు. నూరేళ్లు సులువుగా బతుకుతారు. డబ్బు దాదాపుగా ఎవరి దగ్గరా ఉండదు. దానికి పెద్దగా విలువ లేదు. తోడాలు చేతి ఎంబ్రాయిడరీలో నిష్ణాతులు. తెలుపు, ఎరుపు, నలుపు రంగులు మాత్రమే వాడుతూ అందమైన ఎంబ్రాయిడరీ కంబళ్లు అల్లుతారు. తెలుపు బాల్యానికి, ఎరుపు యవ్వనానికి, నలుపు పరిణితికి గుర్తుగా భావిస్తారు.
>
> – వాసమల్లి

చంద్రుని పై కుందేలు

'తోడాలు ఏది దొరికినా పంచుకుని తినాలి. ఒక సారి ఒక తోడా తేనె దొరికితే వెదురుబొంగులో తన కోసం దాచుకుని ఇంటికి బయలుదేరాడట. అతని లోని దురాశ వెంటనే పాములా మారి వెంటబడింది. అతను పరిగెడుతూ చేతిలోని వెదురుబొంగును కింద పడేస్తే అది పగిలి తేనె కుందేలు మీద చిందింది. పాము ఆ కుందేలు వెంట పడింది. కుందేలు భయంతో సూర్యుడి వైపు పరిగెడితే నేను చాలా వేడి... చంద్రుడి దగ్గరకు వెళ్లి దాక్కో అన్నాడు. కుందేలు చటుక్కున చంద్రుడిలో వెళ్లి దాక్కుంది. అందుకని చంద్రుడిలోని కుందేలు మా పూర్వికురాలనుకుంటాం. చంద్రగ్రహణం రోజున చంద్రుణ్ణి రాహువు వదిలే వరకూ కుందేలు క్షేమం కోసం భోరున విలపిస్తాం' అని తెలిపిందామె.

మొదటి గ్రాడ్యుయేట్

నీలగిరి కొండల్లో గిరిజనవాడలను 'మండ్' అంటారు. అలాంటి మండ్‌లో పుట్టిన వాసమల్లి చిన్నప్పటి నుంచి చదువు మీద ఆసక్తితో హైస్కూల్ వరకూ చదువుకుంది. చిన్న వయసు పెళ్లి తప్పించుకోవడానికి ఇంటర్, డిగ్రీ చదివింది. తర్వాత ఊటీలోని 'హిందూస్థాన్ ఫొటో ఫిల్మ్ ఫ్యాక్టరీ'లో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యింది. ఆ సంస్థ ఉద్యోగినే పెళ్లి చేసుకుంది. ఆమెకు ఇద్దరు కొడుకులు. ఒక కొడుకు ఉద్యోగం చేస్తుంటే, మరో కొడుకు ఊటీలో గైడ్‌గా పని చేస్తున్నాడు. 'నా పరిశోధనకు పెద్దగా సపోర్ట్ ఏమీ దొరకడం లేదు. మా నీలగిరుల్లో యాభై కొండలకు యాభై కథలు ఉన్నాయి. సేకరిస్తున్నాను. ఎలా ప్రచురించాలో ఏమిటో' అంటున్న ఆమె ఒక తొలి వెలుగుగా అనిపించింది. ఆ దీపం నుంచి మరో దీపం వెలుగుతూ వెళ్లాలని కోరుకుందాం.

ఇంటర్వ్యూ: జైపూర్ నుంచి 'సాక్షి' ప్రతినిధి

కిచెన్ టిప్స్



- తేనె కొంతకాలం వాడకుండా ఉంచేస్తే సీసా అడుగున గడ్డకట్టుకుపోతుంటుంది. అలాంటప్పుడు తేనెను కరిగించడానికి ఓ అరగంట పాటు తేనె సీసాను ఎండలో ఉంచాలి. తేనెను ఎప్పుడూ నేరుగా వేడి చేయకూడదు. ఎండ లేకుండా వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఒక పాత్రలో నీటిని వేడి చేసి అందులో తేనె సీసాను ఉంచాలి. నీటి వేడితో ఐదు – పది నిమిషాల్లో తేనె కరుగుతుంది.
- పాల ప్యాకెట్‌లు ఫ్రిజ్‌లో పెట్టుకునేటప్పుడు ఆ ప్యాకెట్‌లను నేరుగా పెట్టకూడదు. ప్యాకెట్ మన వాకిటి ముందుకు వచ్చే లోపు రకరకాల ప్రదేశాలను తాకి ఉంటుంది. కాబట్టి ప్యాకెట్‌ని నీటితో కడిగి ఫ్రిజ్‌లో పెట్టడం మంచిది.
- వెల్లుల్లి రేకలు పొట్టు సులువుగా వదలాలంటే... వెల్లుల్లి రేకను కటింగ్ బోర్డు మీద పెట్టి చాకు వెనుక వైపు (మందంగా ఉండే వైపు, ఈ స్థితిలో చాకు పదును ఉన్న వైపు పైకి ఉంటుంది) తిప్పి వెల్లుల్లి రేక చివర గట్టిగా నొక్కితే వెల్లుల్లి రేక తేలిగ్గా విడివడుతుంది.
- పైనాపిల్‌ను కట్ చేయడానికి పెద్ద చాకులను (షెఫ్స్ నైఫ్) వాడాలి. ముందుగా కాయ పై భాగాన్ని, కింది భాగాన్ని తొలగించాలి. ఇప్పుడు కాయను నిలువుగా పెట్టి చెక్కును పైనుంచి కిందకు తొలగించాలి. ఆ తర్వాత మీడియం సైజ్ చాకుతో కాయను చక్రాలుగా తరగాలి.
- బటర్‌ను వంట మొదలు పెట్టడానికి ఓ అరగంట లేదా గంట ముందు ఫ్రిజ్‌లో నుంచి తీసి బయట పెట్టుకోవాలి. ఒకవేళ మర్చిపోతే వేడి పాలగిన్నె మూత మీద లేదా ఉడుకుతున్న వంట పాత్ర మూత మీద పెడితే పది నిమిషాల్లో మెత్తబడుతుంది. అలా కుదరకపోతే స్టవ్ మీద బర్నర్ల మధ్య ఉండే ఖాళీ ప్రదేశంలో ఉంచాలి.
- ఐస్‌క్రీమ్ సర్వింగ్ స్పూన్‌లు ఇంట్లో ఉండవు. పెద్ద ప్యాకెట్ తెచ్చుకున్నప్పుడు దానిని పలుచగా కట్ చేయాలంటే చాకును మరుగుతున్న వేడి నీటిలో ముంచి తీయాలి. ఒక స్లయిస్ కట్ చేయగానే చాకు చల్లబడిపోతుంది. కాబట్టి ప్రతి స్లయిస్‌కూ ఓ సారి వేడి నీటిలో ముంచాలి.









* ఫరీదా రాజ్

ఏడీహెచ్‌డీ, సెరిబ్రల్ పాల్సీ, ఇతర మనోవైకల్యాలు ఉన్న పిల్లల మానసిక అభివృద్ధికి బాటలు వేస్తున్నారు హైదరాబాద్ వాసి ఫరీదా రాజ్. స్పెషల్ చిల్డ్రన్‌కు శిక్షణ ఎలా ఇవ్వాలనే అంశాల మీద టీచర్లకు శిక్షణ ఇచ్చారు. సెంటర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్, టీచర్ ట్రైనర్, రెమెడియల్ ఎడ్యుకేటర్, రైటర్ అయిన ఫరీదా రాజ్ తన రచనల ద్వారా, అవగాహన సదస్సుల ద్వారా ప్రజలలో అవగాహన కలిగించేందుకు కృషి చేస్తున్నారు.

అవగాహనే ప్రధానం

పిల్లల్లో వచ్చే డిస్లెక్సియాపై పుస్తకాలు రాసిన ఫరీదా రాజ్ ఇటీవల 'అన్‌బ్రేకబుల్ స్పిరిట్ – నావిగేటింగ్ లైఫ్ విత్ ఎమ్మెస్ పేరుతో మల్టిపుల్ స్కెర్లోసిస్‌పై పుస్తకాన్ని తీసుకువచ్చారు. ఇది భారతదేశంలో వైద్య లేదా వైద్యేతర వ్యక్తి రాసిన మొట్టమొదటి పుస్తకంగా పేరొందింది. సరైన రోగ నిర్ధారణ, సకాలంలో చికిత్స, సంరక్షణ, కుటుంబ మద్దతుతో వ్యక్తులు సుదీర్ఘమైన, చురుకైన, ఆరోగ్యకరమైన జీవితాలను గడపవచ్చని ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా చెబుతారు ఆమె.

''ఇటీవల చాలా కుటుంబాల్లో తెలియని అలజడిని సృష్టిస్తున్న సమస్య మల్టిపుల్ స్కెర్లోసిస్. దీనిని ఒక జబ్బుగా కాకుండా అవగాహనతో సరిదిద్దాల్సిన అంశంగా గుర్తించాలి. సమస్యతో ఇబ్బంది పడుతున్నవారిని నేరుగా కలిసి, వారి వేదనను, చికిత్సా విధానాలను ఇందులో పొందుపరిచాను.

స్పెషల్ కిడ్స్ సామర్థ్యాలకు..

నేను స్కూల్ టీచర్‌గా ఉన్న మొదటి రోజులవి. ట్రైనింగ్ పీరియడ్. క్లాస్‌రూమ్‌లో ఉన్నప్పుడు మొదటి రోజే అక్కడి ఓ సంఘటన నన్ను అమితంగా కదిలించింది. ముగ్గురు, నలుగురు పిల్లలు టీచర్ చెబుతున్న విషయంపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు. వారిలో అసహనం స్థాయిలు దాటడాన్ని, టీచర్ సహనం కోల్పోవడాన్నీ గమనించాను. ఎదిగే వయసు పిల్లల్లో సహజంగానే చాలా మానసిక ఒత్తిడి ఉంటుంది. ఈ సమస్య యువతలో మరింత ఎక్కువగా ఉండటాన్ని చూస్తుంటాం. వారిలో ఆందోళన కూడా ఒకింత ఎక్కువే. ఇలాంటప్పుడు వారికి మెంటల్ వెల్‌బీయింగ్ అవసరం. ఇక మానసిక వైకల్యాలు ఉన్న పిల్లల్లోనైతే అందరికీ వీరి పట్ల నిర్లక్ష్యం కూడా ఉంటుంది. ఇలాంటి పిల్లలను చూసుకునేవారికి సరైన గైడెన్స్ ఉండటం లేదని ఆ రోజే అనిపించింది. మనోవైకల్యాలు ఉన్న పిల్లల్లో సామర్థ్యాలను వెలికితీయడానికి, వారిలో విశ్వాసాన్ని పెంపొందించడానికి ప్రతిరోజూ కృషి చేయాల్సి ఉంటుంది. అభ్యాసంలో వారిని నిమగ్నం చేయడానికి కొత్త కొత్త మార్గాలను కనుక్కోవాలి. దానిపైనే కృషి చేయాలనుకున్నాను. ఆ తర్వాత అందుకు తగిన పరిష్కారాలనూ కనుక్కున్నాను.

వందల మంది టీచర్లకు శిక్షణ

స్పెషల్ చిల్డ్రన్‌కు ఎలాంటి శిక్షణ అవసరమో, అందుకు టీచర్ల నైపుణ్యత ఎలా ఉండాలనే దానిపై రెగ్యులర్ సెషన్స్ నిర్వహించాను. ఇది రాష్ట్రస్థాయిలో మంచి మార్పులు తీసుకువచ్చింది. ఉపాధ్యాయులు, నేర్చుకునే ఇబ్బందులు ఉన్న పిల్లల తల్లిదండ్రుల కోసం ఒక హ్యాండ్-బుక్ తీసుకువచ్చాను.

జన్యులోపాలపై అవగాహన

ముంబైలో పుట్టి పెరిగిన నేను, పెళ్లి తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ కి వెళుతున్న తొలినాళ్లలో ఒక రోజు, మానసిక వికలాంగురాలైన పాపతో ఉన్న ఒక మహిళను అక్కడ చూశాను. ఆమెతో మాటలు కలిపితే ఆ పాప ఆమెకు ఏడవ సంతానం అని తెలిసింది. ఆమె ఇతర పిల్లలందరికీ కూడా అదే సమస్య ఉంది. జన్యుపరమైన లోపాల వల్ల పిల్లలకు అలాంటి సమస్య వచ్చిందని ఆ మహిళకు తెలియదు. ఆ విషయం తెలియక జెనెటిక్ కౌన్సెలింగ్ కోసం ఆమె ఎప్పుడూ వెళ్లలేదని తెలుసుకున్నాను. దీంతో ఆ రోజే నిర్ణయించుకున్నాను ఇలాంటి మహిళలకు అవగాహన కల్పించాలని. అప్పటి నుంచి మహిళలకు జన్యుపరమైన కౌన్సెలింగ్స్ చేస్తూ ఉండేదాన్ని. ఈ అంశంపై ఉర్దూ పత్రికతో పాటు జాతీయ స్థాయి పత్రికలలోనూ వీటికి సంబంధించిన కథనాలపై వ్యాసాలు ఇచ్చాను.

ఒక్కో అడుగు..

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా పని చేయడం నుంచి తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ నుంచి జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందుకునే వరకు చేసిన ఈ ప్రయాణంలో నేర్చుకున్న విషయాలు ఎన్నో. క్యాన్సర్ పట్ల ప్రజలలో అవగాహన కలిగించేందుకు ఆంకాలజిస్టులచే కార్యక్రమాల నిర్వహణ నన్ను ఎంతోమందికి చేరువ చేసింది. మల్టిపుల్ స్కెర్లోసిస్‌తో బాధపడుతున్న వ్యక్తులను చూసినప్పుడు ప్రజలకు ఈ విషయం పట్ల అవగాహన లేదని అర్థమైంది. దీంతో సమస్యను ఎదుర్కొంటున్నవారిని కలిసి, కదిలించే కథనాలను పాఠకుల ముందుకు తీసుకువచ్చాను'' అని వివరించే ఫరీదా రాజ్ మల్టిపుల్ స్కెర్లోసిస్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్‌కి కార్యనిర్వాహక సభ్యురాలిగా పనిచేస్తున్నారు. లాభాపేక్ష లేని ఈ సంస్థ ద్వారా మల్టిపుల్ స్కెర్లోసిస్ బారిన పడిన వ్యక్తుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు.

– నిర్మలారెడ్డి

యూత్ ప్లస్

యూత్ అంటే సరదా సరదా సంగతులేనా? బ్లాక్‌బస్టర్ సినిమాల కలర్‌ఫుల్ కబుర్లేనా? ఎప్పుడూ నెట్‌లోక విహారమేనా? అనే ప్రశ్నలకు 'కాదు' అనేది సమాధానం. ఆశ్చర్యం గొలిపే ప్రపంచ విషయాలపై ఆసక్తి చూపే యువతరం తమ మానసిక ప్రపంచంలోకి కూడా తొంగిచూస్తూ 'నేనేమిటి?' అని ప్రశ్నించుకుంటున్నారు. ఆ ప్రశ్నల వెలుగులోనే పురాతన జపనీస్ కాన్సెప్ట్‌లపై దృష్టి సారిస్తున్నారు. తమను తాము పునర్నిర్వచించుకుంటున్నారు. పునర్నిర్మించుకుంటున్నారు...



జాదూ హై జపానీ

ది ఆర్ట్ ఆఫ్ సెల్ఫ్-రిపేర్

ఒక వస్తువు దెబ్బతింటే 'ఇక దీనితో పనిలేదు' అని బయటకు విసిరేయడం ఒక పద్ధతి. 'అలా కాదు దీని రీకన్‌స్ట్రక్ట్ చేద్దాం' అనుకోవడం మరోపద్ధతి. మొదటితో దానితో పోల్చితే రెండో దాంట్లో కాస్తో కూస్తో కష్టం ఉండవచ్చు. అయితే అద్భుతమైన ఫలితం ఉంటుంది. ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చే ఆశాజనిత ఫలితం అది. దెబ్బతిన్న వస్తువులను వదిలేయడం కంటే పునర్నిర్మించడంలో అందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని చూస్తుంది 'కిన్ సూగి' కాన్సెప్ట్. 'పర్‌ఫెక్షన్' అనే భావనను ప్రశ్నిస్తుంది. ఎదురుదెబ్బల తరువాత మనల్ని మనం పునర్నిర్మించుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది.

ఇప్పుడు మనం బిహార్‌లోని భాగల్పూర్ జిల్లాకు చెందిన అభిజిత్ దగ్గరకు వెళదాం. ప్రేమవిఫలమై ఇరవై సంవత్సరాల వయసులో డిప్రెషన్‌లోకి వెళ్లాడు అభిజిత్. ఆ తరువాత మద్యానికి అలవాటు పడ్డాడు. రోజూ లేవగానే అద్దంలో ముఖం చూసుకోవడం అభిజిత్ అలవాటు. కొత్త అలవాట్ల ప్రభావం ముఖంపై కనిపించేది. అద్దంలో తనను తాను చూసుకున్నట్లుగా లేదు. రోగ బాధితుడైన అపరిచితుడిని చూస్తున్నట్లుగా ఉండేది.

'ఇక నా జీవితం ముగిసినట్లే' అని అభిజిత్ అనుకుంటున్న చీకటి రోజుల్లో ఒకరోజు ఫేస్‌బుక్‌లో 'కిన్ సూగి' గురించి చదివాడు. ఆ చిన్న ఆర్టికల్ తనకు ఎంత కిక్ ఇచ్చిందంటే 'కిన్ సూగి' గురించి ఇంటర్నెట్‌లో ఎక్కడ ఏ సమాచారం దొరికినా ఆబగా చదివేటంతగా. తనను తాను దెబ్బతిన్న వస్తువుతో పోల్చుకున్నాడు అభిజిత్. 'కిన్ సూగి' కాన్సెప్ట్ ప్రకారం తనను తాను పునర్నిర్మించుకోవాలి. అందులోని సౌందర్యాన్ని ఆస్వాదించాలి. అలాగే జరిగింది... ఒక్కటొక్కటిగా అభిజిత్ తన దురలవాట్లు అన్నీ మానుకున్నాడు. తొలి విజయం దక్కింది. 'నేనేమిటీ?' అని అద్దంలోకి కాదు మనసులోకి తొంగిచూసుకున్నాడు.

'నీలో అద్భుతమైన వాక్చాతుర్యం ఉంది. నువ్వు ఎంత జటిలమైన విషయాన్ని అయినా సులభంగా అర్థమయ్యేలా చెబుతావు' ఈ మాట తనతో ఎందరో ఎన్నోసార్లు అన్నారు.

'నా బలం ఆచూకీ తెలిసింది' అనుకున్నాడు అభిజిత్. మ్యాథ్స్‌లో పట్టు ఉన్న అభిజిత్ హైస్కూల్ విద్యార్థుల కోసం మ్యాథ్స్ ట్యుటోరియల్ మొదలుపెట్టాడు. ఈ ట్యుటోరియల్‌కు మొదట్లో పదవతరగతి తప్పిన విద్యార్థులే ఎక్కువగా వచ్చేవారు. 'సార్, మ్యాథ్స్ బాగా చెబుతున్నారు' అనే టాక్ నుంచి ట్యుటోరియల్ కాస్త స్కూల్‌గా మారడానికి ఎంతో కాలం పట్టలేదు. ఇప్పుడు ఆ ఏరియాలో బాగా పేరున్న స్కూల్‌గా మారింది.

'కిన్ సూగి కేవలం కాన్సెప్ట్, ఆర్ట్ ఫామ్ కాదు. ఫిలాసఫీ ఆఫ్ లైఫ్' అంటాడు తన జీవితాన్ని తానే రిపేర్ చేసుకున్న అభిజిత్.

> **అక్షరాలా...**
>
> వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి ఇంగ్లిష్‌లో వచ్చిన జపాన్ సాహిత్యంపై యువతరం ఆసక్తి చూపుతోంది. హెక్టర్ గార్సియ 'ఇకీగై', మైక్ వైకింగ్ 'ది లిటిల్ బుక్ ఆఫ్ హూగా', మారి కొండో 'ది లైఫ్ చేంజింగ్ మ్యాజిక్ ఆఫ్ టైడింగ్ అప్', చిన్-నింగ్ చూ 'థిక్ ఫేస్, బ్లాక్ హార్ట్', నెయిమి మోరియామా 'జపనీస్ ఉమెన్ డోన్ట్ గెట్ వోల్డ్ ఆర్ ఫ్యాట్' కెన్‌డిస్ కుమై 'కిన్ సూగి వెల్‌నెస్: ది జపనీస్ ఆర్ట్ ఆఫ్ నరిషింగ్ మైండ్, బాడీ అండ్ స్పిరిట్'... మొదలైన పుస్తకాలు ఆదరణ పొందాయి.

మల్టీ నేషనల్ కన్స్యూమర్ గూడ్స్ కంపెనీ 'మారికో' సీయీవో హర్ష్ మారివాలా తనపై అత్యంత ప్రభావం చూపిన గమన్, కైజెన్, వాబీ-సాబీ... మొదలైన ఏడు జపనీస్ కాన్సెప్ట్‌లపై ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన పోస్ట్‌ను కొంత కాలం క్రితం చదివింది ముంబైకి చెందిన యుక్త. వాటి గురించి ఆసక్తిగా అధ్యయనం చేసింది. ఆ కాన్సెప్ట్‌లలో కొన్ని...

'సానుకూల మార్పును తీసుకురాగల అంశాలపై దృష్టి పెట్టాలి' అంటుంది షికత గనై.

'ప్రతి వ్యక్తికి తమవైన శక్తిసామర్థ్యాలు ఉంటాయి. వాటి ఆధారంగానే సొంతంగా ఎదుగుతారు. ఇతరుల విజయాల ఆధారంగా వారిని పోల్చడం హానికరం. వేరే వారి మార్గాన్ని బట్టి మిమ్మల్ని మీరు అంచనా వేసుకోకూడదు' అంటుంది ఒబైతొరి.

కైజెన్ కాన్సెప్ట్ 'నిరంతరం మెరుగుపడడం' గురించి చెబుతుంది. మార్పు అనేది అనూహ్యంగా ఒక్కసారే రాదు. క్రమక్రమంగా వస్తుంది. ఈరోజు వేసే చిట్టి పొట్టి అడుగులు కూడా దూసుకుపోయే రేపటి వేగానికి ఇంధనం అవుతాయి.

మనం ఏదైనా నేర్చుకోవాలనుకున్నప్పుడు మూడు దశలలో ప్రయాణించాలి అంటుంది శు-హ-రి. ఈ జపనీస్ మార్షల్ ఆర్ట్ కాన్సెప్ట్‌లోని మూడు దశలు...శు-హ-రి. 'శు' దశలో నేర్చుకోవడానికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. ఇక వేరే ఆలోచన అంటూ ఉండదు. 'హ' దశలో 'నేర్చుకోవాలి' 'నేర్చుకున్నాను'కు మాత్రమే పరిమితం కారు. నేర్చుకున్న వాటి ఆధారంగా కొత్త విషయాల గురించి ఆలోచిస్తారు. 'రి' దశలో క్రియేటివ్ టెక్నిక్‌కు సంబంధించి కొత్త ద్వారం తెరుచుకుంటుంది. కొత్త ఆవిష్కరణలు జరుగుతాయి. 'ఏదీ పరిపూర్ణం కాదు. ఎవరూ పరిపూర్ణులు కారు' అంటుంది వాబీ-సాబీ. అసంపూర్ణమైన వస్తువులు, ప్రకృతి దృశ్యాలలో అందం, ప్రశాంతతని కనుగొనే సౌందర్యభావన ఇది.

'కేవలం ఆసక్తితో మాత్రమే వాటి గురించి తెలుసుకున్నాను. అయితే వాటి ప్రభావంతో నాలో ఎంతో మార్పు వచ్చింది' అంటుంది యుక్త.


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 317

బుధవారం 7-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ రైస్ విక్రయాలు షురూ

కేజీ ధర రూ.29. రాయితీ ధరకు కేంద్రం బియ్యం -6లో



ఐటీ, ఇంధన షేర్లకు డిమాండ్

సెన్సెక్స్ లాభం 455 పాయింట్లు. 158 పాయింట్లు పెరిగిన నిఫ్టీ -11లో



ఉత్తరాఖండ్‌లో 'పౌరస్మృతి' బిల్లు

ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ కీలకమైన ఉమ్మడి పౌరస్మృతి బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టారు.

వివరాలు 6లో ▸



67 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

రాబోయే ఐదారేళ్లలో మన దేశ ఇంధన రంగంలోకి 67 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాబోతున్నాయని ప్రధాని చెప్పారు.

వివరాలు 11లో ▸



పాక్ బరిలో... ఆమె అంతంతే

పాకిస్తాన్ ఎన్నికల బరిలో ఉన్న మొత్తం 17 వేల మంది పై చిలుకు అభ్యర్థుల్లో మహిళలు ఎందరో తెలుసా? కేవలం 839 మంది.

వివరాలు 6లో ▸



అజిత్ వర్గమే అసలు ఎన్సీపీ

ఎన్సీపీ వ్యవస్థాపకుడు పవార్ సోదరుడి కుమారుడు అజిత్ పవార్ నేతృత్వంలోని చీలిక వర్గమే అసలైన ఎన్సీపీ అని ఈసీ తేల్చింది.

వివరాలు 6లో ▸

టచ్ చేసి చూడు

సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సవాల్

- బీఆర్‌ఎస్‌ను, నన్ను కొత్త సీఎం ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారు
- నన్ను, నా పార్టీని టచ్ చేయడం నీతో కాదు.. నీ కంటే హేమాహేమీలనే ఎదుర్కొన్న చరిత్ర మాకుంది
- పదేళ్లు కాపాడుకున్న రాష్ట్రాన్ని పరాయివాళ్ల పాలు చేస్తున్నారు
- ప్రభుత్వాన్నైనా రద్దు చేస్తా కానీ ప్రాజెక్టులను అప్పగించనని నేను కేంద్రానికి చెప్పా
- కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది
- సర్కారు వైఖరితో రాష్ట్రం మళ్లీ కరువు కోరల్లో చిక్కుకునే ప్రమాదం
- తెలంగాణ విషయంలో కేసీఆర్ వెనక్కి పోడు.. ఉడుత బెదిరింపులకు భయపడడు
- సాగు, తాగునీటి హక్కుల రక్షణ లక్ష్యంగా 13న నల్లగొండలో భారీ బహిరంగ సభ
- తుంటి ఎముకకు శస్త్రచికిత్స తర్వాత తొలిసారి తెలంగాణ భవన్‌కు కేసీఆర్



తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, పొన్నాల లక్ష్మయ్య తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రాన్ని పదేళ్లు పదిలంగా కాపాడుకున్నాం. దాన్ని పరాయి వాళ్ల పాలు చేస్తున్నారు. తెలంగాణ విషయంలో కేసీఆర్ ఏనాడూ వెనక్కిపోడు. ఉడుత బెదిరింపులకు భయపడడు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఏం చేయాలో నాకు బాగా తెలుసు. నదీ జలాల విషయంలో రాష్ట్రం హక్కులను కాపాడుకునేందుకు ఎంతవరకైనా పోరాడతాం. కొత్త సీఎం బీఆర్‌ఎస్ పార్టీని, వ్యక్తిగతంగా నన్ను ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారు. నన్ను, నా పార్టీని టచ్ చేయడం నీతో కాదు. నీ కంటే హేమాహేమీలనే ఎదుర్కొన్న చరిత్ర మాకుంది..' అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్టుల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడం, తెలంగాణ సాగునీటి హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఈ నెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇటీవల

మిగతా 3వ పేజీలో ▶

బీఆర్‌ఎస్ నేతలకు కాంగ్రెస్ గాలం!

టచ్‌లోకి మరో ముగ్గురు ఎంపీలు.. పలువురు ఎమ్మెల్యేలు

- ప్రతిపక్షాన్ని బలహీనపర్చడంతోపాటు రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రణాళిక
- పదవులు, పనులు, వ్యాపార అవసరాల ప్రాతిపదికన ప్రలోభాలు?
- పార్టీలో చేరిన ఎంపీ వెంకటేశ్ నేతకు మళ్లీ పెద్దపల్లి టికెట్ హామీ!



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలకు అధికార కాంగ్రెస్ పార్టీ గాలం వేస్తోంది. పార్లమెంటు ఎన్నికలకు ముందే బీఆర్‌ఎస్‌ను బలహీనపర్చడంతో పాటు త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థిని కూడా బరిలోకి దింపి విజయం సాధించడమే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా దక్షిణ తెలంగాణకు చెందిన ముగ్గురు సిట్టింగ్ ఎంపీలు, హైదరాబాద్ పరిసరాల్లోని పలువురు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ నేతలు ఇప్పటికే మంతనాలు ప్రారంభించారని... వారిలో 7–8 మంది ఎమ్మెల్యేల విషయంలో స్పష్టత వచ్చిందని తెలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు, దక్షిణ తెలంగాణకు చెందిన మరో ఎమ్మెల్యేతో కూడా చర్చలు పురోగతిలో ఉన్నట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పదవులు, ప్రలోభాలు, వ్యాపార అవసరాల ప్రాతిపదికన బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులను కాంగ్రెస్ నేతలు ప్రలోభ పెడుతున్నట్లు తెలిసింది.

లోక్‌సభ ఎన్నికల కంటే ముందే రాజ్యసభ ఎన్నికలు జరుగుతుండటం, ఈ ఎన్నికల్లో విప్ జారీ చేసే అధికారం పార్టీలకు లేకపోవడంతో ఆపరేషన్ ఆకర్ష్‌ను ఎట్టిపరిస్థితుల్లో విజయవంతం చేయడంపై టీపీసీసీ పెద్దలు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తద్వారా తాము నిలబెట్టే మూడో అభ్యర్థి విజయం సాధిస్తే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందనే భావనను ప్రజల్లో కలిగించొచ్చనేది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ప్రస్తుతానికి ఈ ఎమ్మెల్యేలంతా తమ మూడో అభ్యర్థికి ఓటు వేయడం వరకే పరిమితం కావాలని, లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీలో చేర్చుకొనే అంశంపై నిర్ణయం తీసుకోవాలనే యోచనలో రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలున్నారని సమాచారం. ఈ విషయాన్ని ఏఐసీసీకి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని, ఏఐసీసీ అనుమతి మేరకే మూడో అభ్యర్థిని మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎంపీ వెంకటేశ్ నేత 2లో

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్‌సభకు పోటీగా కాంగ్రెస్ సభ!



నల్లగొండలో బీఆర్‌ఎస్ బహిరంగ సభకు పోటీగా 2 లక్షల మందితో భారీ సభ చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలిసింది. మంత్రి కోమటిరెడ్డి ఈ మేరకు ప్రతిపాదించగా అందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని సమాచారం.

- వివరాలు 2లో▶

రూ.8 కోట్ల డ్రగ్స్ స్వాధీనం



మెట్రోనగరాల్లో తన నెట్‌వర్క్ ద్వారా డ్రగ్స్ దందా చేస్తున్న నైజీరియన్‌ను టీఎస్ నాబ్ అధికారులు పట్టుకున్నారు. ఇతడి నుంచి రూ.8 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నట్టు పశ్చిమ మండల డీసీపీ ఎం.విజయ్‌కుమార్ చెప్పారు.

- వివరాలు 12లో▶

మొక్కల లెక్కలు తేల్చండి



హరితహారం కింద మాజీ సీఎం కేసీఆర్, హరీశ్, జోగినిపల్లి సంతోష్‌కుమార్ స్వగ్రామాలు, కవిత అత్తగారి ఊరిలో నాటిన మొక్కలు ఎన్ని? ప్రస్తుతం ఎన్ని చెట్లు ఉన్నాయి? చేసిన ఖర్చు ఎంత? వంటి అంశాలపై నివేదిక సమర్పించాలని అటవీ శాఖను రాష్ట్ర మంత్రివర్గం ఆదేశించింది.

- వివరాలు 2లో▶

బడా కంపెనీలతో బంధం



నిబంధనలకు విరుద్ధంగా పలు రియల్ ఎస్టేట్ కంపెనీలకు అనుమతులిచ్చిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ..అందుకు ప్రతిఫలంగా కోట్ల రూపాయలు మూటగట్టుకున్నట్టు ఏసీబీ అధికారుల దర్యాప్తులో వెలుగుచూసినట్టు సమాచారం.

- వివరాలు 3లో▶

18న అభ్యర్థుల ప్రకటన?

ఈ నెల 20 నుంచి ఎంపీ స్థానాల పరిధిలో రథయాత్రలకు బీజేపీ నిర్ణయం

- ఎన్నికల కార్యాచరణ, అభ్యర్థుల ఎంపికపై ఆరెస్సెస్ నేతలతో జాతీయ ముఖ్యనేతల భేటీ
- గావ్ చలో, ఘర్ చలో కార్యక్రమం ద్వారా ఇంటింటి ఎన్నికల ప్రచారం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మిగతా రాజకీయ పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించడం ద్వారా లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగాలని బీజేపీ నాయకత్వం యోచిస్తోంది. లోక్‌సభ ఎన్నికల కసరత్తు పూర్తిచేసి ఈ నెల 18న అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఢిల్లీలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశాలప్పుడు పార్టీ పార్లమెంటరీ బోర్డు భేటీ కానున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈ సందర్భంగానే లోక్‌సభ అభ్యర్థులను ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల ఎంపికలో జరిగిన ఆలస్యం లోక్‌సభ ఎన్నికలకు జరగకుండా అభ్యర్థులను ముందే ప్రకటిస్తామని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో హామీ ఇచ్చారు. ఇందుకు తగ్గట్లుగానే త్వరలో అభ్యర్థులను ఖరారు చేస్తామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో వివిధ సర్వేలు, ఇతర అంశాల ఆధారంగా అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ఊపందుకున్నట్లు తెలుస్తోంది.



షెడ్యూల్ వెలువడేలోగా యాత్రలు..

ఈ నెల 20 నుంచి 17 ఎంపీ సీట్ల పరిధిలో రథ (బస్సు) యాత్రలకు జాతీయ నాయకత్వం నిర్ణయించింది. ఈ యాత్రలను మొదట ఈ నెల 10 నుంచి మొదలుపెట్టాలనుకున్నా అభ్యర్థులు ఖరారయ్యాక చేపడితే మరింత ప్రయోజనం ఉంటుందనే ఉద్దేశంతో ఈ నెల 20 నుంచి యాత్రలను నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఎంపీ సీట్లను 5 క్లస్టర్లుగా (మూడు, నాలుగేసి సీట్లు ఒక్కో క్లస్టర్ చొప్పున) బీజేపీ జాతీయ నాయకత్వం విభజించింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగా ఈ యాత్రలను పూర్తిచేయడం ద్వారా మిగతా పార్టీల కంటే ముందే తొలివిడత ప్రచారాన్ని పూర్తిచేసినట్లు అవుతుందని భావిస్తోంది. రోజుకు రెండేసి అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున నెలాఖరుకల్లా ఆయా లోక్‌సభ క్లస్టర్లలోని అసెంబ్లీ సెగ్మెంట్లను కవర్ చేసే యోచనలో పార్టీ ఉంది. త్వరలోనే ఆయా క్లస్టర్లవారీగా రథయాత్రల

మిగతా 3వ పేజీలో ▶

'స్వగృహ'కు స్వస్తి

అసంపూర్తి ఇళ్లు, భూములు అమ్మాలని నిర్ణయం

- ఉన్నవి ఉన్నట్టు బేరం పెట్టేందుకు ధరల ఖరారుకు కమిటీ.. రూ.3,500 కోట్ల వరకు సమకూరే అవకాశం
- గంపగుత్తగా అమ్మేయాలని యోచన



సాక్షి, హైదరాబాద్: రాజీవ్ స్వగృహకు స్వస్తి చెప్పే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణ ప్రాజెక్టులు, భూములను అమ్మేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని అమ్మితే రూ.3500 కోట్లు సమకూర్చుకునే అవకాశముందని ప్రభుత్వం తేల్చినట్టు తెలిసింది. కొన్ని ఖాళీ భూములు వివాదంలో ఉండగా, మిగతావి అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. బండ్లగూడ, పోచారం ప్రాజెక్టులు సహా మరికొన్ని చోట్ల ఉన్న అసంపూర్తి ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా వ్యక్తులకుగానీ, గంపగుత్తగా సంస్థలకు గానీ అమ్మేయనున్నారు. వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నందున ప్రస్తుతం ఆ ఇళ్లకు, ఖాళీగా ఉన్న భూములకు ప్రస్తుత మార్కెట్ ప్రకారం ఏ ధర నిర్ణయించాలో తేల్చేందుకు ఓ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ నివేదిక తర్వాత విక్రయ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

అప్పుడే అమ్మిఉంటే..

బండ్లగూడ, పోచారంలలో 6 వేలకుపైగా ఇళ్లను ఫ్లాట్ల రూపంలో గతంలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ విక్రయించింది. పూర్తిస్థాయిలో సిద్ధమైన ఇళ్లు అప్పట్లో హాట్‌కేకులుగా అమ్ముడుపోయాయి. కానీ, నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి మరణం తర్వాత ఆ కార్పొరేషన్ పూర్తిగా గతి తప్పింది. రాజకీయ నేతలు, కొందరు ఉన్నతాధికారులు కుమ్మక్కయి అక్రమాలకు పాల్పడి నిధులు దారి మళ్లించారు. ఫలితంగా చేతిలో డబ్బు లేక మిగతా ఇళ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయలేకపోయారు. ఈ నెపాన్ని నాటి స్వగృహ కార్పొరేషన్ అధికారులపై నెట్టేసి ఉన్నతాధికారులు, నేతలు చేతులు దులుపుకున్నారు. తర్వాతి ప్రభుత్వాలు ఆ ఇళ్లను పట్టించుకోలేదు. అన్నింటిని సిద్ధం చేసి ఉంటే మంచి ధరలకు అమ్ముడుపోయి, కార్పొరేషన్‌కు నిధులు సమకూరి ఉండేవి. వాటితో మిగతా చోట్ల పనులు జరిపితే అవి కూడా అమ్ముడుపోయేవి. కానీ ఆ చొరవ లేక కార్పొరేషనే దివాలా తీసింది. ఏడాదిన్నర క్రితం ఉన్నవి ఉన్నట్లుగా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో విక్రయించారు. బండ్లగూడ, పోచారంలలో మూడు వేల ఫ్లాట్ల విక్రయం ద్వారా రూ.700 కోట్లు సమకూరాయి. తొర్రూరు, బహదూర్‌పల్లిలతో పాటు ఆదిలాబాద్, కామారెడ్డి, నిజామాబాద్‌లాంటి కొన్ని జిల్లాల్లో లేఔట్ల

మిగతా 3వ పేజీలో ▶

60 గ్రూప్-1 పోస్టులకు గ్రీన్‌సిగ్నల్

- టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ అనుమతి

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 కేటగిరీలో మరో 60 పోస్టులు భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆర్థిక, హోం, కార్మిక, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల పరిధిలో ఈ పోస్టులను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారా భర్తీ చేసేందుకు అనుమతినిస్తూ ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం జీఓ నం.16 జారీ చేశారు. నోటిఫికేషన్ జారీ చేసి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో ఈ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోస్టుల వారీగా వివరాలు

- వివరాలు 3లో



మే 9 నుంచి టీఎస్‌ఈఏపీసెట్

- [illegible] ఏప్రిల్ 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 6 నుంచి పీజీ సెట్.. మార్చి 16 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తేదీలు వెల్లడించిన సెట్స్ కన్వీనర్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్ఈఏపీసెట్)ను మే 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు సెట్ కన్వీనర్ డాక్టర్ దీన్‌కుమార్ వెల్లడించారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 21వ తేదీన విడుదల చేస్తున్నామన్నారు. ఈసారి ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ సిలబస్‌ను వందశాతం అమలు చేస్తామని చెప్పారు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఉంటుందన్నారు. పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశపరీక్ష (టీఎస్‌పీజీ సెట్)ను

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



అయితే ఇప్పుడు లేనట్టేగా!

శ్రమించి... ఛేదించి..


సచిన్ దాస్

బెనోని: డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన యువ భారత జట్టు అండర్–19 ప్రపంచకప్‌లో తమ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. లీగ్ దశలో, సూపర్ సిక్స్ దశలో అజేయంగా నిలిచిన టీమిండియా సెమీఫైనల్ నాకౌట్ మ్యాచ్‌లోనూ గెలిచి టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టుతో మంగళవారం జరిగిన తొలి సెమీఫైనల్లో భారత్ 2 వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా ఈ టోర్నీ చరిత్రలో తొమ్మిదోసారి ఫైనల్ బెర్త్‌ను

9వసారి అండర్-19 ప్రపంచకప్‌లో ఫైనల్ చేరిన టీమిండియా

సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై 2 వికెట్లతో విజయం

ఖరారు చేసుకుంది. ఐదుసార్లు అండర్–19 ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన భారత్, మూడుసార్లు రన్నరప్‌గా నిలిచింది. సెమీఫైనల్లో మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 244 పరుగులు సాధించింది. అనంతరం భారత్ 48.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 248 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఒకదశలో 32 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడిన భారత జట్టును సచిన్ దాస్ (95 బంతుల్లో 96; 11 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ ఉదయ్ సహారణ్ (124 బంతుల్లో 81; 6 ఫోర్లు) బాధ్యతాయుత అర్ధసెంచరీలతో ఆదుకున్నారు.

- వివరాలు 10లో

బాణసంచా యూనిట్‌లో

పేలుడు..

11 మంది మృతి

- మరో 100 మందికి పైగా గాయాలు.. మధ్యప్రదేశ్‌లో ఘటన

మధ్యప్రదేశ్‌లోని హర్దాలో బాణసంచా కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో 11 మంది చనిపోగా, మరో 100 మందిపైగా గాయాలపాలయ్యారు. మంగళవారం ఉదయం బైరాగఢ్‌లోని ఫ్యాక్టరీలో శక్తివంతమైన పేలుడు సంభవించిందని, అనంతరం మంటలు వ్యాపించాయని అధికారులు తెలిపారు. పేలుడు తీవ్రతకు మంటలు చెలరేగి ఫ్యాక్టరీ చుట్టుపక్కలున్న 50కి పైగా ఇళ్లు కాలిబూడిదయ్యాయి.

- వివరాలు 6లో



మంగళవారం మధ్యప్రదేశ్ హర్దాలో బాణసంచా కర్మాగారం నుంచి ఎగసిపడుతున్న మంటలు

క్లుప్తంగా...

ఫసల్ బీమాలో 40.11లక్షల హెక్టార్లకు బీమా

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా 2016–17 నుంచి 2022–23 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని 115.41 లక్షల హెక్టార్లలో పంటలను బీమా చేశారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. అదే సమయంలో తెలంగాణలోని 40.11 లక్షల హెక్టార్లలో పంటను బీమా చేశారని మంగళవారం బీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

'మాదిగలకు మూడు ఎంపీ స్థానాలు ఇవ్వాలి'

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు రాష్ట్రంలో మూడు స్థానాలను ఇవ్వాలని తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట వేదిక చైర్మన్ వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్ మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు ఒక జనరల్, రెండు రిజర్వ్‌డ్ స్థానాలను కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు.

పతంజలి 'మిలనోగ్రిట్‌కు' అంతర్జాతీయ గుర్తింపు


సాక్షి, హైదరాబాద్: పతంజలి ఆయుర్వేద ఔషధం మిలనోగ్రిట్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. స్వచ్ఛమైన వనమూలికలతో చర్మ సౌందర్య రక్షణకు సంబంధించి తయారు చేసిన ఔషధం మిలనోగ్రిట్‌పై ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ బయోసైన్స్ రిపోర్ట్స్‌లో కవర్‌పేజీ కథనాన్ని ప్రచురించింది. చర్మ సౌందర్య రక్షణకు సంబంధించి పతంజలి రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన పరిశోధనల్లో మిలనోగ్రిట్ అద్భుతంగా పనిచేస్తుందని వెల్లడైనట్లు పతంజలి యోగపీఠ్ ప్రొఫెసర్ బాలకృష్ణ ఓ ప్రకటనలో వివరించారు. ఈ విషయాన్ని బ్రిటన్‌కు చెందిన మ్యాగజైన్ బయోసైన్స్ రిపోర్ట్స్‌లో శాస్త్రీయంగా నిరూపిస్తూ కథనాన్ని వెలువరించిందని తెలిపారు. మిలనోగ్రిట్‌పై ప్రచురించిన కథనాన్ని https://portalandpress.com/bioscirep లో చూడవచ్చన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రపంచ చాంపియన్‌గా 'శ్రీ చైతన్య'

సాక్షి, హైదరాబాద్: అమెరికా నాసా వారి నేషనల్ స్పేస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్) ప్రపంచ వ్యాప్తంగా 12 నుంచి 18 ఏళ్ల వయసున్న విద్యార్థులకు స్పేస్ సెటిల్‌మెంట్‌లో అగ్రికల్చరల్ మాడ్యుల్ డిజైన్ మీద తొలిసారిగా నిర్వహించిన 'లివ్ ఇన్ ఏ హెల్దీ స్పేస్'డిజైన్ పోటీల్లో శ్రీ చైతన్య ప్రపంచ చాంపియన్‌గా నిలిచినట్టు ఆ విద్యాసంస్థల డైరెక్టర్ సీమ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 47 ప్రాజెక్టులు ఎంపికవగా.. అందులో 28 ప్రాజెక్టులు శ్రీ చైతన్య వేనని పేర్కొన్నారు. మొత్తం 47 ప్రాజెక్టుల్లో భారతదేశం నుంచి 31 ప్రాజెక్టులు ఎంపికవగా.. అందులో 28 ప్రాజెక్టులు శ్రీచైతన్యవే అని వివరించారు.

ఆదివాసీలంటే బీజేపీకి గౌరవం

రాజ్యసభలో బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని ఆదివాసీలంటే బీజేపీకి ఎంతో గౌరవమని ఆ పార్టీ ఎంపీ డాక్టర్‌కె.లక్ష్మణ్ అన్నారు. అందుకే 2014 నుంచి ఇప్పటివరకు ఆదివాసీలకు సంబంధించిన అనేక అంశాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. మంగళవారం రాజ్యసభలో రాజ్యాంగ(షెడ్యూల్ ట్రైబ్స్) ఆర్డర్ సవరణ, రాజ్యాంగ (ఎస్సీ అండ్ ఎస్టీ) ఆర్డర్ సవరణ బిల్లు–2024ను కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా ప్రవేశపెట్టారు. అనంతరం జరిగిన చర్చలో బీజేపీ తరఫున లక్ష్మణ్ ప్రసంగించారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే విధంగా తెలంగాణ ట్రైబల్ యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వం సమ్మక్క–సారక్క పేరు పెట్టిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ముందుండి పోరాడిన చిన్న, చిన్న వర్గాలను బీజేపీ ప్రభుత్వం గుర్తించి షెడ్యూల్ ట్రైబ్స్‌లో చేర్చడంతో దాదాపు 75 ఏళ్ల తర్వాత ఈ వర్గాలకు మేలు జరిగినట్లు అయిందని తెలిపారు.

తెలుసు కాబట్టే సాగర్, శ్రీశైలం కట్టాం

కేసీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి కౌంటర్



సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాలపై కాంగ్రెస్ పార్టీ నేతలకు అవగాహన లేదని మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సమావేశానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'కృష్ణా జలాల గురించి తెలుసు కాబట్టే నాగార్జునసాగర్, శ్రీశైలం లాంటి బహుళార్థ సాధక ప్రాజెక్టులను కట్టాం. నీళ్ల గురించి తెలియదు కాబట్టే బీఆర్ఎస్ నేతలు కూలిపోయే కాళేశ్వరం కట్టారు..'అని వ్యాఖ్యానించారు.

గుట్టపైనే అన్ని సేవలు..!

- 'యాదగిరి' మహిమాన్విత సేవలు కొనసాగాలంటున్న భక్తులు
- రాత్రి నిద్ర భక్తులకెంతో పవిత్రం.. విష్ణుపుష్కరిణిలో స్నానం ఆరోగ్యదాయకం



యాదాద్రి దేవస్థానం

కొండపైన విష్ణు పుష్కరిణి

సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్టపైనే అన్ని సేవలు పునరుద్ధరించాలని భక్తజనులు కోరుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ కూడా భక్తుల నుంచి వినిపిస్తోంది. గత ప్రభుత్వంలో జరిగిన ఆలయ విస్తరణ, అభివృద్ధితో భక్తులు కోరుకునే మహిమాన్విత పవిత్ర సేవలను కొండపైనుంచి కిందికి తరలించారు. దీంతో పుణ్యక్షేత్రంలో ప్రాశస్త్యం లోపిస్తుందని భక్తులు అంటున్నారు. దీనికి తోడు కొండపైన వసతుల లేమి భక్తులకు ఇబ్బందిగా మారింది.

అన్నీ గుట్ట కిందనే...: కొండపైన ఆలయ విస్తరణ, అభివృద్ధికి ముందు యాదగిరిగుట్టలో భక్తులకు అన్ని వసతులు కొండపైనే ఉండేవి. వేలాది మంది భక్తులు ఎంతో దూరం నుంచి వచ్చి అన్ని రకాల సేవలను కొండపైనే పొందేవారు. రాత్రి నిద్ర గుట్టపైనే చేసేవారు. ప్రధానంగా కల్యాణకట్ట(తలనీలాలు సమర్పించడం), సత్యనారాయణస్వామి వ్రతాలు, విష్ణుపుష్కరిణి (స్నాన గుండం), రాత్రి నిద్ర చేయడం, అన్నప్రసాద వితరణ సేవలను కొండకిందకు మార్చారు. దీంతో కొండపైన సేవలందకపోవడంతో భక్తిభావం కొరవడిందంటున్నారు.

డార్మెటరీ హాల్ నిర్మాణం: కొండపైన గతంలో బాలాలయం ఉన్నచోట డార్మెటరీ హాల్ నిర్మిస్తే రాత్రి నిద్ర చేయవచ్చని భక్తులు కోరుతున్నారు. కొండపైన నిర్మించిన రెండు భవనాల్లో అన్నదానం, సత్యనారాయణస్వామి వ్రతాలు కొనసాగించవచ్చు. కొండపైన మరో చోట కల్యాణ కట్ట ఏర్పాటు చేసి ఎంతో విశిష్టత కలిగిన విష్ణు పుష్కరిణిలో భక్తుల స్నానాలు చేసేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. యాదాద్రి క్షేత్రంపై అధ్యయనం చేస్తున్న ప్రభుత్వం భక్తుల మనోభావాలను గౌరవించాలని కోరుతున్నారు.

భక్తుల వసతులకు ప్రాధాన్యం



ప్రభుత్వం భక్తుల మనోభావాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుంది. కొండపైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు అధికారులతో సమీక్ష నిర్వహించాం. రూ.20 కోట్లతో డార్మెటరీ భవనం నిర్మించాలని నిర్ణయించాం. కొండపైన వసతులు కల్పిస్తాం. ఆలయ ప్రాశస్త్యం కొనసాగిస్తాం.

– బీర్ల అయిలయ్య, ఆలేరు ఎమ్మెల్యే

తలనీలాల సమర్పణ కొండపైనే ఉండాలి



యాదాద్రి పునర్నిర్మాణం తర్వాత మొదటిసారిగా దర్శించుకున్నాం. పాతగుడి ఉన్నప్పుడు ఒకసారి వచ్చాం, అప్పుడు తలనీలాలు గుడిపైనే తీసేవారు. ఇప్పుడు మాత్రం తలనీలాలను కొండ కింద తీస్తున్నారు. తలనీలాలు అర్పించి కొండపైకి దర్శనానికి రావడానికి ఇబ్బందికరంగా ఉంది. దేవుని కొండపైన తలనీలాలను ఏర్పాటు చేస్తేనే స్వామి అనుగ్రహం కలుగుతుంది. ఇక్కడ భక్తులకు కావాల్సిన కనీస వసతులు కనబడడం లేదు. బాత్రూమ్‌లు కూడా సరిగ్గా లేవు.

– మేతరి దశరథ, భక్తుడు, నిజామాబాద్

ప్రాంగణంలో నిద్రిస్తే ప్రశాంతత ఉండేది



లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి ప్రతి సంవత్సరం వస్తాం. గతంలో దర్శనానికి వచ్చినప్పుడు నారసింహుడి సన్నిధిలో కొండపైన రాత్రి వేళల్లో నిద్రపోయేవాళ్లం. మాకు ఆధ్యాత్మిక భావన కలిగేది. ఇప్పుడు కొత్త గుడి కట్టాక అన్ని వసతులు మార్చేశారు. అసలు కొండపైన నిద్రపోవడానికి అనుమతి లేకుండా పోయింది. కిందనే నిద్రించి పైకి రావడానికి అవస్థలు పడుతున్నాం. అసలే నడవలేని స్థితిలో ఉన్న నాలాంటి వారు కింద బస చేసి, మళ్లీ పైకి రావాలంటే చాలా ఇబ్బందులు ఉన్నాయి.

– ఎస్.బుచ్చమ్మ, భక్తురాలు, హైదరాబాద్

కొండపైనే పుష్కరిణి ఉండాలి



గుట్టలో రాత్రి బస చేశాం. ఉదయం ఆలయానికి బస్సులో పొమ్మని చెప్పారు. బస్సెక్కాక మమ్మల్ని ఆల య బస్టాప్ దగ్గర దింపి గుండంకిందనే ఉంటుందని, అక్కడే స్నానం చేయాలని సూచించారు. దీంతో గుండం వద్దకి వెళ్లి స్నానాలు చేసి అనంతరం కొండపైకి వెళ్లి దర్శనాలు పూర్తిచేసుకున్నాం. పుష్కరిణి కింద ఉండటంతో చాలా అవస్థలు పడ్డాం. గతంలో మాదిరిగా కొండపైనే పుష్కరిణి ఉంటే అక్కడే స్నానం చేసి, దైవ దర్శనానికి వెళ్తే పుణ్యం దక్కుతుంది.

– సత్యనారాయణ. భక్తుడు, శంషాబాద్

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎంపీ వెంకటేశ్ నేత

- ఢిల్లీలో కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ సమక్షంలో చేరిక
- టీటీడీ మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి, మరికొందరు కూడా..



వెంకటేశ్‌నేతకు కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, పెద్దపల్లి/సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ డాక్టర్ బొర్లకుంట వెంకటేశ్ నేత ఆ పార్టీకి ఝలక్ ఇచ్చారు. కొంత కాలంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ వైఖరితో అసంతృప్తితో ఉన్న ఆయన... ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ గూటి కి చేరారు. మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత అడుగుపెట్టి నేతలతో సమీక్షించిన రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. మరోవైపు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన టీటీడీ మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతోపాటు ఆ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేత రెహ్మాన్, పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం కేసీ వేణుగోపాల్, రేవంత్‌రెడ్డితో కలిసి వెంకటేష్ నేత, మన్నె జీవన్‌రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), జనంపల్లి అనిరుధ్‌రెడ్డి (జడ్చర్ల), గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి (దేవరకద్ర), వీర్లపల్లి శంకర్ (షాద్‌నగర్), ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, మాజీ మంత్రి డాక్టర్ జి.చిన్నారెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరిగి సొంత గూటికి...

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్‌కు చెందిన వెంకటేశ్ నేత 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయల్లోకి వచ్చారు. కాంగ్రెస్ తరఫున 2018లో చెన్నూర్ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి 2019లో పెద్దపల్లి ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. తాజాగా లోక్‌సభ ఎన్నికల వేళ తిరిగి సొంత గూటికి చేరుకోవడం చర్చనీయాంశంగా మారింది.

టికెట్ ఇస్తే ధర్నా చేస్తా: శేజల్

ఎంపీ వెంకటేశ్ నేత బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను కాపాడాడని ఆరిజిన్ డెయిరీ సీఈవో బొడపాటి శేజల్ ఆరోపించారు. తనకు అన్యాయం జరిగిందని ఎంపీకి చెబితే న్యాయం చేస్తామని మాటిచ్చి మోసం చేశారని మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ ఇలాంటి వారిని చేర్చుకొని ఎన్నికల్లో టికెట్ ఇస్తే ఢిల్లీలో ధర్నా చేస్తానని, ఎన్నికల్లో వెంకటేశ్ నేతకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తానని హెచ్చరించారు.

నేడు ధరణి పోర్టల్‌పై మధ్యంతర నివేదిక!

- మంత్రి పొంగులేటికి సమర్పించనున్న పునర్నిర్మాణ కమిటీ
- ధరణి చట్టసవరణకు సభ్యుల సిఫారసు!
- అసెంబ్లీలో చర్చకు వచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ బుధవారం తన మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు తెలిసింది. వివిధ ప్రభుత్వ శాఖలు, రెవెన్యూ వర్గాలు, పోర్టల్ నిర్వహణ కంపెనీలతో ప్రాథమికంగా జరిపిన చర్చల అనంతరం రూపొందించిన ప్రాథమిక స్థాయి నివేదికను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సమర్పించే అవకాశమున్నట్లు సమాచారం. బుధవారం సచివాలయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, టీఎస్ఐఐసీతో కమిటీ భేటీ ముగిసిన తర్వాత మంత్రికి నివేదికను సమర్పించనున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి జిల్లాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో వస్తున్న సమస్యలను తెలుసుకున్న తర్వాత మధ్యంతర నివేదిక ఇవ్వాలని సభ్యులు భావించారు. కానీ ఈ నెల 8 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటంతో బుధవారం నాడే సమర్పించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అదే జరిగితే అసెంబ్లీ సమావేశాల్లో ఈ నివేదికపై కూడా చర్చించే అవకాశముందని చెబుతున్నారు. ధరణిపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి చెప్పిన సంగతి తెలిసిందే.

బీఆర్ఎస్ సభకు పోటీగా కాంగ్రెస్ సభ!

- 2 లక్షల మందితో నల్లగొండలోనే ఏర్పాటు... ప్రియాంకాగాంధీ హాజరు.. అదే సభలో మరో రెండు గ్యారంటీల అమలు ప్రకటన
- ప్రదేశ్ ఎన్నికల కమిటీ భేటీలో నిర్ణయం!
- ప్రతి ఎంపీ సీటుకూ మూడు పేర్లు పంపనున్న కమిటీ



సమావేశంలో సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీ, ఉత్తమ్, షబ్బీర్ అలీ, గీతారెడ్డి, వీహెచ్, జానారెడ్డి, జీవన్‌రెడ్డి, గీతారెడ్డి, అంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: నల్లగొండలో బీఆర్ఎస్‌నిర్వహించనున్న బహిరంగ సభకు పోటీగా 2 లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్వహించనుంది. గాంధీ భవన్‌లో మంగళవారం ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ మేరకు ప్రతిపాదించగా అందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని విశ్వసనీయంగా తెలియవచ్చింది. సభకు ప్రియాంక గాంధీని ఆహ్వానించడం ద్వారా బీఆర్ఎస్‌కు చెక్ పెట్టాలని, సభను విజయవంతం చేసే బాధ్యత తాను తీసుకుంటానని కోమటిరెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. ప్రియాంక సభలోనే మరో రెండు గ్యారంటీలైన గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్‌సిలిండర్‌పథకాలను ప్రకటించాలని నిర్ణయించారని తెలిసింది.

నేటి మధ్యాహ్నంలోగా ఎంపీ అభ్యర్థుల షార్ట్‌లిస్ట్..

రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఒకరి నుంచి ముగ్గురు ఆశావహుల పేర్లను ఎంపిక చేసి ఏఐసీసీకి పంపాలని ఎన్నికల కమిటీ నిర్ణయించింది. లోక్‌సభ అభ్యర్థిత్వాల కోసం వచ్చిన 306 దరఖాస్తులను పరిశీలించింది. వాటిలో సామాజిక న్యాయం, గెలుపు అవకాశాల ప్రాతిపదికన ఒక్కో నియోజకవర్గం నుంచి ఒకరి నుంచి ముగ్గురు పేర్లను టిక్ పెట్టనుంది. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం 2 గంటల్లోగా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి పీఈసీ సభ్యులు ఎంపిక చేసిన అభ్యర్థుల లిస్ట్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పించనున్నారు. టికెట్ల ఖరారు ఎజెండాగా మరోసారి ఈ నెల 15న భేటీ కావాలని ఎన్నికల కమిటీ నిర్ణయించింది. టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ హరీశ్ చౌదరి, సభ్యులు జిగ్నేశ్ మేవానీ, విశ్వజిత్ కదం, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతోపాటు పీఈసీ సభ్యులు విష్ణునాథ్, రోహిత్ చౌదరి, వి.హనుమంతరావు, కె. జానారెడ్డి, జీవన్‌రెడ్డి, జె.గీతారెడ్డి, మధుయాష్కీగౌడ్, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, షబ్బీర్ అలీ, మహేశ్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్, రేణుకా చౌదరి, బలరాం నాయక్, అంజన్‌కుమార్ యాదవ్, సునీతారావు, అజహరుద్దీన్, శివసేనారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో చర్చకొచ్చిన అంశాలివే..

- ➤ సోనియాగాంధీని ఖమ్మం లోక్‌సభ నుంచి పోటీ చేయించాలని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి కోరగా ఆమె ఎక్కడ పోటీ చేయాలన్నది ఏఐసీసీ అభీష్టమని, వారి నిర్ణయం ప్రకారం ముందుకు వెళదామని రేవంత్ సూచించారు.
- ➤ లోక్‌సభ టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలతోపాటు సామాజికవర్గాల వారీగా ఓట్ల వివరాలను పేర్కొంటూ ఓ నివేదికను పీఈసీ సభ్యులకు అందజేశారు. ఇందులో బీసీలను ఇతరుల కేటగిరీలో చేర్చడంపై సీనియర్ నేత వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను ప్రత్యేక కేటగిరీ కింద పరిగణించాలని సూచించారు.

క్లీన్‌స్వీప్ చేయబోతున్నాం: ఉత్తమ్

లోకసభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేయబోతోందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పీఈసీ సమావేశం అనంతరం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ పదేళ్లు మోసం చేసినందుకు కేసీఆర్ ప్రజలకు ముందు క్షమాపణలు చెప్పాలన్నారు.

'మూసీ'పై సీఎంతో సింగపూర్ సంస్థ భేటీ

- ప్రాజెక్టును చేపట్టేందుకు ఆసక్తి.. నమూనాలతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నమూనాలు రూపొందించాలన్న రేవంత్



సచివాలయంలో సీఎం రేవంత్‌ను కలిసిన మెయిన్‌హార్ట్ కంపెనీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు నిర్వహణపై సింగపూర్‌కు చెందిన మెయిన్‌హార్ట్ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. ప్రాజెక్టును చేపట్టేందుకు తమ ఆసక్తిని తెలిపారు. వివిధ దేశాల్లో తాము చేపట్టిన ప్రాజెక్టు డిజైన్లతోపాటు హైదరాబాద్‌లో మూసీ డెవలప్‌మెంట్ నమూనాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ చుట్టూ రాబోయే రైలు మార్గాల విస్తరణతో భవిష్యత్తులో హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని.. వాటికి అనుగుణంగా మూసీ రివర్ ఫ్రంట్ నమూనాలు రూపొందించాలని కోరారు. ఇటీవల లండన్, దుబాయ్‌లలో పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ అక్కడి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులను పరిశీలించడం, పలు విదేశీ కంపెనీలు, ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు, కన్సల్టెన్సీ నిపుణులతోనూ చర్చించడం తెలిసిందే. ఇందులో భాగంగా సింగపూర్‌కు చెందిన మెయిన్‌హార్ట్ కంపెనీ ప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. సీఎంను కలిసిన వారిలో మెయిన్‌హార్ట్ గ్రూప్ సీఈవో ఒమర్ షహజాద్, సురేష్ చంద్ర తదితరులు ఉన్నారు. ఈ భేటీలో సీఎస్ శాంతికుమారి, పురపాలన, పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- ఎమ్మెల్యేలతో కలిసి సుప్రీంకోర్టులో వాదనలకు హాజరైన మంత్రి



సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. సామాజిక న్యాయం, ఎస్సీ వర్గీకరణ, ఉప ప్రణాళిక వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. మంగళవారం ఢిల్లీ తెలంగాణభవన్‌లోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది వివేక్ తన్ఖాను నియమించిందని, ఆయన సానుకూలంగా వాదనలు వినిపిస్తున్నారని పేర్కొన్నారు. వర్గీకరణ విషయంలో వివేక్ తన్ఖాను కలిసి పలు విషయాలు చర్చించామన్నారు. వర్గీకరణ విషయంలో చొరవ చూపిన సీఎం రేవంత్‌కు మాదిగ జాతి తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వర్గీకరణ అనేది ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. వర్గీకరణ చేయాలా వద్దా అనేది మాత్రమే సుప్రీంకోర్టు నిర్ణయిస్తుందని, ఆ తర్వాత ఎంత శాతం ఇవ్వాలనేది జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

వాదనలకు హాజరైన మంత్రి, ఎమ్మెల్యేలు

సుప్రీంకోర్టులో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఎస్సీ వర్గీకరణపై విచారణ చేపట్టింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, తోట లక్ష్మీకాంతరావు, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్యతో కలిసి దామోదర రాజనర్సింహ విచారణకు హాజరయ్యారు.

మొక్కల లెక్కలు తేల్చండి

- హరితహారంపై నివేదిక ఇవ్వండి
- కేసీఆర్, హరీశ్, సంతోష్, కవితల ఊళ్లలో నాటిన చెట్లెన్ని?
- అటవీ శాఖను ఆదేశించిన రాష్ట్ర మంత్రివర్గం

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన హరితహారం కార్యక్రమం కింద మాజీ సీఎం కె.చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, రాజ్యసభ ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్ స్వగ్రామాలు, ఎమ్మెల్సీ కె.కవిత అత్తగారి ఊరిలో నాటిన మొక్కలు ఎన్ని? ప్రస్తుతం ఎన్ని చెట్లు ఉన్నాయి? చేసిన ఖర్చు ఎంత? వంటి అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అటవీ శాఖను రాష్ట్ర మంత్రివర్గం ఆదేశించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం సచివాలయంలో సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం హరితహారం ఫలితాలను సమీక్షించింది. హరితహారం కింద 2015–23 మధ్యకాలంలో రూ.10,822 కోట్లను వెచ్చించి రాష్ట్రవ్యాప్తంగా 273.33 కోట్ల మొక్కలు నాటినట్టు అటవీ శాఖ అధికారులు మంత్రివర్గానికి నివేదించారు. పదేళ్లలో ఇంత భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేసినా రాష్ట్రంలో చెప్పుకోదగ్గ రీతిలో పచ్చదనం ఎందుకు పెరగలేదని మంత్రివర్గం అధికారులను ప్రశ్నించినట్టు తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన ప్రముఖ ప్రజాప్రతినిధుల సొంత ఊళ్లలో పథకం అమలు తీరుతెన్నులపై సమగ్ర నివేదిక అందజేయాలని అటవీశాఖను ఆదేశించినట్టు తెలిసింది. వచ్చే ఆర్థిక ఏడాదిలో కొత్తగా ఎన్ని మొక్కలు నాటాల్సి ఉంది? ఎంత బడ్జెట్ అవసరం? వంటి అంశాలు సైతం నివేదికలో ఉండాలని మంత్రివర్గం కోరినట్టు తెలిసింది.

వాస్తవ పరిస్థితి ఏమిటి?

హరితహారం కింద 19,472 పల్లె ప్రకృతి వనాలు, 2,011 బృహత్ ప్రకృతి వనాలు, 1,00,691 కిలోమీటర్ల మేర రహదారి వనాలు. 12,000 కిలోమీటర్ల బహుళ రహదారి వనాలు, 13.44 లక్షల ఎకరాల అడవుల్ని పునరుద్ధరించినట్టు గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రకటించుకుంది. దీనిపై క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులతో సమగ్ర నివేదిక సమర్పించాలని అటవీ శాఖను మంత్రివర్గం కోరినట్టు తెలిసింది.

బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ గాలం!

▶ మొదటి పేజీ తరువాయి

రంగంలోకి దింపుతామని టీపీసీసీ సీనియర్ నేత ఒకరు 'సాక్షి'తో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

మరో ముగ్గురు.... నలుగురు

పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో ఇంకెందరు బీఆర్ఎస్ ఎంపీలు, పార్టీ మారుతారోననే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఏకంగా సిట్టింగ్ ఎంపీ పార్టీ మారడంతో ఈ చర్చ ఊపందుకుంది. గాంధీ భవన్ వర్గాల సమాచారం ప్రకారం మరో ముగ్గురు, నలుగురు బీఆర్ఎస్ ఎంపీలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, వరంగల్ జిల్లాలకు చెందిన ఆ ముగ్గురు ఎంపీల్లో ఒకరు ఎస్సీ రిజర్వ్‌డ్, ఇద్దరు జనరల్ స్థానాల నుంచి గెలిచారని, వారు త్వరలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని సమాచారం. అయితే వారి చేరిక విషయంలో టికెట్ల కేటాయింపు అంశం కొంత అడ్డంకిగా మారిందని, ఎంపీ టికెట్ ఇవ్వకపోయినా పార్టీలోకి వచ్చిన వారికి తగిన ప్రాధాన్యం ఇచ్చేలా చర్చలు జరుగుతున్నాయని అంటున్నారు. వరంగల్ జిల్లాకు చెందిన ఇంకో ఎంపీ విషయాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంమీద లోక్‌సభ ఎన్నికల కంటే ముందే మరో ఇద్దరు లేదా ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలు తమ పార్టీలో చేరే అవకాశాలున్నాయని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి.

వెంకటేశ్ నేతకు తిరిగి ఎంపీ సీటు ఇవ్వొచ్చనే చర్చ

పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకు అదే స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్ ఇవ్వొచ్చనే చర్చ జరుగుతోంది. ఆయన్ను పార్టీలో చేర్చుకొనేందుకు సీఎం రేవంత్ సైలెంట్ ఆపరేషన్ నడిపించారని, అనేక సమీకరణాల నేపథ్యంలో వెంకటేశ్ నేత చేరిక అంశం కార్యరూపం దాల్చిందని తెలుస్తోంది. వాస్తవానికి పెద్దపల్లి ఎంపీ టికెట్‌ను చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుమారుడు వంశీకి ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది. అయితే ఎంపీ టికెట్ వంశీకి ఇవ్వలేకపోతే రాష్ట్ర కేబినెట్‌లో వివేక్‌కు స్థానం కల్పిస్తారని, వెంకటేశ్‌కు ఎంపీ టికెట్ ఇస్తారని గాంధీ భవన్ వర్గాలంటున్నాయి. మరోవైపు టికెట్ వంశీకి లేదా పార్టీలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మరో నేతకు ఇస్తారని, పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో ప్రభావిత స్థాయిలో ఓట్లున్న సామాజిక వర్గాన్ని ఆకట్టుకోవడానికి వెంకటేశ్‌ను పార్టీలో చేర్చుకున్నారనే చర్చ కూడా జరుగుతోంది.

బీసీల ఉద్యమానికి బీసీలే నాయకత్వం వహించాలి

- ఢిల్లీలో బీసీ సంక్షేమ సంఘం ధర్నాలో ఎంపీ ఆర్.కృష్ణయ్య
- హాజరైన మరో ఎంపీ బీద మస్తాన్‌రావు



మహాధర్నాలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, మస్తాన్‌రావు, మల్లు రవి తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: బీసీల ఉద్యమానికి బీసీ నాయకులు, ఉద్యోగులే నాయకత్వం వహించాలని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సూచించారు. అప్పుడే కేంద్ర ప్రభుత్వం నిద్ర మేల్కొని బీసీల సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. బీసీ డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణ, గుజ్జ కృష్ణ, పితానీ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం మహా ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ ముట్టడికి ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులకు, బీసీ సంఘాల నేతలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. దేశ జనాభాలో 56శాతం ఉన్న బీసీలు కులాల పేరు మీద విడిపోవడం వలన సమస్యలను సాధించలేకపోతున్నామన్నారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ.. జనగణనలో కులగణన కోసం కేంద్రంపై అన్ని పార్టీలు ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. బీసీల సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటాలకు మద్దతిస్తామని బీఎస్పీ ఎంపీ శ్యాంసింగ్, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి తెలిపారు.

క్లుప్తంగా...

క్యాతనపల్లిలో వీగిన అవిశ్వాసం

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డిపై సొంతపార్టీ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. 17 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల సంతకాలతో గత నెలలో కలెక్టర్ బదావత్ సంతోష్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. మంగళవారం ఆర్డీవో రాములు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాసంపై సమావేశం నిర్వహించారు. మొత్తం 22 మంది కౌన్సిలర్లకు కేవలం 13 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. కోరం లేకపోవడంతో ఆర్డీవో రాములు అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. యథావిధిగా పాత చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ వారివారి పదవుల్లో కొనసాగుతారని తెలిపారు. చైర్‌పర్సన్ కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో పాలకవర్గం మాత్రం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ ఖాతాలోకి చేరింది.

ఒక చెప్పు చూపిస్తే మేం వెయ్యి చెప్పులు చూపిస్తాం

- బీఆర్‌ఎస్ పాలన సాగిన పదేళ్లలో బాగుపడ్డది బొందల గడ్డలే
- ఎమ్మెల్యే మందుల సామేల్



సాక్షి, హైదరాబాద్: ఓడిపోయిన కేసీఆర్ టీం ఒక చెప్పు చూపిస్తే ప్రజలు గెలిపించిన తాము వెయ్యి చెప్పులు చూపిస్తామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యాఖ్యానించారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబ అరాచకాలకు ఎంతోమంది బలయ్యారని, ఆయన పాలనలో బాగుపడ్డది బొందల గడ్డలేనని, ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...'పదేళ్ల పాటు మేమే రాజులమని, నిజాం నవాబులమని విర్రవీగారు. రాష్ట్రాన్ని లూటీ చేశారు. తెలంగాణ కేసీఆర్ జాగీరు కాదు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రం. అందుకే కేసీఆర్ నియంత పాలనను ప్రజలు తొక్కి పాతరేశారు.'అని అన్నారు. 50 ఏళ్లయినా కాంగ్రెస్ పార్టీ కట్టిన నాగార్జునసాగర్ చెక్కుచెదరలేదని, మరి రూ.90వేల కోట్లతో బీఆర్‌ఎస్ కట్టిన కాళేశ్వరం, మేడిగడ్డలు కూలిపోయే ప్రమాదంలో ఎందుకున్నాయని ప్రశ్నించారు. అందెశ్రీ రచించిన గేయాన్ని తెలంగాణ రాష్ట్ర గీతంగా ఆమోదించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని చెప్పారు.

బాల్క సుమన్‌పై కాంగ్రెస్ నేతల ధ్వజం

తొక్కి నారతీస్తామన్న మహిళా నేత భవానీరెడ్డి



భవానీరెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి పరుష పదజాలంతో మాట్లాడిన సుమన్‌ను హెచ్చరిస్తూ పలువురు కాంగ్రెస్ నేతలు మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి భవానీరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కంపెనీలో కుక్కలాగా కాపలా కాయడం తప్ప సుమన్‌కు ఏం తెలుసని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని, తొక్కి నారతీస్తామని హెచ్చరించారు. దళితుడైనంత మాత్రాన ఏది నోటికొస్తే అది మాట్లాడే హక్కు ఎవరిచ్చారని, సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడిన సుమన్ ఎక్కువ తక్కువ మాట్లాడితే కేసులు పెట్టి జైల్లో వేస్తామని హెచ్చరించారు. టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ, కేసీఆర్ కుటుంబానికి సుమన్ బానిస అని, ఆ కుటుంబం దగ్గర మెప్పు పొందడం కోసమే సుమన్ ఇలా వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. రేవంత్‌పై ఆరోపణలు, దూషణలు చేస్తే ప్రజలే సుమన్ నాలుక చీరేస్తారని వ్యాఖ్యానించారు. ఇక, ఓయూ విద్యార్థి నేత, టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్ గౌడ్ బాల్కసుమన్‌పై కేసు పెట్టారు. ఉస్మానియా యూనివర్సిటీ పీఎస్‌లో ఎన్‌ఎస్‌యూఐ నేతలతో కలిసి ఆయన ఫిర్యాదు చేశారు.

18న అభ్యర్థుల ప్రకటన?

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహణ కమిటీలు, ఆయా బాధ్యతల నిర్వహణకు వివిధ బృందాల ఏర్పాటు వంటివి ఖరారు కానున్నట్లు తెలిసింది.

సంఘ్ నేతలతో కీలక భేటీ...

ఎన్నికల కార్యాచరణ, అభ్యర్థుల ఎంపిక, ఇతర అంశాలపై చర్చించేందుకు ఆరెస్సెస్ ముఖ్య నేతలతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శులు తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్, బీఎల్ సంతోష్ (సంస్థాగత), కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ సోమవారం రాత్రి హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, సంస్థాగత అంశాలు, అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట, అనంతర పరిణామాలు, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పరివార్ క్షేత్రాలు, అనుబంధ సంఘాలతో బీజేపీ కొనసాగించాల్సిన సమన్వయం తదితర అంశాలు చర్చకొచ్చినట్లు పార్టీ వర్గాల సమాచారం. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ప్రారంభించిన గావ్ చలో, ఘర్ చలో కార్యక్రమం ద్వారా పదేళ్ల మోదీ పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నారు.

బడా రియల్ కంపెనీలతో బంధం

పుప్పాలగూడ, నార్సింగిలో భూముల అనుమతులకు సంబంధించి కీలక నిర్ణయాలు

- హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ విచారణలో కొత్త విషయాలు
- హెచ్‌ఎండీఏ కార్యాలయంలో కొనసాగిన ఏసీబీ సోదాలు
- పలు ఫైళ్లను పరిశీలించిన అధికారులు
- నేటితో ముగియనున్న శివబాలకృష్ణ ఏసీబీ కస్టడీ



శివబాలకృష్ణ

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అవినీతి లావాదేవీలు ఏసీబీ అధికారులు తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పలు రియల్ ఎస్టేట్ కంపెనీలకు అనుమతులిచ్చిన శివబాలకృష్ణ..అందుకు ప్రతిఫలంగా కోట్ల రూపాయలు మూటగట్టుకున్నట్టు ఏసీబీ అధికారుల దర్యాప్తులో వెలుగుచూసినట్టు సమాచారం. ఎన్నికలకోడ్ సమయంలోనూ శివబాలకృష్ణ అనుమతుల జారీ ప్రక్రియ కొనసాగినట్టు ఏసీబీ గుర్తించింది. పుప్పాలగూడ, నార్సింగి పరిధిలో రెండు రియల్‌ఎస్టేట్ కంపెనీలకు సంబంధించిన వందల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేసినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో శివబాలకృష్ణకు పెద్దమొత్తంలో 'లబ్ధి' చేకూరినట్టు కీలక వివరాలు సేకరించారు. 'చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూస్' ప్రక్రియలో పెద్దసంఖ్యలో పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేసినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించిన అనుమతులపైనా ఆరా తీసేందుకు వరుసగా రెండోరోజూ ఏసీబీ అధికారుల బృందం అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు ఫైళ్ల పరిశీలించి వివరాలు సేకరించినట్టు సమాచారం. అక్రమార్జన కేసులో ఏసీబీకి పట్టుబడిన శివబాలకృష్ణను కోర్టు ఎనిమిది రోజుల కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. ఏసీబీ అధికారులు ఏడో రోజు కస్టడీలో భాగంగా చంచల్‌గూడ జైలు నుంచి బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి తీసుకొచ్చారు. ప్రధానంగా ఏసీబీ అధికారులు సేకరించిన భూలావాదేవీల వివరాలు, ఇతర పత్రాలు శివబాలకృష్ణ ముందు ఉంచి మంగళవారం ప్రశ్నించినట్టు సమాచారం.

లోతుగా పరిశీలన

డాక్యుమెంట్లు, బినామీ ఆస్తుల వివరాల ఆధారంగా బాలకృష్ణను ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇతర మార్గాల్లో సేకరించిన వివరాలపై ఏసీబీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే రెరా కార్యాలయంలోనూ సోదాలు చేసి కోట్ల రూపాయల భూములకు సంబంధించిన అనుమతుల విషయంలో వివరాలు సేకరించారు. సోమ, మంగళవారాల్లో అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో జరిపిన సోదాల్లో మరిన్ని వివరాలు లభించాయి. వీటన్నింటినీ విశ్లేషిస్తున్న ఏసీబీ అధికారుల ప్రత్యేక బృందం ఆ విషయాలతో ప్రశ్నావళి రూపొందిస్తూ శివబాలకృష్ణ నుంచి వివరాలు సేకరిస్తోంది. శివబాలకృష్ణకు సహకరించిన సిబ్బందిపైనా ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. శివబాలకృష్ణ నుంచి నిబంధనలకు విరుద్ధంగా అనమతులు పొందిన పలు రియల్‌ఎస్టేట్ కంపెనీల ప్రతినిధులను ఏసీబీ ప్రశ్నించనున్నట్టు సమాచారం.

శివబాలకృష్ణ సోదరుడు శివనవీన్‌కుమార్ అరెస్టు



హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఆయనకు బినామీగా వ్యవహరించినట్టు ఆధారాలు లభించడంతో ఏసీబీ అధికారులు శివబాలకృష్ణ సోదరుడు శివనవీన్‌కుమార్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఇప్పటికే శివ బాలకృష్ణను ఎనిమిది రోజుల కస్టడీలో భాగంగా ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్న విషయం తెలిసిందే. ఏసీబీ సోదాల్లో భాగంగా గుర్తించిన ఆస్తులు, ఆ తర్వాత లాకర్లు ఓపెన్ చేసి స్వాధీనం చేసుకున్న పలు డాక్యుమెంట్లు, రేరా, హెచ్‌ఎండీఏ కార్యాలయంలో సోదాల్లో భాగంగా తెలుసుకున్న సమాచారం మేరకు ఏసీబీ అధికారులు శివ నవీన్‌కుమార్‌ను ప్రశ్నించారు. ప్రాథమిక ఆధారాలతోపాటు, శివబాలకృష్ణ విచారణలో తెలుసుకున్న అంశాల మేరకు శివనవీన్‌కుమార్ తన సోదరుడికి బినామీగా వ్యవహరించినట్టు ఏసీబీ అధికారులు ధృవీకరించుకున్నారు. దీంతో ఆయన్ను అరెస్టు చేసినట్టు ఏసీబీ వర్గాలు తెలిపాయి.

నేటితో ముగియనున్న ఏసీబీ కస్టడీ

హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ ఏసీబీ కస్టడీ బుధవారంతో ముగియనుంది. గత బుధవారం నుంచి శివబాలకృష్ణను కస్టడీకి తీసుకొని విచారిస్తున్న ఏసీబీ అధికారులు, మరోవైపు ఇతర ఆధారాల కోసం తనిఖీలు కొనసాగిస్తున్నారు. బుధవారం చివరి రోజు కావడంతో మరిన్ని కీలక వివరాలు సేకరించేలా ఏసీబీ అధికారుల బృందం ఏర్పాట్లు చేసుకుంది. ఇప్పటికే సేకరించిన వివరాలతోపాటు తనిఖీల్లో గుర్తించిన ఫైళ్ల ఆధారంగా చివరి రోజు ప్రశ్నించే అవకాశముంది. కాగా, హెచ్‌ఎండీఏ కార్యాలయాల్లో వరుస సోదాలు, బ్యాంకు లాకర్ల నుంచి సేకరించిన పత్రాలు, ఇతర ఆధారాలపై మరింత లోతుగా ఆరా తీయాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో ఐదు రోజులు శివబాలకృష్ణను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేసే యోచనలో ఏసీబీ అధికారులు ఉన్నట్టు తెలిసింది.

'స్వగృహ'కు స్వస్తి

▶ మొదటి పేజీ తరువాయి

రూపంలో ప్లాట్లు, నల్లగొండ లాంటి ప్రాంతాల్లో కొన్ని అసంపూర్తి ఇళ్లు విక్రయించడం ద్వారా మరో రూ.1,300 కోట్లు వచ్చాయి.

- ఇప్పుడు బండ్లగూడ, పోచారంలలో ఇంకా 700 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. బండ్లగూడలో సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లు 80, పోచారంలో సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లు 300, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు 280 వరకు ఉన్నాయి. కొన్ని ట్రిపుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కూడా ఉన్నాయి. వీటిని ఉన్నవి ఉన్నట్టుగా విక్రయించనున్నారు.
- రాష్ట్రవ్యాప్తంగా పది ప్రాంతాల్లో ఖాళీ స్థలాలున్నాయి. వీటిని గతంలోలాగా లేఔట్లుగా అభివృద్ధి చేసి విక్రయించాలా, గంపగుత్తగా ఎకరాలుగా విక్రయించాలా అన్న విషయాన్ని కమిటీ పరిశీలిస్తోంది.
- గాజులరామారం, బహదూర్‌పల్లి, జవహర్‌నగర్‌లాంటి ప్రాంతాల్లో భారీ భవన సముదాయాలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తిచేస్తే కొనేందుకు జనం సిద్ధంగా ఉన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీ స్థలాల్లో కాలనీలు నిర్మించినా డిమాండ్ ఏర్పడే పరిస్థితి ఉంది. ఇటీవల ఇదే విషయాన్ని కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే పెట్టుబడి సమకూర్చటమే ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. దీంతో ఇళ్లను నిర్మించి విక్రయించాలన్న స్వగృహ కార్పొరేషన్ ప్రాథమిక విధానానికి విరుద్ధంగా ఉన్న భూములను అమ్మి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం దాదాపు ఓ నిర్ణయానికి వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు ఇది మంగళం పాడే నిర్ణయంగానే ఉన్నట్టు కనిపిస్తోంది.

ఆ సంతకం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు

- తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి
- ప్రాజెక్టుల అప్పగింతపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని కృష్ణానది మీద ఉన్న ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సంతకం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో కృష్ణా నదీ పరీవాహక జిల్లాల నేతల సమావేశం అనంతరం ఆయన మాజీ మంత్రులు జి.జగదీశ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ లింగయ్య యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 13న నల్లగొండ పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృష్ణా జలాల్లో న్యాయబద్ధమైన వాటా దక్కేదాకా పోరాటం ఆగదన్నారు. ప్రధాన ప్రతిపక్షాన్ని కనీసం సంప్రదించకుండా ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగిస్తూ సంతకాలు చేయడం దారుణమని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత తప్పిదం కారణంగా కేఆర్‌ఎంబీ దయా దాక్షిణ్యాల మీద ఆధారపడేలా పరిస్థితి మారిందన్నారు. ఈ విషయంపై ముందుగా తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ అంశంపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుని పోవాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా ప్రాజెక్టుల మీద కేంద్రం బ్లాక్ మెయిల్ చేసినా, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒప్పుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలలకే అప్పజెప్పేసిందని నిరంజన్ రెడ్డి విమర్శించారు.

ఆ విషయంలో కేంద్రమంత్రి షెకావత్ మాటలన్నీ అబద్ధాలే..

గతంలో ఏడాది పాటు చేసుకున్న తాత్కాలిక ఒప్పందాన్ని ముందుకు తేవడం రాష్ట్ర ప్రభుత్వ అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాటలు పచ్చి అబద్ధాలని నిందించారు. ఒకవేళ ఆయన మాటలే నిజమైతే కేసీఆర్ ప్రభుత్వం ఒప్పుకున్నట్టుగా ఏదైనా రికార్డ్ ఉంటే చూపించగలరా.? అని ప్రశ్నించారు. గతంలో 22 అక్టోబర్ 2020న, 27 జూన్ 2022 మీటింగ్‌లలో కేఆర్‌ఎంబీ పరిధిలోకి ప్రాజెక్టులను చేర్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం సమ్మతి ఇవ్వలేదని మినట్స్ క్లియర్‌గా ఉన్నాయన్నారు.



శ్రీనివాస్



సృజన్

సీబీఐ పీపీలుగా సృజన్, శ్రీనివాస్ నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) తరఫున పలు కేసుల్లో వాదనలు వినిపించే నిమిత్తం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)లను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు న్యాయవాది సృజన్ కుమార్‌రెడ్డి, శ్రీనివాస్ కపాటియాలను నియమించింది. మూడేళ్లు లేదా ప్రభుత్వం సూచించే వరకు వీరు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు.

టచ్ చేసి చూడు

▶ మొదటి పేజీ తరువాయి

తుంటి ఎముకకు శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న కేసీఆర్.. తొలిసారిగా మంగళవారం పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌కు వచ్చారు. కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత అంశంపై మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాలకు చెందిన పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. కృష్ణా నదిపై ఉన్న ఉమ్మడి సాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం కేఆర్‌ఎంబీకి అప్పగించడం వల్ల రాష్ట్రానికి, ముఖ్యంగా రైతాంగానికి వాటిల్లే నష్టాలు, ఇతర పర్యవసానాలు, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అనుసరించిన వైఖరి వారికి వివరించారు.

ప్రాజెక్టుల కట్టల మీదకి కూడా పోలేం

'రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అనాలోచిత వైఖరి.. కృష్ణా బేసిన్‌లోని దక్షిణ తెలంగాణ రైతాంగ సాగునీటి హక్కులపై గొడ్డలి పెట్టులా మారింది. నాగార్జునసాగర్, శ్రీశైలం సహా కృష్ణా నదిమీద అన్ని ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పజెప్పి రాష్ట్ర ప్రభుత్వం మన జుట్టును కేంద్రం చేతికి అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వ తెలంగాణ వ్యవసాయ, రైతాంగ వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నా. నేను అధికారంలో ఉన్న పదేళ్లలో కృష్ణా ప్రాజెక్టుల విషయమై కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా ఏనాడూ తలొగ్గలేదు. ప్రాజెక్టులు తమకు అప్పగించాలని, లేదంటే తామే నోటిఫై చేస్తామని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నన్ను బెదిరించారు. కానీ నేను.. కావాలంటే తెలంగాణలో నా ప్రభుత్వాన్ని రద్దు చేస్తా. రాష్ట్రపతి పాలన పెట్టుకో. తెలంగాణకు అన్యాయం చేస్తానంటే మాత్రం అసలు ఊరుకోను. ప్రాజెక్టులు అప్పగించే ప్రసక్తే లేదని ఆనాడే చెప్పా. కేఆర్‌ఎంబీ పేరుతో కృష్ణా నదీ ప్రాజెక్టులపై తెలంగాణకున్న హక్కులను కైవసం చేసుకునేందుకు కేంద్రం వేస్తున్న ఎత్తుగడలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు తిప్పికొట్టింది., పదేళ్ల పాటు కేంద్రం వత్తిళ్ళను తట్టుకుంటూ ప్రాజెక్టులను కాపాడింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టులను అప్పగిస్తూ నిర్ణయం తీసుకుని సంతకాలు చేయడం వల్ల భవిష్యత్తులో ప్రాజెక్టుల కట్టల మీదికి కూడా పోలేని పరిస్థితి దాపురించింది..' అని కేసీఆర్ తెలిపారు.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదాం

'రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల హైదరాబాద్ రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల ప్రజలకు సాగు, తాగునీరు అందక తిరిగి కరువు కోరల్లో చిక్కుకునే ప్రమాదం పొంచి ఉంది. ప్రజా మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రమాదకర, మూర్ఖపు వైఖరిని తిప్పికొడుతూ, కృష్ణా జలాల్లో రాష్ట్రానికి రావలసిన వాటాలను, ఉన్న హక్కులను నూటికి నూరు శాతం కాపాడేందుకు ఎంతదాకానైనా పోరాడాల్సిందే. నాడు ఉద్యమం నడిపించి తెలంగాణను సాధించి తెలంగాణ హక్కులను కాపాడుకున్న స్ఫూర్తితోనే.. నేడు మరో ప్రజా ఉద్యమాన్ని నిర్మించి హక్కులకు భంగం వాటిల్లకుండా చూసుకునే బాధ్యత బీఆర్‌ఎస్ కార్యకర్తలది. తెలంగాణ ఉద్యమకారులది. తెలంగాణ ఉద్యమం సమయంలోనే సాగు, తాగునీటి హక్కుల కోసం పోరాడాం. 'మా నీళ్లు మాకే' అనే ప్రజా నినాదాన్ని స్వయంపాలన ప్రారంభమైన అనతికాలంలోనే నిజం చేసి చూపించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిది. రాష్ట్ర ప్రభుత్వ ప్రమాదకర ధోరణిని ప్రజా క్షేత్రంలో ఎండగడదాం..' అని కేసీఆర్ పిలుపునిచ్చారు.



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ నేతలు, కార్యకర్తలు

పాలన చేతకాక రేవంత్ కారుకూతలు

'అసెంబ్లీలో మనం తక్కువేంలేం..39 మందిమి ఉన్నాం. ప్రతి అంశాన్ని అక్కడ ఎండగడతాం. ఈ సీఎం ఎక్కువ మాట్లాడుతున్నాడు. సీఎం అనేటోడు ఈరోజు ఉంటాడు. రేపు పోతాడు. తెలంగాణ ప్రయోజనాలు ముఖ్యం. మీరు ఎవరూ గాబరా పడొద్దు. రేవంత్‌వి పిల్ల చేష్టలు. పాలన చేతకాక నా మీద కారు కూతలు కూస్తున్నడట. నల్లగొండలో సభ పెట్టనివ్వరట. మన సభను అడ్డుకునేది ఎవ్వడు? కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎవ్వడు అడ్డుకోవడానికి. నల్లగొండ ఆయన జాగీరా? ఎట్లా పెట్టుకోనివ్వరో చూద్దాం. ఇలాంటి వాళ్లను చాలామందిని చూసినం.

ఈ ప్రభుత్వాన్ని మనం కూల్చాల్సిన అవసరం లేదు

ప్రాజెక్టుల విషయంలో మన ఎమ్మెల్యేలు సభలో కొట్లాడతరు. మనం అందరం వెళ్లి నల్లగొండలో కొట్లాడుదాం. మనం ఈ ప్రభుత్వాన్ని కూల్చడానికి గడ్డపారలు పట్టుకుని తిరగాల్సిన అవసరం లేదు. వాళ్లు ప్రకటించిన పథకాలు అమలు చేయలేక వాళ్లకు వాళ్లే కొట్టుకుంటారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల నుంచి తిరుగుబాటు వస్తది. ఏ క్షణంలో ఎన్నికలు వచ్చినా వెయ్యి శాతం మనమే అధికారంలోకి వస్తాం..' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తలసాని, మల్లారెడ్డి, పువ్వాడ, సత్యవతి రాథోడ్ తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, కార్పొరేషన్ల మాజీ మున్సిపల్ చైర్మన్లు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నల్లగొండ సభను విజయవంతం చేయాలి

తెలంగాణ భవన్‌లో సమావేశానంతరం నందినగర్ నివాసంలో కేసీఆర్ మరోసారి నాయకులతో సమావేశమయ్యారు. ఈ నెల 13న నల్లగొండలో బహిరంగసభ నిర్వహణపై ఉమ్మడి ఖమ్మం , మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ముఖ్య నేతలు సమన్వయ కర్తలతో చర్చించారు. ప్రాజెక్టుల అప్పగింతతో ఎదురయ్యే దుష్పరిణామాలు ం తెలంగాణ సమాజానికి తెలిసేలా ఈ సభను విజయవంతం చేయాలని సూచించారు.

అధినేతకు ఘనస్వాగతం

సుదీర్ఘ కాలం తరువాత తెలంగాణ భవన్‌కు వచ్చిన బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె. చంద్రశేఖర్‌రావుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎన్నికల్లో పార్టీ ఓటమి, గజ్వేల్‌లోని ఫాంహౌస్‌లో జారిపడడం, హిప్ రీప్లేస్మెంట్ సర్జరీ లాంటి పరిణామాల నేపథ్యంలో కేసీఆర్ ఇప్పటివరకు పార్టీ కార్యాలయానికి రాలేకపోయారు. ప్రస్తుతం కృష్ణా ప్రాజెక్టుల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారిన నేపథ్యంలో మంగళవారం బీఆర్‌ఎస్ నేతలతో ఆయన సమావేశమయ్యారు. కేసీఆర్ తెలంగాణ భవన్‌కు వస్తున్నారని తెలిసి ఉదయం 10 గంటల నుంచే పార్టీ నాయకుల కోలాహలం పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ రోడ్డు, బంజారాహిల్స్‌లోని ఇతర రోడ్లు ఉదయం 10 గంటల నుంచే వాహనాలతో నిండిపోయాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు నందినగర్‌లోని తన నివాసం నుంచి బయలుదేరిన కేసీఆర్ 12.40కి తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. కారు దిగిన ఆయనకు మహిళా నాయకురాళ్లు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యాలయ సిబ్బంది గుమ్మడికాయతో దిష్టి తీశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దగ్గరుండి కేసీఆర్‌ను పార్టీ కార్యాలయంలోకి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన వివిధ జిల్లాల నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. సుమారు 3 గంటల పాటు పార్టీ కార్యాలయంలో గడిపిన కేసీఆర్ 3.30 గంటల ప్రాంతంలో తన నివాసానికి తిరిగి వెళ్లారు. కాగా పలువురు ముఖ్య నాయకులు కేసీఆర్‌ను కలిసి ఆయన యోగక్షేమాలు అడిగారు.

60 గ్రూప్‌-1 పోస్టుల వివరాలు ఇవీ..

పోస్టు పేరు	భర్తీకి అనుమతించిన ఖాళీల సంఖ్య
అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్	01
డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్	24
డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్	03
జిల్లా ఉపాధి కల్పన అధికారి	03
మండల పరిషత్ అభివృద్ధి అధికారి	19
జిల్లా పంచాయతీ అధికారి	02
డిప్యూటీ కలెక్టర్	03
అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్	04
జిల్లా రిజిస్ట్రార్	01

మే 9 నుంచి టీఎస్‌ఈఏపీసెట్

▶ మొదటి పేజీ తరువాయి

జూన్ 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు పీజీ సెట్ కన్వీనర్ డాక్టర్ అరుణ కుమారి తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి నేతృత్వంలో మంగళవారం సెట్స్ తేదీలు వెల్లడించారు. మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కే మహ్మూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌ఈఏపీ సెట్ షెడ్యూల్ ఇలా...

21.2.24	సెట్ నోటిఫికేషన్ విడుదల
26.2.24	ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
6.4.24	దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ
మే9 నుంచి 12 వరకు	ఈఏపీసెట్ పరీక్ష నిర్వహణ

టీఎస్ పీజీసెట్ షెడ్యూల్ ఇలా...

12.3.24	నోటిఫికేషన్ విడుదల
16.3.24	ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
10.5.24	దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ
జూన్6 నుంచి 9 వరకు	పీజీ సెట్ పరీక్ష నిర్వహణ

సీఎంఆర్ గడువు.. ఈ నెలాఖరు వరకు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మిల్లర్లకు ఉప శమనం లభించింది. గత నెల 31తో ముగిసిన 2022-23 ఖరీఫ్, రబీ సీజన్‌ల సీఎంఆర్ గడువును ఈనెలాఖరు వరకు పొడిగిస్తూ కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. 2022-23 ఖరీఫ్ సీజన్‌కు చెందిన ధాన్యం మిల్లింగ్ ప్రక్రియను ఆరు నెలల క్రితమే పూర్తి చేయాల్సినప్పటికీ మిల్లర్లు సాగదీస్తూ వచ్చారు. సీఎంఆర్ గడువులోగా పూర్తి చేయకపోతే రాష్ట్ర అవసరాల కోసం పౌరసరఫరాల సంస్థకు పెండింగ్ బియ్యాన్ని అప్పగించాలని మిల్లర్లు భావించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు ససేమిరా అంది. మిల్లర్లు ఎఫ్‌సీఐకే బియ్యం ఇవ్వాలి తప్ప పౌరసరఫరాల సంస్థ తీసుకోదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కమిషనర్ డీఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. దీంతో రెండు నెలలుగా మిల్లర్లు సీఎంఆర్ వేగం పెంచినప్పటికీ జనవరి 31 నాటికి ఇంకా 3.80 ఎల్‌ఎంటీ బియ్యం ఎఫ్‌సీఐకి పెండింగ్‌లో ఉంది. ఈ బియ్యం విలువ సుమారు రూ.1,500 కోట్లు. ఈ నేపథ్యంలో ఈనెల 3వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తూ సీఎంఆర్ గడువును ఈనెలాఖరు వరకు పెంచుతూ ఆఖరి అవకాశం ఇవ్వాలని కోరింది. దీనికి స్పందిస్తూ మంగళవారం కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ కార్యదర్శి దీపేంద్ర సింగ్ పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు గడువును పెంచుతూ లేఖ పంపారు. ఇదే చివరి అవకాశమని, తదుపరి పెంపు ఉండదని స్పష్టం చేశారు. కాగా 2022-23 రబీకి సంబంధించి 35 ఎల్‌ఎంటీ ధాన్యం వేలం వేయాలని నిర్ణయించిన నేపథ్యంలో సీఎంఆర్ సమస్య తలెత్తకపోవచ్చు. ఇప్పటి వరకు ఇచ్చిన సుమారు 15 ఎల్‌ఎంటీ బియ్యంతోనే సరిపెట్టుకునే అవకాశం ఉంది.

గ్రామాలకు వచ్చే నిధులన్నీ కేంద్రానివే..

మోదీ సంక్షేమ పథకాలన్నీ ప్రజల కోసమే: ఎంపీ బండి సంజయ్




రంగాపూర్‌లోని దళిత బస్తీలో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీ బండి సంజయ్

కరీంనగర్‌టౌన్/హుజూరాబాద్: రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనులన్నింటికీ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వమే నిధులిస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు పైసా ఇవ్వడం లేదని, పంచాయతీ సిబ్బందికి జీతాలు, కరెంటు బిల్లులు సహా అన్నింటికీ కేంద్రనిధులనే వాడుకుంటున్నారన్నారు. 'గావ్ చలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా రంగాపూర్ గ్రామానికి వచ్చిన బండి.. రాత్రి పొద్దుపోయే వరకూ గ్రామంలో పర్యటించారు. వివిధ వర్గాల ప్రజలను కలిశారు. పార్టీ బూత్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. మహిళలతో ముచ్చటించారు. కాగా, అంతకుముందు ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాల్లో విజయం సాధించడమే బీజేపీ లక్ష్యమన్నారు. 'గావ్ చలో అభియాన్'లో భాగంగా ప్రతి నేత గ్రామాల్లో పల్లెనిద్ర, నగరాల్లో బస్తీ నిద్ర చేయాలన్నారు. 24 గంటలపాటు ఆ గ్రామంలో, బస్తీలో ఉండి ప్రజలతో, కార్యకర్తలతో మమేకం కావాలని తెలిపారు. రాజకీయ పార్టీల నేతల భవిష్యత్తు బాగుండాలంటే వారంతా బీజేపీలో చేరడం ఉత్తమమని అన్నారు.

నల్లగొండ బీఆర్‌ఎస్ సభకు నియోజకవర్గ ఇన్‌చార్జిలు వీరే

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 13న నల్లగొండలో జరిగే బీఆర్‌ఎస్ సభకు ఇన్‌చార్జిలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ (హుజూర్‌నగర్), పంజాల గోపి రెడ్డి (దేవరకొండ), రవీందర్ సింగ్, (నల్లగొండ పట్టణం), మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి (తుంగతుర్తి), నందికంటి శ్రీధర్ (మునుగోడు), ఎమ్మెల్సీ రవీందర్ రావు (కోదాడ), మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ (నకిరేకల్), ఆదర్శ్‌రెడ్డి, ముజీబ్ (మిర్యాలగూడ), మాజీ మంత్రి జోగు రామన్న (సూర్యాపేట), మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ (నాగార్జునసాగర్), మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, జీవీ రామకృష్ణారావు (భువనగిరి), మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు (ఆలేరు) లను నియమించారు. ఆయా నియోజకవర్గాల్లో వీరంత పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తారు.



> ఇతరులకు ఇవ్వడం వల్ల మనసులో ఒక రకమైన వైశాల్య భావన కలుగుతుంది. మనం జీవించే ప్రపంచాన్ని మన చర్యలే సృష్టిస్తాయి కాబట్టి, ఇవ్వడం అనే చర్య ద్వారా విశాలమైన ప్రపంచ సృష్టి జరుగుతుంది.
> – థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 7 ఫిబ్రవరి 2024

ఆచరణ సాధ్యమేనా?!

ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) బిల్లును మంగళవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టి దేశంలోనే ఆ దిశగా తొలి అడుగేసిన రాష్ట్రమైంది. ఉమ్మడి పౌరస్మృతిపై బీజేపీ ఆరాటం ఎవరికీ తెలియంది కాదు. ఆవిర్భావం నుంచీ బీజేపీ ఆ మాట చెబుతూ వస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో యూసీసీ ఆ పార్టీ వాగ్దానాల్లో కీలకాంశం. రాష్ట్రాల్లో అంతకుముందూ, ఆ తర్వాతా బీజేపీ అధికారం అందుకున్నా ఎక్కడా ఉమ్మడి పౌరస్మృతి ఇలా బిల్లు రూపంలో చట్టసభ ముందుకొచ్చిన వైనం లేదు. మధ్యప్రదేశ్, అస్సాం, గుజరాత్‌లలో బీజేపీ ప్రభుత్వాలే వున్నా ఈ విషయంలో పెద్దగా పురోగతి లేదు. ఆ రకంగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి ఇతరులకన్నా చాలా ముందున్నట్టు లెక్క. దేశంలో ప్రస్తుతం ఒక్క గోవాలో మాత్రమే యూసీసీ అమల్లో వుంది. అయితే అది 1867లో అప్పటి పోర్చుగీస్ పాలకులు తెచ్చిన చట్టం. రాజ్యాంగ నిర్ణాయక సభలో సైతం యూసీసీ గురించి చర్చ జరిగింది. దాన్ని ప్రాథమిక హక్కుల్లో చేర్చాలని కొందరు సభ్యులు అభిప్రాయపడగా మైనారిటీ వర్గాల సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించటంతో అంతకుమించి ముందుకు కదల్లేదు. చివరకది రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో 44వ అధికరణ అయింది. దేశంలోని పౌరులందరికీ వర్తించేలా ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావటానికి రాజ్యం కృషి చేయాలని ఆ అధికరణ నిర్దేశించింది. ఆదేశిక సూత్రాలు రాజ్యం అమలు చేసి తీరాల్సినవి కాదు గనుక న్యాయస్థానాల తీర్పుల్లో ఉటంకించటానికి మాత్రమే ఆ అధికరణ పనికొచ్చింది. 1985లో షాబానో కేసులోనూ, 1995లో సరళా ముద్గల్ కేసులోనూ వెలువరించిన తీర్పుల్లో ఉమ్మడి పౌరస్మృతి దేశ సమైక్యతకూ, సమగ్రతకూ తోడ్పడుతుందని సుప్రీంకోర్టు ధర్మాసనాలు అభిప్రాయపడ్డాయి. 21వ లా కమిషన్ ఉమ్మడి పౌరస్మృతిపై భిన్నవర్గాల అభిప్రాయాలు సేకరించి, న్యాయనిపుణులతో కొన్ని నెలలపాటు చర్చించి 'ఈ దశలో అది అవసరమూ కాదు, వాంఛనీయమూ కాద'ని తేల్చింది. చిత్రమేమంటే ఆ తర్వాత ఏర్పడ్డ 22వ లా కమిషన్ యూసీసీపై ప్రజాభిప్రాయాన్ని తెలపాలంటూ ప్రకటనలు విడుదల చేసింది. అది జరిగి మూడేళ్లు గడిచింది కాబట్టి ప్రజల తాజా అభిప్రాయమేమిటో తెలుసుకోదల్చుకున్నామని లా కమిషన్ సమర్థించుకుంది.

ఉమ్మడి పౌరస్మృతి చుట్టూ మొదటినుంచీ వివాదాలు అల్లుకుంటూనే వున్నాయి. దాన్ని తీసుకు రావటం, సజావుగా అమలు చేయటం భిన్న మతాల, సంస్కృతులకు నిలయమైన భారత్‌లో సాధ్యంకాదన్నది కొందరి అభిప్రాయం. ముఖ్యంగా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత తదితర వ్యవహారాలతో ముడిపడివుండే అంశాల్లో వేర్వేరు మతాలకు వేర్వేరు సంప్రదాయాలున్నాయి. దాదాపు అన్ని పర్సనల్ చట్టాలూ మహిళలపై వివక్ష ప్రదర్శిస్తున్నాయి. ఈ దశలో అందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనుకోవటం అంత సులభం కాదు. 50వ దశకంలో హిందువులకు వర్తించేలా అయిదు చట్టాలు- హిందూ వివాహ చట్టం, హిందూ వారసత్వ చట్టం, హిందూ మైనర్ల సంరక్షకత్వ చట్టం, హిందూ దత్తత, మనోవర్తి చట్టం, హిందూ ఆస్తి స్వాధీనతా చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టాలే సిక్కు, బౌద్ధ, జైన మతస్తులకు కూడా వర్తిస్తున్నాయి. ముస్లిం, క్రైస్తవ, పార్సీ మతస్తులకు వేర్వేరు పర్సనల్ చట్టాలున్నాయి. ఆ మతాల్లో కూడా కొన్ని అంశాల్లో ఏకరూపత లేదు. సంప్రదాయాల పరంగా చూస్తే వివాహాలకు సంబంధించి హిందూమతంలోనే భిన్నమైన ఆచరణలున్నాయి. అవిభాజ్య హిందూ కుటుంబాలకు వర్తించే పన్ను రాయితీల వంటివి వేరే మతస్తులకు వర్తించవు. ఇక ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మేఘాలయ, మిజోరంలలో స్థానిక సంప్రదాయాలను పరిరక్షించాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. రాజ్యాంగంలోని 25వ అధికరణ పౌరులందరికీ ఏ మతాన్నయినా ఆచరించే, ప్రచారం చేసుకునే హక్కును ఇస్తున్నది. ఇన్ని అవరోధాలను దాటుకుని అందరికీ వర్తించే ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురావటం అంత సులభమేమీ కాదు. 2019లో కేంద్రం తీసుకొచ్చిన మోటారు వాహనాల చట్టానికి ఏమైందో మన కళ్లముందే వుంది. అందులోని కఠిన నిబంధనల కారణంగా చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఆ చట్టాన్ని అమలు చేయలేమని చేతులెత్తేశాయి. తమ అవసరాలకు తగినట్టు చట్టానికి సవరణలు తీసుకొచ్చాయి. వలస పాలకుల హయాంలో రూపొంది ఇంతవరకూ అమల్లోవున్న సాక్ష్యాధారాల చట్టం, కాంట్రాక్టు చట్టం, ఆస్తి బదలాయింపు చట్టం వగైరాలకు దాదాపు అన్ని రాష్ట్రాలూ వందల సవరణలు చేసుకున్నాయి. కనుక 'ఒకే దేశం–ఒకే చట్టం' ఆదర్శనీయమైనంతగా ఆచరణసాధ్యం కాదు.

ఉమ్మడి పౌరస్మృతి బిల్లుపై చర్చ, ఆమోదం మంగళవారమే ఉంటాయని ప్రభుత్వం చెప్పినా మరింత సమయం అవసరమన్న విపక్షాల వినతితో అసెంబ్లీ స్పీకర్ దాన్ని సవరించారు. ఆ సంగతలా వుంచితే ఒక్క ఆదివాసీలు మినహా అన్ని మతాలవారికీ వివాహం, విడాకులు, ఆస్తి హక్కు వగైరా అంశాల్లో ఒకే రకమైన నిబంధనలు వర్తిస్తాయని బిల్లు చెబుతోంది. ఆఖరికి సహజీవనం చేసే జంటలు సైతం తమ బంధాన్ని రిజిస్టర్ చేయించుకోవాల్సిందేనని బిల్లు నిర్దేశిస్తోంది. సహజీవనంలోకి వెళ్లిన నెలలోగా రిజిస్టర్ చేసుకోవాలనీ, అలా చేయకపోతే మూడునెలల కారాగారం తప్పదనీ హెచ్చరిస్తోంది. రిజిస్టర్ చేయించుకున్న సహజీవనం ద్వారా జన్మించే సంతానాన్ని మాత్రమే సక్రమ సంతానంగా గుర్తించటం సాధ్యమంటున్నది. ఉత్తరాఖండ్‌లో నివసించే వేరే రాష్ట్రాలవారికి సైతం ఇది వర్తిస్తుందని చెబుతోంది. ఇలా పౌరుల వ్యక్తిగత అంశాల్లోకి రాజ్యం చొరబడటం సబబేనా? అసలు దేశమంతటికీ వర్తించే ఉమ్మడి పౌరస్మృతి ఉండాలని 44వ అధికరణ నిర్దేశిస్తుండగా, ఒక రాష్ట్రం అలాంటి చట్టం తీసుకురావటం రాజ్యాంగబద్ధమేనా?

స్థిరమైన కేటాయింపులతోనే భద్రత

విశ్లేషణ



సి. ఉదయ్ భాస్కర్

రక్షణ సన్నద్ధత కోసం పెట్టే పెట్టుబడి ఏ దేశానికైనా సంక్లిష్టమైనదే, అదే సమయంలో చాలా ఖర్చుతో కూడుకున్నదే. స్థూల జాతీయోత్పత్తిలో ఎంత శాతం రక్షణ రంగానికి కేటాయిస్తున్నామనేది మదింపునకు ఉపయోగపడే ఒక సూచిక. రక్షణపై ఏర్పాటైన 2018 నాటి స్టాండింగ్ కమిటీ జీడీపీలో కనీసం మూడు శాతాన్ని రక్షణ మంత్రిత్వ శాఖకు కేటాయించాలని సూచించింది. నిర్దిష్టంగా కేటాయింపులు ఉంటేనే సైనికదళాల సర్వసన్నద్ధత సాధ్యమని స్పష్టం చేసింది. పాత, ప్రస్తుత, అధునాతన ఆయుధాలు సమాన నిష్పత్తిలో ఉండాలని కూడా చెప్పింది. ఈ సూచనలను కేంద్రం పట్టించుకోలేదు. జాతీయ భద్రత విషయంలో అప్రమత్తంగా లేకపోతే, 1962 నాటి ఘటనలు పునరావృతం అయ్యే ప్రమాదాలు లేకపోలేదు!

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో 2024–25 సంవత్సరానికిగాను రక్షణ శాఖకు రూ. 6.21 లక్షల కోట్లు కేటాయించింది. ఇంత భారీ మొత్తంలో కేటాయింపులు జరగడం ఇదే మొదటి సారి అని రక్షణ శాఖ అభివర్ణిస్తోంది. 2023–24 కేటాయింపుల కంటే ప్రస్తుత కేటాయింపులు 4.2 శాతం ఎక్కువనీ, మూల ధన వ్యయం కోసమే ఈసారి బడ్జెట్‌లో రూ. 1.72 లక్షల కోట్ల కేటాయింపు జరిగిందనీ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన పత్రికా ప్రకటన చెబుతోంది. మిలిటరీ వ్యవస్థ ఆధునికీకరణకు, సాధన సంపత్తిని సమకూర్చుకునేందుకు ఇది చాలా ఉపయోగపడుతుంది.

అయితే ఒకసారి ఈ అంకెలను నిర్దిష్ట దృక్కోణంలో చూసే ప్రయత్నం చేద్దాం. భారత ప్రభుత్వం దాదాపు 31 ఎంక్యూ–9బీ సాయుధ డ్రోన్లను అమెరికాకు చెందిన జనరల్ అటామిక్స్ ఏరోనాటికల్ సిస్టమ్స్ నుంచి కొనుగోలు చేసే ఆలోచన చేస్తోంది. ఇందుకోసం 400 కోట్ల డాలర్లు ఖర్చు పెట్టేందుకూ సిద్ధమవుతోంది. అంటే దాదాపు రూ. 33 వేల కోట్లు. కొన్నేళ్లపాటు దశల వారీగా ఈ మొత్తాన్ని చెల్లిస్తారు.

రక్షణ సన్నద్ధత కోసం పెట్టే పెట్టుబడి ఏ దేశానికైనా సంక్లిష్టమైందే, బాగా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. రక్షణ శాఖ కేటాయింపులను అంచనా వేసేందుకు చాలా సూచికలున్నాయి. ప్రజలెన్నుకున్న ప్రభుత్వం (ప్రజాస్వామ్యం) లేదా అధికారంలో ఉన్న శక్తి (రాజు, మిలిటరీ) ఏదైనాసరే... మిలిటరీ సామర్థ్యం కోసం ఎంత మొత్తంలో ఖర్చుపెట్టాలో నిర్ణయిస్తాయి. స్థూల జాతీయోత్పత్తిలో ఎంత శాతమన్నది మదింపునకు ఉపయోగపడే ఒక సూచిక.

2022లో ప్రపంచంలోని ప్రధాన దేశాల్లో స్థూల జాతీయోత్పత్తిలో ఎంత శాతం రక్షణ శాఖకు కేటాయించారన్న విషయాన్ని పరిశీలిస్తే ఇండోనేసియా వంటి దేశాల్లో 0.6 శాతం మాత్రమే ఉంటే... సౌదీ అరేబియా వంటి దేశాల్లో అది 7.4 శాతం వరకూ ఉన్నట్లు తెలుస్తుంది. 'స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (ఎస్‌ఐపీఆర్‌ఐ–సిప్రి) ఈ విషయాలు వెల్లడిస్తోంది. భారత్ విషయానికి వస్తే స్థూల జాతీయోత్పత్తిలో దాదాపు 2.4 శాతాన్ని రక్షణ శాఖకు ఉపయోగిస్తున్నాం. అంటే దాదాపు 8,140 కోట్ల డాలర్లు. 'సిప్రి' జాబితాలో అమెరికా, చైనా, రష్యా తరువాత అత్యధిక కేటాయింపులు ఇండియావే. అయితే, రక్షణ శాఖ కేటాయింపుల్లో సరిహద్దులకు కాపలా కాసే సెంట్రల్ పోలీసు బలగాల కేటాయింపులు ఉండవు. ఈ బలగాలు కేంద్ర హోం శాఖ పరిధిలో పని చేస్తూండటం దీనికి కారణం. కాబట్టి భారతీయ రక్షణ వ్యవస్థ మొత్తానికి అంటే త్రివిధ దళాలు, కోస్ట్‌గార్డ్, డీఆర్‌డీవో, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, కర్మాగారాలకు జరిగిన వాస్తవ కేటాయింపులు 'సిప్రి' అంకెల కంటే భిన్నం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కేటాయింపులను మరింత నిశితంగా పరిశీలిస్తే దశాబ్ద కాలంలో రక్షణ శాఖ కేటాయింపులు అంత ప్రోత్సాహకరంగా ఏమీ లేవని చెప్పాల్సి వస్తుంది.



రెండు శాతం కంటే తక్కువే...

2024–25 సంవత్సరానికి రక్షణ శాఖ బడ్జెట్ అంచనాలు 2023–24తో పోలిస్తే ఐదు శాతం ఎక్కువ. అయితే ఈ పెంపు ద్రవ్యోల్బణ నష్టాలను కూడా పూడ్చలేదు. ఇది మధ్యంతర బడ్జెట్ మాత్రమే.. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకూ చేసుకున్న తాత్కాలిక ఏర్పాటు అన్ని గుర్తుంచుకోవాలి.

జీడీపీలో ఎంత మొత్తం రక్షణ శాఖకు కేటాయిస్తున్నారన్న విషయాన్ని పరిశీలిస్తే మాత్రం కొంచెం ఇబ్బంది ఎదరవుతుంది. 'పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రిపోర్టు' ప్రకారం 2023–24 కేటాయింపులు జీడీపీలో కేవలం 1.97 శాతం మాత్రమే. ప్రస్తుత ఏడాది ఇది 1.9 శాతం అయ్యింది. రక్షణపై ఏర్పాటైన 2018 నాటి స్టాండింగ్ కమిటీ జీడీపీలో కనీసం మూడు శాతాన్ని రక్షణ మంత్రిత్వ శాఖకు కేటాయించాలని సూచించడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. ఈ మేరకు నిర్దిష్టంగా కేటాయింపులు ఉంటేనే సైనికదళాల సర్వసన్నద్ధత సాధ్యమని కమిటీ స్పష్టం చేసింది. అయితే ఈ సూచనను కేంద్రం పట్టించుకోలేదు.

గత దశాబ్దంలో ఏటికేడాదీ జరిగిన కేటాయింపులను పరిశీలిస్తే రక్షణ శాఖకు జీడీపీలో 2.2 శాతం (2013–14) నుంచి... క్రమేపీ తగ్గుతూ వస్తున్నాయి. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ కోసం, ఏకమొత్తం చెల్లింపుల కోసం ఒక్క ఏడాది మాత్రం ఎక్కువ కేటాయింపులు జరిగాయి. ప్రస్తుతం ఈ కేటాయింపులు రెండు శాతం కంటే తక్కువగా ఉన్న విషయం స్పష్టమే. రాజకీయ ప్రాథమ్యాలను దృష్టిలో పెట్టుకుంటే సమీప భవిష్యత్తులో ఈ కేటాయింపులు పెరిగే అవకాశమూ కనిపించడం లేదు.

ప్రభావం ఏమిటి?

జీడీపీతో పోలిస్తే రక్షణ శాఖ కేటాయింపులు క్రమేపీ తగ్గుతూండటం మిలిటరీ వ్యవస్థ ఆధునికీకరణపై కచ్చితంగా ప్రభావం చూపుతుంది. ఇది కాస్తా భారతీయ సైన్యం యుద్ధ నైపుణ్యాలను నిర్ణయిస్తుంది. బడ్జెట్ అంచనాల్లో మూలధన వ్యయం కోసం జరిపిన కేటాయింపులు ఒక మంచి మార్పే. మూలధన వ్యయం కోసం కేటాయించిన రూ.1.72 లక్షల కోట్లను రెండు రకాలుగా చూడవచ్చు. పీఆర్‌ఎస్ నివేదిక (2023 ఫిబ్రవరి) ప్రకారం, 2013–14లో మూల ధన వ్యయం కోసం పెట్టిన ఖర్చు రక్షణ శాఖ బడ్జెట్‌లో 32 శాతం వరకూ ఉండగా... 2023–24లో ఇది 29 శాతానికి తగ్గిపోయింది. అంతేకాదు... ఆయుధ దిగుమతిలో ప్రపంచంలోనే ఇండియా పైస్థానంలో ఉంది. ఈ కొనుగోళ్లన్నీ డాలర్లలో జరగాలి. అంటే డాలర్‌కు ఎన్ని రూపాయలు అన్నది కూడా రక్షణ శాఖ కొనుగోళ్లను ప్రభావితం చేయగలదు. 2013– 14లో డాలర్ విలువ రూ.60.95 కాగా... 2024 జనవరి 10 నాటికి ఇది 83.1కి పడిపోయింది. ఫలితంగా విదేశీ మారక నిల్వల విలువ తగ్గిపోతుంది.

2018లో రక్షణ శాఖపై ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ మిలిటరీ ఆధునికీకరణపై ఒక హెచ్చరిక కూడా జారీ చేసింది. మిలిటరీ ఆయుధాలు (పురాతన, ప్రస్తుత, అత్యాధునిక) సమాన స్థాయిలో (33.3 శాతం) ఉండాలన్నది ఈ హెచ్చరిక సారాంశం. భారత మిలిటరీ వ్యవస్థలో 68 శాతం ఆయుధాలు పాతవి. 24 శాతం మాత్రమే ఈ కాలానికి చెందినవి. ఇక, అత్యాధునిక ఆయుధ వ్యవస్థలు కేవలం 8 శాతమే! ఆర్మీ విషయానికి వస్తే ఆయుధాలు, పేలుడు సామగ్రి, నిల్వలన్నింటిలోనూ వెనుకబడి ఉందని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.

పాతకాలపు ఆయుధాలను వదిలించుకుని ఆధునికీకరణ చేసుకునేందుకు ఒక విధాన రూపకల్పన, నిధుల కేటాయింపుల విషయంలో తగిన ఆసక్తి లేదని స్టాండింగ్ కమిటీ వ్యాఖ్యానించినట్లు పీఆర్‌ఎస్ నివేదిక పేర్కొనడం ఇక్కడ గుర్తు చేసుకోవాలి.

ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చే కొత్త ప్రభుత్వం ఈ తేడాలను గమనించి తగిన నిర్ణయాలు తీసుకోవాలి. దేశం మిలిటరీ పరంగా ఎదుర్కొంటున్న సవాళ్లన్నింటికీ ఇది కీలకమవుతుంది. ఇతరులను నమ్మించేందుకు మాత్రమే ప్రయత్నిస్తుంటే... అది కూడా జాతీయ భద్రత విషయంలో ఇలా జరిగితే... 1962 అక్టోబర్ నాటి ఘటనలు పునరావృతం అయ్యే ప్రమాదాలు లేకపోలేదు!

వ్యాసకర్త న్యూఢిల్లీలోని సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్

('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఒక్కటే ఉండాలనా?



భారత ప్రజాస్వామ్యానికి చెడ్డ కాలం. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత, 'ప్రతిపక్ష' నాయకులు 'సందర్శకుల గ్యాలరీ'లోనే కూర్చోవాల్సి ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఏక పార్టీ దిశగా భారత్ పయనిస్తోందా? ప్రపంచంలోనే అత్యంత పెద్ద ప్రజాస్వామ్య దేశపు జనాల కోరిక అదేనా?

– చంద్ర కుమార్ బోస్, యాక్టివిస్ట్

చొరబాటు



ఉత్తరాఖండ్ శాసనసభలో ప్రవేశపెట్టిన ఉమ్మడి పౌర స్మృతి బిల్లు... 'లివ్–ఇన్ రిలేషన్‌షిప్' (సహజీవనం)లోకి అడుగుపెట్టిన ఒక నెల లోగా ఆ బంధాన్ని తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని చెబుతోంది. పరస్పర అంగీకారం ఉన్న వ్యక్తుల జీవితాల్లోకి ప్రవేశించడానికి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న సిగ్గుమాలిన ప్రయత్నం ఇది. పౌరుల వ్యక్తిగత జీవితంతో రాజ్యానికి ఏం సంబంధం?

– శమా మహమ్మద్, కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి

ప్రేమ కోసం విరామం



ఇంగ్లండ్ వర్సెస్ ఇండియా మ్యాచులకు సంబంధించి, బీసీసీఐ షెడ్యూల్ చాలా ఆలోచనాయుతంగా ఉంది. ఫిబ్రవరి 2- 6 వరకు రెండో టెస్టు పోరాటం. ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు – రోజ్ డే, చాకొలెట్ డే, ప్రపోజ్ డే, టెడ్డీ డే, ప్రామిస్ డే, హగ్ డే, కిస్ డే, వాలెంటైన్స్ డే. 15 ఫిబ్రవరి – పోరాటం మళ్లీ ప్రారంభం, మూడో టెస్టు.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

నింపితే సరి!



గాజాలోని 75 శాతం హమాస్ దళాలను ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) నిర్వీర్యం చేసినట్టూ, కానీ వారి సొరంగాల్లో 25 శాతం మాత్రమే చేయగలిగినట్టూ (ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్) నెతన్యాహూ చెబుతున్నారు. అదృష్టవశాత్తూ, మధ్యధరా ప్రాంతంలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

అంతటా అలాగే...



నేను ఒక పుస్తకాన్ని వేలాది పౌండ్లు పెట్టి ప్రచురిస్తానా... తీరా అది ఒక్క కాపీ మాత్రమే అమ్ముడవుతుంది.

– ఒన్యేకా నువేల్యూ, నైజీరియా రచయిత

ఇన్ బాక్స్

మేరునగధీరుడు

మాజీ ఉప ప్రధాని, భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ఈ మధ్యనే 96వ జన్మదినాన్ని జరుపుకున్న లాల్ కృష్ణ అడ్వాణీకి కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' అవార్డుతో సత్కరించటం ఎంతైనా సముచితం. స్వాతంత్ర్యం అనంతర భారత రాజకీయ నాయకులలో విలువలతో కూడిన రాజకీయం చేసిన వారిలో అడ్వాణీ ఒకరు. 1927 నవంబర్ 8న నేటి పాకిస్తాన్‌లోని కరాచీలో ఆయన జన్మించారు. తన జీవితంలో తొలి 20 ఏళ్లు పాక్‌లో నివసించినప్పటికీ దేశవిభజన సమయంలో భారత్‌కు వచ్చారు. అంతకు ముందే ఆయన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రచారక్‌గా మారారు.



ఎల్.కె. అడ్వాణీ

ఆర్‌ఎస్‌ఎస్ మాసపత్రిక 'ఆర్గనైజర్'లో పాత్రికేయునిగా, నాటి భారతీయ జన సంఘ్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శిగా పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ మార్గదర్శకత్వంలో నడిచారు.

తదనంతరం నాటి ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ చాలక్ గురూజీ గోల్వాల్కర్ ఆదేశాలతో భారతీయ జనసంఘ్‌లో పూర్తి సమయ రాజకీయ కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించారు. అటల్ బిహారి వాజ్‌పేయ్, బైరాన్ సింగ్ షెకావత్, రాజమాత విజయరాజె సింధియా వంటి నాయకులతో కలసి భారతీయ జనసంఘ్‌ను దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా తీర్చిదిద్దటంలో అడ్వాణీ కృషి వెలకట్టలేనిది. ఎమర్జెన్సీలో ప్రజాస్వామ్యం కోసం పోరాడి బెంగళూరులోని కేంద్ర కారాగారంలో 19 నెలలు జైలు జీవితాన్ని గడిపారు. జైలు నుంచి తన విడుదల కోసం బెంగళూరు హైకోర్టులో తన కేసును తానే వాదించుకొని విడుదల అయిన తర్వాత జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటులోనూ, పతనంలోనూ సంతోషాన్నీ నిస్పృహను అనుభవించిన నిస్వార్థపరుడు అడ్వాణీ. 1980లో జనతా పార్టీ పతనం తర్వాత ముంబైలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) స్థాపకుల్లో ఒకరయ్యారు. ఆ పార్టీని అంచలంచెలుగా ఒక నిబద్ధత కలిగిన రాజకీయ పార్టీగా తీర్చిదిద్ది 1998లో మొట్ట మొదటిసారిగా కేంద్రంలో అధికారంలోకి తీసుకురావడంలో ఆయన పాత్ర మరువరానిది.

హిందీ, ఆంగ్ల భాషల్లో సమానమైన ప్రావీణ్యం గల అడ్వాణీ చరిత్ర, రాజనీతి, సాహిత్యం, సామాజిక, తత్వ శాస్త్రాలకు సంబంధించిన అనేక రచనలను అధ్యయనం చేసిన విజ్ఞాన ఖని. కావుననే ఆయన ప్రసంగాల్లో, రచనల్లో ఆయన అనుభవం అపార అధ్యయనం తొణికిసలాడుతుంది. అదే విధంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్వాణీపై అక్రమంగా బనాయించిన అయోధ్య, హవాలా వంటి కేసుల విషయంలో విచారణ ఎదుర్కొన్నప్పుడు ఆయన చూపించిన మనో నిబ్బరం, తెగువ, నిజాయితీ నేటి రాజకీయ నాయకులకు ఎంతైనా ఆదర్శనీయం. నేటి భారతరత్న అవార్డుతో భారత దేశ రాజకీయ నాయకుల చరిత్రలో అడ్వాణీ పేరు చిరస్థాయిగా నిలుస్తుంది అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

– వై.వి. రామిరెడ్డి । ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్, తిరుపతి

వాగ్దానాల అమలే పాలనకు గీటురాయి

అభిప్రాయం



డా॥ పి. పృథ్వీకర్ రెడ్డి

ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు తాము ఏం చేస్తామో చెబుతూ ఒక రాజకీయ పార్టీ తన సిద్ధాంతాలు, ఉద్దేశాలు, విధానాలను ప్రతిబింబిస్తూ ఇచ్చే హామీ పత్రమే ఎన్నికల మేనిఫెస్టో. దీని ఆధారంగా, తమ అంచనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ఏ పార్టీ మేనిఫెస్టో ఉందో ప్రజలు నిర్ణయించుకొని ఓటువేయడానికి వీలవుతుంది. అందువల్ల, రాజకీయ పార్టీ హామీలు స్పష్టంగా ఉండాలి. అమలులో ఎలాంటి అస్పష్టతకు ఆస్కారం ఇవ్వకూడదు. భారత ఎన్నికల సంఘం 2013 సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా, రాజకీయ పార్టీలకు 'మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్' కింద మార్గదర్శకాలను రూపొందించడానికీ, వారు చేసిన వాగ్దానాలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించిన విషయాలపై చర్చించడానికీ, రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కానీ వాటిపై స్పష్టత రాలేదని చెప్పాలి.

చట్ట ప్రకారం, ఎన్నికల మేనిఫెస్టోలోని వాగ్దానాలు అవినీతి అక్రమాల కిందకు రావని అందరికి తెలిసిన విషయమే. కానీ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పార్టీల మధ్య సమాన పోటీ స్థాయిని నిర్ధారించడానికీ, ఎన్నికల స్వచ్ఛతనూ, ప్రజలకు చేసిన వాగ్దానాలనూ కాపాడటం కోసం మాత్రమేనని నిర్ధారించడమైనది.

తెలుగు దేశం పార్టీ 2014లో విడుదల చేసిన మేనిఫెస్టోను, 'దశ–దిశ చూపించే ఒక పవిత్ర పత్రం'గా అభివర్ణించారు ఆ పార్టీవారు. దీనిలో 'కష్టాలలో ఉన్న రైతులను రుణ మాఫీతో ఆదుకొంటాం' అని చెప్పారు. రుణమాఫీ గురించి ఇంతకు మించి వివరణ మేనిఫెస్టోలో కనపడదు. అనగా ఏ తారీఖు వరకున్న రుణాలు, ఎంతమేరకు మాఫీ చేస్తారనే విషయం ఎక్కడా లేదు. ఈ విషయమై ఆ పార్టీ అధ్యక్షులు బహిరంగ సభలలో చెప్పిన వాగ్దానాలు మేనిఫెస్టోలో లేవు. గెలిచిన తర్వాత ఈ వాగ్దానం అమలును 'మమ' అనిపించడానికి పార్టీ పెద్దలు చాలా శ్రమించారు. ప్రొఫెసర్ కె.వి. రమణారెడ్డి, ఇదే పత్రికలోనూ, డెక్కన్ క్రానికల్ ఆంగ్ల పత్రికలోనూ తెలుగుదేశం పార్టీ ఈ విషయమై రైతులను ఏవిధంగా మభ్య పెట్టిందో తన పరిశోధన ద్వారా విశదంగా వివరించారు. 'వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, రూ 5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, రైతువారి ఇన్సూరెన్స్' వంటి హామీలనూ ఇదే మేనిఫెస్టోలో పెట్టారు. కానీ గెలిచాక, వీటి ఊసే లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 'రైతుభరోసా కేంద్రా'లను ఏర్పాటు చేసి, రైతుకు కావలిసినవన్నీ ఒకే చోట అందుబాటులో ఉంచడంతో బాటు, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడం, ధరల స్థిరీకరణనిధి ద్వారా గిట్టుబాటు ధర అందించడం, పంటనష్ట నివారణకు ఇన్సూరెన్స్ అమలు చేసి రైతుకు అండగా నిలవడం వంటి పనులు చేసింది.



తెలుగుదేశంవారు 'మహిళా సాధికారత కోసం డ్వాక్రా రుణాలు రద్దుతో బాటు, వారి అభివృద్ధికి, భద్రతకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది.' కానీ వాస్తవానికి ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఏమి జరిగిందో మహిళలకు తెలుసు. వైసీపీ ప్రభుత్వం వచ్చినాక, డ్వాక్రా రుణాలు వడ్డీతో బాటు మాఫీ గావించారు. ఇలా ఎన్నికల వాగ్దానాలను పార్టీలు మరచిపోతే, ప్రజలు మరచిపోతారు లేదా క్షమిస్తారనుకోవడం పెద్ద పొరబాటు. ఇలాగే యువతను గూడా ఆ పార్టీ మభ్యపెట్టింది. తెలుగుదేశం తన పార్టీ మేనిఫెస్టోలో, 'రానున్న అయిదేళ్ళలో ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం/ ఉపాధి అవకాశం కల్పిస్తా'మని మాటిచ్చి మరచింది. యువత 2019లో జరిగిన ఎన్నికల్లో దీనిని గుర్తుపెట్టుకొని ఆ పార్టీకి గుణపాఠం చెప్పారు.

'గుడిసెలు లేని ఆంధ్రప్రదేశ్, ప్రతి గ్రామానికీ తారు రోడ్డు...' వంటి హామీలూ తెలుగుదేశం ఇచ్చింది కానీ అమలుపరచలేదు. ఈ విషయమై ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న పనులు, కట్టిస్తున్న కాలనీల గురించి, పచ్చ పత్రికలకు కనబడక పోయినా, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా తెలుస్తూనే ఉంది. అలాగే పేద పిల్లలకు పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామనీ, హెల్త్ కార్డ్ ద్వారా అన్నిరకాల వ్యాధులకు కార్పొరేట్, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత వైద్యం అందిస్తామని మాటిచ్చిన టీడీపీ గెలిచాక అమలు మరచింది.

కానీ వైసీపీ ప్రభుత్వం పదహారు ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మించడంతో బాటు డాక్టర్ల నియామకాలు గావించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యానికి ఇస్తున్న ప్రాధాన్యతను కేంద్రం సైతం కొనియాడింది. ఈ మధ్యకాలంలో ప్రారంభించిన ఇంటింటికి వెళ్లి, వైద్యపరీక్ష, ఇతర సేవలందించడం వంటి కార్యక్రమం, ఇండియాలోనే ఆరోగ్య రంగంలో ఒక విప్లవం లాంటిది. పేదలకు చదువే ఒక స్థిరమైన ఆస్తిగా గుర్తించి 'నాడు–నేడు' ద్వారా చదువులో తీసుకొచ్చిన సంస్కరణలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి.

అన్నింటికీ మించి, తెలుగుదేశం 2012లో ప్రకటించిన, బీసీ డిక్లరేషన్ ప్రకారం 100 శాసనసభ స్థానాలు వారికి కేటాయించడం, వారికి ప్రత్యేకబడ్జెట్, బీసీ సబ్–ప్లాన్ పెట్టి అమలు చేస్తామని 2014లో విడుదలయిన మేనిఫెస్టోలో ప్రకటించారు. గెలిచాక ఇవన్నీ మూలబడ్డాయి. బీసీలకు ప్రస్తుత ప్రభుత్వం ఏమి చేస్తున్నదో అందరికీ తెలుసు.

వైసీపీ నాయకత్వం 2019లో ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకిచ్చిన 'బాండు పేపరు'గా పరిగణించి నూటికి 99 శాతం పూర్తిగా అమలుచేసి, చిక్కుముడులు విప్పి, ఆ ఒక్క శాతం కూడా అమలుకు ప్రయత్నిస్తామని ప్రజలకు చెబుతోంది. వాస్తవిక ఎన్నికల మేనిఫెస్టో కోసం, రాజకీయాలను మరింత జవాబుదారీగా, పారదర్శకంగా చేయడానికి ఎలక్షన్ కమిషన్ మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ కు పదును పెట్టి ప్రజలకిచ్చిన హామీలను కనీసం మూడు వంతులైనా పాటించేట్లుగా నిబంధనలు పెట్టాలి. లేని పక్షంలో, ప్రజలకిచ్చిన మాట తప్పినట్లుగా పరిగణించి తగిన శిక్ష విధించాలి. అలా కానిచో పార్టీల మధ్య సమాన పోటీ స్థాయి ఉండదు. ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేసినట్లవుతుంది.

వ్యాసకర్త హైదరాబాద్‌లోని 'సెస్' సీనియర్ పరిశోధకుడు

prudhvikar@cess.ac.in

పాట మైమరిచింది

జన గాన తెలంగాణ పాట
ముచ్చటగా మురిసింది
జయ జయహే తెలంగాణ
ఆకాశం నిండా రెపరెపలా ఎగిసింది

ఇక మన పాఠశాలలో
విద్యార్థులు జనగణమన తర్వాత
జయ జయహే తెలంగాణ పాడుకోవచ్చు
మన ఆత్మను
బహిరంగంగా కాపాడుకోవచ్చు

తెలంగాణ ఆత్మ గౌరవం
ఆకాశమెత్తు మురిసింది
పాట కన్న కవి కల మైమరిసింది

పాటలోని పల్లవి గాయపడింది
గానంలో చరణం గేయమైంది

భయం లేదు అభయం ఇదే
జనగాయం నియంతృత్వ
తెలంగాణ మాయం
ప్రజలంతా వేనోళ్ళ గొంతెత్తి
పాడుకునే రాష్ట్ర గేయం

– జూకంటి జగన్నాథం
(అందెశ్రీకి ప్రేమతో...)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జత చేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.11.04 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.2.53 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.12.53 నుండి 2.24 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.53 నుండి 12.36 వరకు, **అమృత ఘడియలు:** రా.10.11 నుండి 11.44 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.54.

మళ్లీ మన ప్రభుత్వమే

- ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి జగన్
- చేయగలిగిందే చెప్పాం... చెప్పింది చేశాం
- ఆర్థిక సంక్షోభం, కోవిడ్‌ను ధీటుగా ఎదుర్కొన్నాం
- 99 శాతం హామీలను చిత్తశుద్ధితో అమలు చేశాం
- మాపై వ్యతిరేకతే ఉంటే ప్రతిపక్షాలు ఎందుకు ఏకమవుతున్నాయి?
- రెండు జాతీయ పార్టీలతో చంద్రబాబుకు అవగాహన ఎందుకు?

రాష్ట్ర విభజన నుంచి ఇప్పటికీ మనల్ని రెవెన్యూ లోటు వెంటాడుతోంది. మనం కలసికట్టుగా 60 ఏళ్లపాటు ఉమ్మడిగా హైదరాబాద్‌ను నిర్మించుకున్నాం. అది ఎకనామిక్ పవర్ పాయింట్. ప్రతి రాష్ట్రానికి ఒక ఎకనామిక్ పవర్ హౌస్ ఉండాలి. లేకుంటే రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు ఎప్పటికీ పెరగవు. 'ట్యాక్స్ బాయోన్సీ' అన్నది చాలా చాలా ముఖ్యం. పెద్ద పెద్ద నగరాల్లోనే ట్యాక్స్ రెవెన్యూ ఎక్కువగా ఉంటుంది. అందుకే నేను విశాఖపట్నం గురించి గట్టిగా చెబుతా. - వైఎస్ జగన్


సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజనతో ఏర్పడిన రెవెన్యూ లోటు, చంద్రబాబు సర్కారు నిర్వాకంతో పెరిగిన ఆర్థిక సంక్షోభం, కోవిడ్ మహమ్మారి లాంటి సవాళ్లను ధీటుగా ఎదుర్కొని గత నాలుగున్నరేళ్లుగా ప్రజలకు మంచి చేశామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో ఆయన మంగళవారం ప్రసంగించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రెవెన్యూ లోటు, తగ్గిన ఆదాయం, పెరిగిన ఖర్చులు, కేంద్ర నిధుల తగ్గుదలను గణాంకాలతో సహా వివరించారు. టీడీపీ హయాంలో రాబడి, అప్పులు, ఖర్చులను వైఎస్సార్‌సీపీ వచ్చాక ఎలా ఉందో వెల్లడిస్తూ మాట్లాడారు.

రాష్ట్ర ఆదాయం తగ్గినా...

జటిల పరిస్థితుల్లో మనం అధికారంలోకి వచ్చాం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఐదేళ్లలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాం. కోవిడ్‌తో రాష్ట్ర ఆదాయం తగ్గింది. అనుకోకుండా ఖర్చులు పెరిగాయి. కేంద్రం వసూలు చేసిన పన్నుల్లో రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన వాటా బాగా తగ్గింది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులూ తగ్గాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రయాణం చేస్తూ రాష్ట్రాన్ని నడిపించాల్సి వచ్చింది. రాష్ట్ర విభజనతో వచ్చిన ఇబ్బందులు ఇప్పటికీ ఉన్నాయి. రెవెన్యూ లోటును అధిగమిస్తూ గొప్ప పాలన అందించాం. హైదరాబాద్ లాంటి నగరం లేకపోవడం, విభజన వల్ల రాష్ట్రం ఏటా రూ.13 వేల కోట్లను ఆదాయపరంగా నష్టపోతున్నాం. ఈ పదేళ్లలో రూ.1.35 లక్షల కోట్లు నష్టపోయాం. ఇన్ని ఇబ్బందులు, సవాళ్ల మధ్య మన ఆర్థిక వ్యవస్థను 56 నెలలుగా సమర్థంగా నడుపుతూ ముందడుగులు వేస్తున్నాం. బటన్ నొక్కడం ద్వారా నేరుగా నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు పంపిస్తున్నాం. ఏకంగా రూ.2.55 లక్షల కోట్లు డీబీటీ ద్వారా అందించాం. నాన్ డీబీటీ స్కీమ్స్ ద్వారా మరో రూ.1.07 లక్షల కోట్లు ఇచ్చాం. (ఇళ్ల స్థలాల మార్కెట్ విలువ కూడా తీసుకుంటే రూ.1.76 లక్షల కోట్లు ఉంటుంది)

అప్పులపై పదే పదే అబద్ధాలు...

మన ప్రభుత్వానికి శత్రువులు ఎక్కువగా ఉన్నారు. ఎల్లో మీడియా ఒకే అబద్ధాన్ని చెప్పిందే చెబుతూ గోల చేస్తోంది. మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఎక్కువ, మూలధన వ్యయం తక్కువ అని ఆరోపణలు చేస్తున్నారు. క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ చంద్రబాబు హయాంలో సగటున రూ.15,227 కోట్లు కాగా మన ప్రభుత్వ పాలనలో రూ.17,757 కోట్లుగా ఉంది. అబద్ధాల బ్యాచ్ చేసే మరో ఆరోపణ.. రాష్ట్ర ప్రభుత్వం విపరీతంగా అప్పులు చేస్తోందట! విభజన నాటికి రూ.1.53 లక్షల కోట్లు అప్పు ఉంటే చంద్రబాబు దిగిపోయే నాటికి రూ.4,12,288 కోట్లు అప్పులున్నాయి. రూ. 4,12,288 కోట్లు అప్పు నుంచి మనం ప్రయాణం మొదలు పెడితే ఇప్పుడు రూ.7.03 లక్షల కోట్లకు చేరింది. చంద్రబాబు హయాంలో అప్పుల పెరుగుదల రేటు 21.78 శాతం ఉంటే మన హయాంలో కేవలం 12.13 శాతమే ఉంది. టీడీపీ హయాంలో రాష్ట్ర అప్పులు 7.5 శాతం ఉన్నాయి. అదే సమయంలో కేంద్రం అప్పులు 3.6 శాతమే ఉన్నాయి. మన హయాంలో కేంద్రం అప్పులు 6.5 శాతం ఉంటే మనం అప్పు చేసింది 5.6 శాతం మాత్రమే. మన ప్రభుత్వం రూ.2.90 లక్షల కోట్లు అప్పు చేస్తే.. ఒకడు రూ.13 లక్షల కోట్లు అంటారు. మరొకడు రూ.10 లక్షల కోట్లు అంటారు. అప్పుల గ్రోత్ రేట్ అప్పటికంటే ఇప్పుడు చాలా తక్కువగా ఉంది. మరి టీడీపీ హయాంలో నిధులను ఎలా ఖర్చు చేశారో చెప్పగలరా? ఆ నిధుల్లో చంద్రబాబు తిన్నది ఎంత? దత్తపుత్రుడికి ఇచ్చింది ఎంత? ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5లతో కూడిన ఎల్లో మీడియాకు ఇచ్చింది ఎంత?

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నమ్మకం ఉంటే ఇన్ని పొత్తులెందుకు?

'మనందరి ప్రభుత్వం ఐదేళ్లలో ప్రజలకు మంచి కాకుండా చెడు చేసిందని, మేనిఫెస్టో వాగ్దానాలను అమలు చేయలేదని ప్రతిపక్షం అంతగా నమ్మితే ప్రజలే మనల్ని ఓడిస్తారని ధీమాగా ఉండొచ్చు కదా? వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఏమొచ్చింది? చంద్రబాబు ఒక జాతీయ పార్టీతో ప్రత్యక్షంగా, మరో జాతీయ పార్టీతో పరోక్షంగా అవగాహన కుదుర్చుకోవాల్సిన అవసరం ఏముంది? కుట్రలతో పరువు దక్కించుకోవాల్సిన దుస్థితి విపక్షానికి ఎందుకు దాపురించింది?'

మళ్లీ మూడు నెలల్లో

'మేనిఫెస్టో హామీల్లో 99 శాతం వాగ్దానాలను ఈ ఐదేళ్లలో అమలు చేశాం. ప్రతి ఇంటికి మేనిఫెస్టోను తీసుకెళ్లి ప్రజల ఆశీస్సులు కోరుతున్నాం. వైఎస్సార్ సీపీ చేయగలిగిందే చెబుతుంది. చెప్పింది ఏదైనా సరే కచ్చితంగా చేసి తీరుతుందది. దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలతో అఖండ మెజారిటీతో ప్రజల మన్ననలు పొంది మళ్లీ 3 నెలలకు ఇదే చట్టసభలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడతాం'.

సర్క్యులేషన్ కోసం ఏవైనా రాస్తారు.. నేనెందుకు స్పందించాలి?

యధాలాపంగా మాట్లాడా.. ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు

- వాళ్ల రాతలు పరువు నష్టం కలిగించేలా ఉంటే చర్యలు తీసుకోండి
- నాకు వ్యతిరేకంగా కూడా కథనాలు రాశారు
- ఎవరేం రాసినా గొంతెత్తలేను కదా
- ఎల్లో మీడియా కథనాలపై న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు అసంతృప్తి



సాక్షి, అమరావతి: ఓ కేసు ప్రస్తావన సమయంలో తాను చేసిన వ్యాఖ్యలంటూ ఎల్లో మీడియా ప్రచురించిన కథనాలపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్క్యులేషన్ కోసం ఏవైనా రాస్తాయంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. అలాంటి కథనాలపై తానెందుకు స్పందించాలని ప్రశ్నించారు. ఆ పత్రికలు ఏం రాశాయో కూడా తనకు తెలియదన్నారు. ఇటీవలి కాలంలో పత్రికలు చదవడమే మానేశానని తెలిపారు. 'వాళ్లేం రాశారో మీరు (పబ్లిక్ ప్రాసిక్యూటర్) ఇప్పుడు చెబితేనే నాకు తెలిసింది. నేనేదో యధాలాపంగా మాట్లాడానే తప్ప ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. వాళ్ల రాతలు పరువు నష్టం కలిగించే విధంగా ఉంటే అందుకు అనుగుణంగా మీరు (ప్రభుత్వం) తప్పనిసరిగా చర్యలు తీసుకోండి. మీడియాలో నాకు వ్యతిరేకంగా కూడా కథనాలు రాశారు. అయినా నేను గొంతెత్తలేను. అదేమన్నా అంటే భావ ప్రకటన స్వేచ్ఛ అంటారు. పత్రికల్లో వచ్చే కథనాలకు నేనేం చేయగలను?' అని జస్టిస్ మల్లికార్జునరావు అన్నారు. న్యాయమూర్తి నుంచి ఈ స్పందనను ఊహించని ఎమ్మెల్యే తరఫు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు ఎల్లో మీడియా కథనాలను వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఆ పత్రికల వారితో తాను మాట్లాడానని, ప్రజలను ఎడ్యుకేట్ చేయడానికే అలా ప్రచురించామని వారు చెప్పారని పోసాని తెలిపారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి స్పందిస్తూ.. మీరు వ్యాఖ్యలు చేశారంటూ ప్రచురించిన కథనాల వల్ల పోలీసుల మనోస్థైర్యం దెబ్బతినే అవకాశం ఉందని, అందుకే వాటిని కోర్టు దృష్టికి తీసుకొస్తున్నామని న్యాయమూర్తికి వివరించారు. అలాగే 41(ఏ) విషయంలో కోర్టుకు స్పష్టతనిచ్చేందుకు, కోర్టు సందేహాలను నివృత్తి చేసేందుకు, అర్నేష్ కుమార్ కేసులో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల్లో ఏముందో స్పష్టంగా తెలిపేందుకే సుదీర్ఘ వాదనలు వినిపించామన్నారు. అధికారులను విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నందుకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై నమోదు చేసి కేసులో సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ) నోటీసు ఇస్తామని దుష్యంత్ కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పోలీసు అధికారుల నుంచి స్పష్టమైన సూచనలు ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయమూర్తి, ఎమ్మెల్యే సాంబశివరావుకు 41(ఏ) నోటీసులు ఇచ్చి, అర్నేష్ కుమార్ కేసులో సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాలని పోలీసులను ఆదేశించారు. 41(ఏ) నోటీసులు ఇస్తామని చెప్పినందున కేసు పూర్వాపరాల్లోకి వెళ్లడం లేదని జస్టిస్ మల్లికార్జునరావు తెలిపారు. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారులపై దాడి చేసిన ఎమ్మెల్యే

గ్రానైట్ ఫ్యాక్టరీ తనిఖీకి వచ్చిన తమను విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడమే కాక తమపై దాడి కూడా చేశారంటూ గనుల శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ సాంబశివరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ మల్లికార్జునరావు మంగళవారం విచారణ జరిపారు.

ఎమ్మెల్యే చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎమ్మెల్యే బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి, విధులు నిర్వర్తించకుండా అధికారులను అడ్డుకున్నారని తెలిపారు. న్యాయమూర్తులపై గతంలో కొందరు అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు వారిపై నమోదు చేసిన కేసులు కూడా ఏడేళ్ల లోపు శిక్షలు పడేవేనని, అయినా వారికి కోర్టు ముందస్తు బెయిల్ ఇవ్వలేదన్నారు. 70 రోజుల పాటు వారంతా జైల్లోనే ఉన్నారని తెలిపారు. ఆ కేసుల్లో అడ్వొకేట్లు కూడా అరెస్టయ్యారని వివరించారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వాలన్న నిబంధన ఏదీ లేదన్నారు. నేరాన్ని మళ్లీ చేస్తారన్న నిర్ణయానికి పోలీసు అధికారి వస్తే చాలని, నిందితుడిని అరెస్ట్ చేయవచ్చని చెప్పారు. ప్రస్తుత కేసులో ఎమ్మెల్యే చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని, ఇప్పుడు కూడా పోలీసులు మౌనంగా ఉండాలంటే ఎలా అని ప్రశ్నించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపే సమయంలో నేరం చేశారనేందుకు మేజిస్ట్రేట్‌కు స్పష్టమైన ఆధారాలు చూపితే సరిపోతుందన్నారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను ఎమ్మెల్యే భయభ్రాంతులకు గురి చేశారని, అందుకు వీడియో ఆధారాలున్నాయని చెప్పారు. 41(ఏ) నోటీసు ఇవ్వాలా లేక అరెస్ట్ చేయాలా అన్నది పూర్తిగా పోలీసుల విచక్షణాధికారమని తెలిపారు. కోర్టులు జోక్యం చేసుకోలేవన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే తరఫున పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ, అర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసుల్లో అరెస్ట్ చేయకూడదన్నారు. సెక్షన్ 41(ఏ) నోటీసులు ఇచ్చి తీరాలన్నారు. పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని లేని పక్షంలో 41(ఏ) నోటీసులు జారీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌ను బలోపేతం చేస్తాం: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: నేర దర్యాప్తులో ఫోరెన్సిక్ సైన్స్ కీలక భూమిక పోషిస్తుందని డీజీపీ రవిగుప్తా అన్నారు. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ (ఎఫ్ఎస్ఎల్)ని బలోపేతం చేస్తామన్నారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో మహిళా భద్రత విభాగం అడిషనల్ డీజీ, రాష్ట్ర ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖాగోయల్‌తో కలిసి తెలంగాణ స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. తెలంగాణ వ్యాప్తంగా ఎనిమిది భరోసా సెంటర్లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, ఎఫ్ఎస్ఎల్ వెబ్‌సైట్, భరోసా కేంద్రాలు ప్రజల్లో మరింత భద్రతా భావాన్ని పెంచుతాయన్నారు. శిఖాగోయల్ మాట్లాడుతూ, కొత్తగా భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జనగాం, మంచిర్యాల, ములుగు, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, వనపర్తిల్లో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

విద్యారంగంలో ఏపీ రోల్ మోడల్

ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్

సాక్షి, విశాఖపట్నం: విద్యారంగంలో దేశానికి ఏపీ రోల్ మోడల్‌గా నిలిచిందని ఆస్ట్రేలియాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంగ్లిష్ మీడియం, అమ్మ ఒడి వంటి ఎన్నో మంచి నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం గొప్ప విషయమని శ్లాఘించారు. తనతోపాటు యువతరానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తి అన్నారు. మంగళవారం రాత్రి విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో విద్యార్థులు, యువతలో స్ఫూర్తి నింపేలా ప్రసంగం చేశారు. ప్రతి ఒక్క రి జీవితంలో ఎత్తుపల్లాలు, గెలుపోటములు సహజ మని.. అపజయాలు తాత్కాలికమని అన్నారు. నిరాశ, నిస్పృహలకు గురికాకుండా వాటిని విజయాలకు మెట్లుగా మలచుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత బాగా చదవ డంతో పాటు కుటుంబాన్ని ప్రేమించడం అలవర్చుకోవాలని సూచించారు. కాళ్లు, చేతులూ లేని నిక్‌ను వీల్‌చైర్‌లో వేది కపైకి తీసుకొచ్చారు. అనంతరం ఆయనను ఎత్తుకుని వేదికపై ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన టేబుల్‌పై కూర్చోబె ట్టారు. అక్కడ నుంచే ఆయన 'హల్లో.. ఎవ్రిబడీ..' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించి యువతను ఉత్తేజపరుస్తూ ప్రసంగించారు.


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న నిక్ వుజిసిక్

నేడు ఏపీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్

సాక్షి, అమరావతి: 2024–25 ఆర్థిక సంవత్సరం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఏపీ ప్రభుత్వం బుధవారం అసెంబ్లీకి సమర్పించనుంది. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ బుధవారం ఉదయం 11.02 నిమిషాలకు 2024–25 ఆర్థిక సంవత్సరం పూర్తి స్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. అయితే త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆర్థిక ఏడాది తొలి మూడు నెలల వ్యయానికి (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) ఓటాన్ అకౌంట్ పద్దు ఆమోదానికి సభలో ప్రతిపాదించనున్నారు. అదే సమయానికి శాసన మండలిలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను చదువుతారు. అంతకు ముందు ఉదయం 8 గంటలకు సచివాలయంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది. మొత్తం బడ్జెట్ రూ. 2.85 లక్షల కోట్లకు పైగా ఉంటుందని సమాచారం.

జేఈఈ మెయిన్స్ రెస్పాన్స్ షీట్ విడుదల

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్–1) రెస్పాన్స్ షీట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారంరాత్రి విడుదల చేసింది. జేఈఈ మెయిన్ వెబ్‌సైట్‌లో దీన్ని విద్యార్థులకు అందుబాటులో ఉంచింది. పరీక్ష రాసిన విద్యార్థుల పత్రాలు కూడా లభిస్తాయి. 'ప్రాథమిక కీ'తో దీన్ని సరిపోల్చుకుని చూసుకోవచ్చు. ఎక్కడైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8వ తేదీలోగా రూ.200 రుసుము చెల్లించి చాలెంజ్ చేసే వెసులుబాటు కల్పించింది.

మార్చిలో పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు


ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వివిధ పీజీ రెగ్యులర్ కోర్సుల మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు మార్చి నెలలో జరగనున్నాయి. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 19 వరకు ఫీజు చెల్లించాలని అధికారులు పేర్కొన్నారు. రూ.300 అపరాధ రుసుముతో 23వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

నేడు గుడిమెలిగె పండుగ

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం మహా జాతర ఉత్సవాల్లో మొదటి కార్యక్రమమైన గుడిమెలిగె పండుగ బుధవారం జరగనుంది. పూజారులు మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయాలు, పూజా సామగ్రిని శుద్ధి చేసి అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ పండుగ మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతరకు నాంది పలుకుతుంది. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మహాజాతర జరగనుంది. జాతరకు రెండు వారాల ముందు గుడిమెలిగె కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

చెరువుల ఆక్రమణలను తీవ్రంగా పరిగణించాలి

- లేదంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవు
- చెరువుల ఆక్రమణలపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- అడ్వొకేట్ కమిషనర్లుగా ఇద్దరు న్యాయవాదుల నియామకం
- 3 వారాల్లో 16 చెరువులపై నివేదిక ఇవ్వాలని ఆదేశం
- తదుపరి విచారణ మార్చి 11కు వాయిదా



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని చెరువుల శిఖం, ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, సీసీ కెమెరాల ఏర్పాటు సాధ్యాసాధ్యాలు, చుట్టూ కంచె ఏర్పాటు.. తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించేందుకు డిప్యూటీ సొలిసిటర్ జనరల్(డీఎస్‌జీ) గాడి ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ జీపీ శ్రీకాంత్ రెడ్డిని అడ్వొకేట్ కమిషనర్లుగా హైకోర్టు నియమించింది. రెండు జిల్లాల పరిధిలోని 16 చెరువులను పరిశీలించి మూడు వారాల్లో స్థాయి నివేదికను సీల్డ్ కవర్‌లో అందజేయాలని ఆదేశించింది. అంతరించిపోతున్న చెరువులను కాపాడేందుకు వీరిని నియమించినట్లు చెప్పింది. దీనికంతటికీ అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని స్పష్టం చేసింది. 'భవిష్యత్ తరాలు బాగుండాలన్నదే మా అభిమతం. ఒకప్పుడు హైదరాబాద్‌ను సరస్సుల నగరంగా పిలిచేవారు. ఇప్పుడు చాలా చెరువులు, సరస్సులు ఆక్రమణలతో అంతరించిపోయాయి. హైకోర్టు పక్కనే ప్రవహించే నది(మూసీ) దుస్థితినే మనం చూడవచ్చు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలి. లేదంటే భవిష్యత్ తరాలు క్షమించవు' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే వ్యాఖ్యానించారు.

13 నీటి వనరులపై నివేదిక..

హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయని, శిఖంను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని.. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ గమన సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ సి దయాకర్ 2007లో హైకోర్టుకు లేఖ రాశారు. ముఖ్యంగా దుర్గం చెరువు, సున్నం చెరువు, పెద్ద చెరువు, ఫిర్జాదిగూడ, దామర చెరువు, దుండిగల్, చిన రాయుని చెరువు, గంగారం పెద్ద చెరువు, మేడికుంట చెరువు, హస్మత్‌పేట, బావురుడ తదితర చెరువులు ఆక్రమణలకు గురై పూర్తిగా కుంచించుకుపోయాయని పేర్కొన్నారు. ఈ లేఖను న్యాయస్థానం రిట్ పిటిషన్‌గా విచారణ స్వీకరించింది. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. దుర్గం చెరువు, సున్నం చెరువు, ఫిర్జాదిగూడ పెద్ద చెరువు, చినదామర, చినరాయుని, గ్గాగారం పెద్ద చెరువు, మేడికుంట, నల్లచెరువు, బోయిన్ చెరువు, మద్దెలకుంట, నల్లగండ్ల చెరువు, అంబీర్ చెరువు, గోసాయి కుంట.. 13 నీటి వనరులకు సంబంధించి ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్, కంచె ఏర్పాటుపై నివేదికను హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్ కోర్టుకు అందజేశారు.

పరస్పర విరుద్ధ స్టేట్‌మెంట్లతో అడ్వొకేట్ కమిషనర్ల నియామకం

అడిషనల్ అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. దుర్గం చెరువు చుట్టూ సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేసినందున కంచె వేయడం సాధ్యం కాదని చెప్పారు. అయితే జీహెచ్ఎంసీ కమిషనర్ అందజేసిన నివేదికలో మాత్రం కంచె ఏర్పాటు చేసినట్లు ఉండటంపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. పరస్పర విరుద్ధంగా స్టేట్‌మెంట్లు ఉండటంతో అడ్వొకేట్ కమిషనర్ల నియామకం చేస్తున్నట్లు స్పష్టం చేసింది. వీరు చెరువులను పరిశీలించి నివేదిక అందజేస్తారని చెప్పింది. ఇద్దరికీ రూ.25 వేల చొప్పున రెమ్యునరేషన్ అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. విచారణకు జీహెచ్ఎంసీ తరఫున జయకృష్ణ, కేంద్రం తరఫున డీఎస్‌జీ గాడి ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ తరఫున శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. దుర్గం చెరువు చుట్టూ కంచె ఏర్పాటుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకోవాలని ఏఏజీని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం మార్చి 11కు వాయిదా వేసింది.

'కన్జర్వేషన్ రిజర్వ్' ఓకే

ఆమోదించిన స్టేట్‌వైల్డ్ లైఫ్ బోర్డు

సాక్షి, హైదరాబాద్ : కవ్వాల్ టైగర్ రిజర్వ్‌కు కొనసాగింపుగా కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు ప్రతిపాదనకు స్టేట్‌వైల్డ్ లైఫ్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాంతాల్లో పులుల స్వేచ్ఛగా సంచరించేందుకు వీలుగా కాగజ్ నగర్, ఆసిఫాబాద్ డివిజన్లలో మొత్తం 1492 చదరపు కిలోమీటర్ల పరిధిలో కన్జర్వేషన్ రిజర్వ్ రూపుదిద్దుకోనుంది.

■ మారుమూల ప్రాంతాల్లో సెల్‌ఫోన్ కనెక్టివిటీ పెంచేందుకు వచ్చిన 19 ప్రతిపాదనలను స్టేట్‌వైల్డ్ లైఫ్ బోర్డ్ ఆమోదించింది. అయితే కోర్ ఏరియా పరిధిలోకి వచ్చే ఐదు ప్రతిపాదనలను మాత్రం బోర్డు ఆమోదించలేదు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలతో పాటు అటవీ ప్రాంతాల్లో ఉన్న ఆవాసాలకు టీ ఫైబర్ కనెక్టివిటి కల్పించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ■ వన్యప్రాణుల దాడుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఇచ్చే నష్టపరిహారం రూ.10 లక్షలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే తీసుకున్న నిర్ణయాన్ని వైల్డ్‌లైఫ్ బోర్డ్ ఆమోదించింది.

మంగళవారం సచివాలయంలో అటవీ, దేవాదాయ శాఖల మంత్రి, స్టేట్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ చైర్మన్ కొండా సురేఖ అధ్యక్షతన ఏడవ స్టేట్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్ర స్థాయి ఎకో టూరిజం పాలసీ రూపొందిస్తామని స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాల్లో కనెక్టివిటీకి ఇస్తున్న ప్రాధాన్యమే వన్యప్రాణుల సంరక్షణకు ఇవ్వాలన్నారు. పొరుగురాష్ట్రాల నుంచి ఏనుగులను మతపరమైన ఊరేగింపులు, సంబంధిత కార్యకలాపాలకు తెచ్చేందుకు ఎన్ఓసీ జారీ చేయాలని అభ్యర్థిస్తూ అటవీశాఖకు భారీగా దరఖాస్తులు అందుతున్నాయి. సమావేశంలో అటవీ, పర్యావరణశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, పీసీసీఎస్ (హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్ఎం. డోబ్రియాల్, పీసీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్) ఎంసీ పర్గెయిన్, ఫీల్డ్ డైరెక్టర్లు క్షితిజ, శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

బాలికల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్

సాక్షి, యాదగిరిగుట్ట/భువనగిరి: ఇటీవల భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన ఇద్దరి విద్యార్థినుల అనుమానాస్పద మృతిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. భువనగిరి పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థినులు భవ్య, వైష్ణవి ఆత్మహత్య చేసుకున్న గదిని మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... విద్యార్థినులు ఇద్దరూ ఒకే గదిలో ఆత్మహత్య చేసుకున్నారని, ఆ భవనం పరిసరాలు, గదిలో లభించిన సూసైడ్‌నోట్ అనుమానాస్పదంగా ఉన్నాయని చెప్పారు. హాస్టల్‌లోకి బయట నుంచి అదనంగా వ్యక్తులు వచ్చినట్లు చెబుతున్నారని, ఈ విషయంలో పోలీసు విచారణ పారదర్శకంగా ఉండాలని కోరారు. 'మా డిమాండ్‌కు స్పందించి...ఆలస్యంగానైనా దర్యాప్తునకు విచారణ అధికారిని నియమించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు' అని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

భువనగిరి హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

బాలికల మృతిపై విచారణకు ఆదేశించిన మంత్రి సీతక్క

సాక్షి, యాదాద్రి: భువనగిరిలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు వైష్ణవి, భవ్య అనుమానాస్పద మృతి ఘటనపై పూర్తి స్థాయి విచారణకు మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు విచారణ అధికారిగా స్త్రీశిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.ఆర్.ఎస్.లక్ష్మీదేవిని నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, హాస్టల్ వార్డెన్ శైలజను మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా, పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిందని, బాలికల ఒంటిపై గాయాలేమీ లేవని భువనగిరి జోన్ డీసీపీ రాజేశ్‌చంద్ర 'సాక్షి'తో చెప్పారు. ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరుపుతున్నామనీ, ఈ కేసులో ఆటో డ్రైవర్ ఆంజనేయులు, వంటమనిషితో పాటు మరికొందరి అనుమానితులను విచారిస్తున్నామని డీసీపీ తెలిపారు. బాలికల మృతిపై విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరిలో విద్యార్థులు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు.

పాక్ ఎన్నికల బరిలో...

ఆమె అంతంతే

పోటీలో ఉన్న మహిళలు 839 మందే

- మొత్తం అభ్యర్థుల్లో కేవలం 4.7 శాతం
- తొలిసారి బరిలో హిందూ మహిళ
- ఆకట్టుకుంటున్న మరో యూట్యూబ్ సంచలనం

పాకిస్తాన్‌లో సాధారణ ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమవుతోంది. గురువారం దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. పాక్‌లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా సైన్యం దన్నున్న పార్టీయే గెలవడం ఆనవాయితీ. ఆ లెక్కన ఈసారి మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సారథ్యంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్)దే విజయం ఖాయమంటున్నారు. మరో మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సైన్యం ఆగ్రహానికి గురై జైలుపాలవడంతో ఆయన పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ కకావికలైపోయింది. బిలావల్ భుట్టో సారథ్యంలోని పీపీపీ కూడా పెద్దగా పోటీ ఇచ్చేలా కన్పించడం లేదు. ఎప్పట్లాగే ఈ ఎన్నికల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం అంతంతే ఉంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

పాకిస్తాన్ ఎన్నికల బరిలో ఉన్న మొత్తం 17 వేల మంది పై చిలుకు అభ్యర్థుల్లో మహిళలు ఎందరో తెలుసా? కేవలం 839 మంది! అంటే 4.7 శాతం. సాంప్రదాయికంగా పాక్‌లో మహిళలకు రాజకీయాల్లో అంతగా ప్రోత్సాహం దక్కదు. దాంతో ఎన్నికల్లో కూడా వారి ప్రాతినిధ్యమూ అంతంతమాత్రంగానే ఉంటూ వస్తోంది. పరిస్థితిని మార్చేందుకు మహిళలకు కనీసం 5 శాతం టికెట్లివ్వడాన్ని ఎన్నికల సంఘం తప్పనిసరి చేసింది. అయినా వారికి ఆ మాత్రం టికెట్లిచ్చేందుకు కూడా ప్రధాన పార్టీలకు మనసు రావడం లేదు. ఈసారి మహిళలకు ఇమ్రాన్ సారథ్యంలోని పీటీఐ ఇచ్చిన 53 టికెట్లే అత్యధికం! అయితే వారిలోనూ జాతీయ అసెంబ్లీకి పోటీ పడుతున్నది కేవలం 28 మందే. మిగతా 25 మంది ప్రావిన్సుల స్థానాల్లో పోటీకి పరిమితమయ్యారు. ఇక మహిళలకు పీపీపీ 4.5 శాతం, పీఎంఎల్ (ఎన్) కేవలం 4.2 శాతం టికెట్లతో సరిపెట్టాయి. పీపీపీ నుంచి 35 మంది, పీఎంఎల్ నుంచి 28 మంది మహిళలే బరిలో ఉన్నారు. వారిలోనూ చాలామంది పోటీ ప్రావిన్సు స్థానాలకే పరిమితం! కాకపోతే పాక్ చరిత్రలోనే తొలిసారిగా ఓ హిందూ మహిళ బరిలోకి దిగుతుండటం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలవనుంది. అలాగే ఓ యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్, తాలిబన్ల చేతిలో భర్తను కోల్పోయిన మరో మహిళా నేత బరిలో ఉన్నారు....

సవీరా.. తొలి హిందూ అభ్యర్థి



25 ఏళ్ల సవీరా ప్రకాశ్ పాకిస్తాన్‌లో ఎన్నికల్లో పోటీ చేస్తున్న తొలి హిందూ మహిళగా చరిత్ర సృష్టించారు. ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వా ప్రావిన్సులో బునెర్ జిల్లాలోని పీకే-25 నియోజకవర్గం నుంచి పీపీపీ టికెట్‌పై బరిలో దిగిన ఆమె ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇటీవలే వైద్యవిద్య పూర్తి చేసిన సవీరాది ఆసక్తికరమైన నేపథ్యం. ఆమె తండ్రి ఓం ప్రకాశ్ సిక్కు కాగా తల్లి క్రిస్టియన్. వారిద్దరి అంగీకారంతో సవీరా మాత్రం హిందూ మతావలంబిగా మారారు. తద్వారా పాక్ వంటి ముస్లిం మెజారిటీ దేశంలో మత సహనానికి, సామరస్యానికి ప్రతీకగా నిలిచారామె. భారత మూలాలున్న ఓం ప్రకాశ్ ఉచిత వైద్యంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో బాగా పేరు పొందారు. ఎన్నడూ ఎన్నికల బరిలో దిగకపోయినా 30 ఏళ్లుగా పీపీపీ కార్యకర్తగా ఉంటూ వస్తున్నారు. చెడు చేయాలని ఏ మతమూ చెప్పదంటూ సవీరా చేస్తున్న ప్రచారానికి ముస్లింల నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది. మత, లింగ వివక్షను నిర్మూలించడమే తన లక్ష్యమని ఆమె అంటున్నారు. ''పాక్‌లో ప్రజా జీవితంలో మహిళ పట్ల వివక్ష బాగా ఉంది. మా జిల్లానే తీసుకుంటే చదువుకున్న మహిళల సంఖ్య కేవలం 29 శాతం. దేశవ్యాప్తంగా కూడా మహిళల్లో అక్షరాస్యత 46 శాతమే. దీన్ని మార్చేందుకే ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నా'' అని చెబుతున్నారు. మహిళా రిజర్వు స్థానం నుంచి కాకుండా జనరల్ సీటు నుంచి ఆమె బరిలో దిగడం మరో విశేషం.

ఓటర్లను 'ఇన్‌ఫ్లుయెన్స్' చేస్తుందా...?



లాహోర్‌లోని ఎన్ఏ-122 స్థానంలో పీఎంఎల్ (ఎన్) అభ్యర్థి ఖవాజా సాద్ రఫీక్, పీటీఐకి చెందిన లతీఫ్ ఖోసా హోరాహోరీ తలపడుతున్నారు. వారిద్దరినీ ఢీకొంటున్న ఓ యూట్యూబ్ సంచలనం ఇప్పుడు దేశమంతటి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఆమే జెబా వకార్. వృత్తిరీత్యా గైనకాలజిస్టు అయిన ఆమె జమాత్ ఇ ఇస్లామీ అనే మతపరమైన పార్టీ సభ్యురాలు. ఆ పార్టీ తరఫునే బరిలో దిగారు. యూట్యూబ్‌లో ఆమెకు 17,500 మందికి పైగా ఫాలోయర్లున్నారు. ఖురాన్, హదీత్‌లపై రోజూ ప్రసంగాలు అప్‌లోడ్ చేస్తుంటారు. విద్యాధికులైన యువతులకు ఖురాన్ పాఠాలు చెప్పే సంస్థను కూడా భర్తతో కలిసి నడుపుతున్నారు. ''నన్ను గెలిపిస్తే మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేలా చూస్తా. వారిపై వేధింపులకు తెరదించేలా కఠిన చట్టాల కోసం కృషి చేస్తా'' అని చెబుతున్నారు.

భర్త బాటన...



ఇక పెషావర్ నుంచి బరిలో దిగుతున్న సమర్ హరూన్ బిలౌర్‌ది మరో గాథ. గత ఎన్నికల వేళ ఆమె భర్త హరూన్‌ను ప్రచారం సందర్భంగా పాక్ తాలిబన్లు కిరాతకంగా కాల్చి చంపారు. దాంతో ఆయన స్థానంలో సమర్ బరిలో దిగాల్సి వచ్చింది. అవామీ వర్కర్స్ పార్టీ తరఫున ఆ ఎన్నికల్లో నెగ్గి పెషావర్ నుంచి తొలి మహిళా ప్రావిన్షియల్ ఎంపీగా రికార్డు సృష్టించారామె. దాంతో దేశ రాజకీయాల్లో ఆమె పేరు అందర్లోనూ నానింది. ఈసారి కూడా ఆమె మళ్లీ బరిలో దిగుతున్నారు. అఫ్గాన్ సరిహద్దులకు సమీపంలో ఉండే పష్తూన్ ప్రాబల్య నగరమైన పెషావర్‌లో, పరిసర ప్రాంతాల్లో మహిళలపై అణచివేత మరింత అధికం. మహిళలపై తీవ్ర అణచివేతలకు పేరుమోసిన తాలిబన్ల ప్రభావం మరింత ఎక్కువ. దాంతో సమర్ చాలా సమస్యలు ఎదుర్కొన్నారు. గత ఎన్నికలప్పుడు మతోన్మాద మూకల బెదిరింపుల నేపథ్యంలో బిక్కుబిక్కుమంటూనే ప్రచారం చేశారు. ఈ ఐదేళ్లలో పరిస్థితులు కాస్త మెరుగయ్యాయంటారు సమర్. నిత్యం ప్రజల్లో తిరుగుతూ, వారి సమస్యలను వింటూ, ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండటం ఆమెకు బాగా పేరు తెచ్చింది.

మిస్ జపాన్ కిరీటం వదులుకున్న షినో

టోక్యో: మిస్ జపాన్ కిరీటం దక్కించుకున్న సుందరి కరోలినా షినోకు చివరికి నిరాశే మిగిలింది. ఉక్రెయిన్‌లో జన్మించిన ఈ సుందరి జపాన్‌లోనే పెరిగింది. జనవరి 22వ తేదీన నిర్వహించిన పోటీల్లో మిస్ జపాన్ కిరీటం దక్కించుకుంది. ఆమె జపనీయురాలు కాదంటూ అప్పుడే ఆమెపై విమర్శలు చెలరేగాయి. అవి సద్దుమణిగేలోగానే మరో బాంబు పేలింది. కరోలినా షినో ఓ డాక్టర్‌తో సంబంధం పెట్టుకుందని, అతడికి ఇప్పటికే పెళ్లయి పిల్లలు కూడా ఉన్నారంటూ బున్షున్ అనే మేగజీన్ కథనం ప్రచురించింది. ఈ కథనంతో షినో షాక్‌కు గురైంది. అతడికి పెళ్లయినట్లు తెలుసని, తెలీదని పరస్పర విరుద్ధ ప్రకటనలు చేసి విమర్శల పాలైంది. చివరికి, మిస్ జపాన్ కిరీటాన్ని వదులుకుంటున్నట్లు ప్రకటించింది. కార్యక్రమం నిర్వాహకులు సైతం ఈ విషయాన్ని ధ్రువీకరించారు. మిస్ జపాన్-2024 విజేత పోస్టు ఖాళీగానే ఉండిపోతుందని ప్రకటించారు.

ట్రంప్‌ను విచారించొచ్చు

అల్లర్ల కేసుపై అప్పీల్స్ ప్యానెల్ స్పష్టీకరణ

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ. 2020 అధ్యక్ష ఎన్నికలను తారుమారు చేసేందుకు ప్రయత్నించిన కేసులో విచారణ నుంచి ఆయనకు మినహాయింపు లేదని ఫెడరల్ అప్పీల్స్ ప్యానెల్ మంగళవారం స్పష్టం చేసింది. అప్పట్లో దేశాధ్యక్షుణ్ని గనుక ఇలాంటి విచారణల నుంచి తనకు మినహాయింపు ఉందన్న ట్రంప్ వాదనలను న్యాయమూర్తులు తిరస్కరించడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి. ఇక దీనిపై సుప్రీంకోర్టే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వచ్చే నవంబర్‌లో అధ్యక్ష ఎన్నికలు పూర్తయ్యేదాకా ఈ అంశం సుప్రీం దాకా వెళ్లకుండా చూసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల్లో నెగ్గి మళ్లీ అధ్యక్షుడైతే తన ప్రత్యేకాధికారాలను ఉపయోగించి ఈ కేసులను కొట్టేయడమో, స్వీయ క్షమాభిక్ష ప్రసాదించుకోవడమో చేస్తారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తరాఖండ్ అసెంబ్లీలో యూసీసీ బిల్లు

- అతిత్వరలో చర్చ.. ఓటింగ్
- యూసీసీ బిల్లు నుంచి గిరిజనులకు మినహాయింపు

డెహ్రాడూన్: అత్యంత కీలకమైన ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) విషయంలో బీజేపీ పాలిత ఉత్తరాఖండ్ ప్రభుత్వం ముందడుగు వేసింది. యూసీసీ బిల్లును సీఎం పుష్కర్‌సింగ్ ధామీ మంగళవారం అసెంబ్లీ ప్రవేశపెట్టారు. అధికార బీజేపీ సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేయగా విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వాస్తవానికి ఉమ్మడి పౌరస్మృతి బిల్లుపై మంగళవారమే చర్చ, ఓటింగ్ జరగాల్సి ఉండగా, విపక్షాల నిరసనల వల్ల అది సాధ్యం కాలేదు. చర్చ జరగకుండానే బిల్లును ఆమోదించుకోవడానికి ప్రభుత్వం కుట్ర పన్నిందని ప్రతిపక్ష ఎమ్మెల్యే యశ్‌పాల్ ఆర్య మండిపడ్డారు. యూసీసీ బిల్లుపై ఉత్తరాఖండ్ అసెంబ్లీలో ఒకటి రెండు రోజుల్లో చర్చ, అనంతరం ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. సభలో ప్రభుత్వానికి తగిన సంఖ్యాబలం ఉండడంతో బిల్లు ఆమోదం పొందడం, గవర్నర్ సంతకంతో చట్టంగా మారడం లాంఛనమేనని చెప్పొచ్చు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇలాంటి బిల్లును ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ చరిత్ర సృష్టించింది. ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ ఉమ్మడి పౌరస్మృతి బిల్లును తీసుకొచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు దేశంలో ప్రస్తుతం గోవాలో మాత్రమే ఉమ్మడి పౌరస్మృతి చట్టం అమలవుతోంది. అక్కడ పోర్చుగీసు పాలనా కాలంలోనే ఈ చట్టాన్ని తీసుకొచ్చారు.



రాజ్యాంగ ప్రతితో అసెంబ్లీకి వెళ్తున్న సీఎం

ఉమ్మడి పౌరస్మృతి బిల్లులో ఏముంది?

- ఉత్తరాఖండ్‌లో నివసిస్తున్న ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న ఉత్తరాఖండ్ పౌరులకు ఈ బిల్లు వర్తిస్తుంది.
- గిరిజన వర్గాల ప్రజలను బిల్లు నుంచి మినహాయించారు.
- భారత రాజ్యాంగంలోని పార్ట్-21 కింద తమ హక్కుల రక్షణ పొందుతున్న వ్యక్తులకు, సమూహాలకు కూడా మినహాయింపు ఉంటుంది.
- సహజీవనాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.
- సహజీవనం ద్వారా జన్మించిన పిల్లలకు చట్టబద్ధంగా గుర్తింపు లభిస్తుంది.
- వివాహం, విడాకులు, భూమి, ఆస్తి, వారసత్వం, దత్తత తదితర అంశాల్లో మతాలకు అతీతంగా ప్రజలందరికీ ఒకే చట్టం అమలు చేస్తారు.
- మతాలతో సంబంధం లేకుండా బహుభార్యత్వంపై నిషేధం అమలవుతుంది. ఒక్కరు ఒక్కరి కంటే ఎక్కువ మందిని పెళ్లి చేసుకోవడానికి వీల్లేదు.
- ఎవరి మతాచారం ప్రకారం వారు వివాహం చేసుకోవచ్చు.
- సహజీవనం చేసే స్త్రీపురుషుల వయసులు వరుసగా 18, 21 ఏళ్లకు పైబడి ఉండాలి.
- సహజీవనం ప్రారంభించిన తర్వాత నెల రోజులలోపు ప్రభుత్వ రిజిస్ట్రార్‌కు సమాచారం ఇవ్వాలి. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. లేకపోతే వారికి ఆరు నెలల దాకా జైలుశిక్ష లేదా రూ.25 వేల జరిమానా లేదా ఈ రెండు శిక్షలూ విధిస్తారు.
- సహజీవనంపై రిజిస్ట్రార్‌కు తప్పుడు సమాచారం ఇస్తే భారీగా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.
- సహజీవనం సాగిస్తున్న మహిళను పురుషుడు వదిలేస్తే బాధితురాలు కోర్టును ఆశ్రయించవచ్చు. అతడి నుంచి జీవనభృతి పొందవచ్చు.
- పెళ్లి కాని జంటల మధ్య సహజీవనాన్ని అరికట్టేలా బిల్లులో పలు కీలకాంశాలు జోడించారు.

అజిత్ వర్గమే అసలు ఎన్సీపీ

పార్టీ, గుర్తు వారికే: ఈసీ

- శరద్ పవార్ వర్గానికి గట్టి షాక్
- సుప్రీంకోర్టుకు వెళ్తామని వెల్లడి



శరద్ పవార్



అజిత్ పవార్

న్యూఢిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) వ్యవస్థాపకుడు శరద్ పవార్‌కు పెద్ద షాక్ తగిలింది. ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ నేతృత్వంలోని చీలిక వర్గమే అసలైన ఎన్సీపీ అని ఎన్నికల సంఘం తేల్చింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్సీపీ ఎన్నికల గుర్తు 'గోడ గడియారం'ను అజిత్ వర్గానికే కేటాయించింది. ఎన్సీపీ ఎమ్మెల్యేల్లో మెజార్టీ సభ్యులు అజిత్ వర్గంలోనే ఉన్నారని ఈసీ గుర్తు చేసింది. త్వరలో రాజ్యసభ ఎన్నికలున్నందున తమ పార్టీకి వెంటనే మరో పేరు పెట్టుకునేందుకు శరద్ పవార్ వర్గానికి అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొంది. అందుకు బుధవారం మధ్యాహ్నంలోగా మూడు పేర్లు ప్రతిపాదించాలని సూచించింది. అజిత్ 2023 జూలైలో మెజారిటీ ఎమ్మెల్యేలతో కలిసి వేరుకుంపటి పెట్టుకోవడం, మహారాష్ట్రలో బీజేపీ-శివసేన ప్రభుత్వంలో భాగస్వామిగా చేరడం తెలిసిందే. ఆయనకు ఉప ముఖ్యమంత్రి పదవి లభించింది. అనంతరం తమనే అసలు ఎన్సీపీగా గుర్తించాలంటూ రెండు వర్గాలూ ఈసీని ఆశ్రయించాయి.

కోర్టుకెళ్లినా ఇబ్బంది లేదు: అజిత్

ఈసీ తాజా నిర్ణయంపై అజిత్ హర్షం వెలిబుచ్చగా శరద్ పవార్ వర్గం భగ్గుమంది. ఉన్నత స్థాయి ఒత్తిడితో ఈసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా ఉందని ఆరోపించింది. ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారంటూ ఎన్సీపీ నేత అనిల్ దేశ్‌ముఖ్ మండిపడ్డారు. ఈసీ నిర్ణయాన్ని రెండు రోజుల్లోగా సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని శరద్ పవార్ కూతురు సుప్రియా సులే ప్రకటించారు. ఈసీ నిర్ణయం అనంతరం అజిత్ మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో మెజారిటీయే ముఖ్యమని, అది తమకే ఉందని చెప్పుకొచ్చారు. ''50 మంది ఎమ్మెల్యేలతో ఎన్సీపీ శ్రేణుల్లోనూ అత్యధికులు మావైపే ఉన్నారు. రాష్ట్రంలో దాదాపుగా అన్ని జిల్లాల అధ్యక్షులతో పాటు పార్టీకి చెందిన పలు విభాగాల అధ్యక్షులు మాకే మద్దతిస్తున్నారు'' అని చెప్పారు. శరద్ పవార్ వర్గం కోర్టుకు వెళ్లినా తమకు ఇబ్బందేమీ లేదన్నారు. ఈ అంశంలో అర్హత, మెజారిటీ ఆధారంగానే ఈసీ నిర్ణయం తీసుకుందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అభిప్రాయపడ్డారు. దాదాపు రెండేళ్ల క్రితం షిండే కూడా ఉద్ధవ్ ఠాక్రేతో విభేదించడం, శివసేనను చీల్చి బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి సీఎం కావడం తెలిసిందే. దీన్ని సవాలు చేస్తూ ఉద్ధవ్ కోర్టుకు వెళ్లినా లాభం లేకపోయింది. షిండే వర్గాన్నే అసలు సేనగా ఈసీ గుర్తించి ఉద్ధవ్ వర్గానికి షాకిచ్చింది.

బాణసంచా యూనిట్‌లో పేలుడు..

11 మంది దుర్మరణం

- మరో 174 మందికి గాయాలు
- మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని హర్దాలో బాణసంచా కర్మాగారంలో భీకర పేలుడు సంభవించింది. ఘటనలో 11 మంది చనిపోగా 174 మందికి గాయాలపాలయ్యారు. మంగళవారం ఉదయం బైరాగఢ్‌లోని ఫ్యాక్టరీలో శక్తివంతమైన పేలుడు సంభవించింది. దాంతో మంటలు చెలరేగి ఫ్యాక్టరీ చుట్టుపక్కలున్న 50కి పైగా ఇళ్లు సైతం కాలిబూడిదయ్యాయి. ఫ్యాక్టరీలో పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన గన్‌పౌడర్ వల్లే పేలుడు సంభవించిందని చెబుతున్నారు. చెల్లాచెదురుగా దూరంగా పడిన మృతదేహాలు, కాలిబూడిదైన, ధ్వంసమైన ఇళ్లు, ఇతర సామగ్రి, దట్టంగా వ్యాపించిన పొగతో ఆ ప్రాంతమంతా హృదయవిదారకంగా మారింది. పేలుళ్ల శబ్దాలు 20 కిలోమీటర్ల దూరం వరకు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బాణసంచా ఫ్యాక్టరీ భవనం ఆసాంతం శిథిలాల కుప్పలా మారిపోయిందని ఆయన వ్యాఖ్యానించడాన్ని చూస్తే ప్రమాద తీవ్రత అర్థమవుతుంది. మృతుల్లో కొందరు బాలలు సైతం ఉన్నట్లు చెబుతున్నారు. శిథిలాల్లో మృతదేహాల భాగాలను కొందరు ఏరుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన కొన్ని వీడియోల్లో ఉన్నాయి. ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కుక్క బిస్కెట్.. ఒక వివాదం

- కార్యకర్తకు రాహుల్ కుక్క బిస్కెట్లిస్తున్న వీడియో వైరల్
- తినకపోవడంతో యజమానితో ఇప్పించానని రాహుల్ వివరణ

గుమ్లా(జార్ఖండ్): భారత్ జోడో న్యాయ్‌యాత్ర సందర్భంగా ఒక కాంగ్రెస్ కార్యకర్త పెంపుడు శునకానికి రాహుల్‌గాంధీ బిస్కెట్లు తినిపించేందుకు ప్రయత్నించిన వీడియో వైరల్‌గా మారింది. కుక్క కూడా తినని బిస్కెట్లను కాంగ్రెస్ కార్యకర్తలకు సపంచుతున్నారంటూ బీజేపీ నేత అమిత్ మాలవీయ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. దీనిపై అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ స్పందించారు. ''రాహుల్, ఆయన కుటుంబమంతా నాతో ఇలాంటి బిస్కెట్లు తినిపించేందుకు విఫయత్నం చేశారు. వాటిని తిరస్కరించి కాంగ్రెస్‌కూ రాజీనామా చేశా'' అంటూ ట్వీట్‌చేశారు. దీంతో రాహుల్ వివరణ ఇచ్చారు. ''వందల మంది జనంలో బిత్తరపోయిన ఆ పెంపుడు కుక్క నేనిచ్చిన బిస్కెట్లు తినడానికి భయపడింది. అందుకే పక్కనే ఉన్న దాని యజమానికి ఇచ్చి తినిపించమని చెప్పాను. ఆయన పెడితే తినేసింది. ఇందులో వివాదమేముంది?'' అంటూ స్పష్టతనిచ్చారు. బీజేపీవి చౌకబారు విమర్శలంటూ కాంగ్రెస్ మండిపడింది. మరోవైపు భారత్ జోడో న్యాయ్‌యాత్ర మంగళవారం జార్ఖండ్‌లో ముగిసి ఒడిశాలో అడుగుపెట్టింది. అభివృద్ధి పేరిట గిరిజనుల భూములను మోదీ సర్కార్ లాక్కొని కార్పొరేట్ సంస్థలు, ఎన్జీవోలకు ధారాదత్తం చేస్తోందని రాహుల్ ఈ సందర్భంగా ఆరోపించారు.

మంత్రిగానేకాదు ఎంపీగానూ పనికిరావు

మురుగన్‌పై డీఎంకే నేత బాలు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: తమిళనాడుకు కేంద్ర నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపుతున్నారంటూ బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి మురుగన్‌పై డీఎంకే నేత టీఆర్ బాలు చేసిన విమర్శలు మంగళవారం లోక్‌సభలో వివాదానికి దారితీశాయి. ఆయన క్షమాపణలు చెప్పాలన్న బీజేపీ ఎంపీల డిమాండ్లతో సభ వేడెక్కింది. ప్రశ్నోత్తరాల సమయం ఇందుకు వేదికైంది. తుపాను హెచ్చరికలపై తమిళనాడును కేంద్రం అప్రమత్తం చేయలేదని బాలు అనడంతో తమిళనాడుకే చెందిన మురుగన్ వారించారు. ఆగ్రహించిన బాలు, ''మధ్యలో జోక్యం చేసుకోకు. నువ్వు ఎంపీ పదవికి సరితూగవు. మంత్రి పదవికి అస్సలు పనికిరావు. కూర్చో'' అన్నారు. దాంతో కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, అర్జున్ మేఘ్వాల్ తప్పుబట్టారు. వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవడంతో పాటు బాలుకు మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత మంత్రినే స్థాయిలేని వాడనడం ద్వారా మొత్తం ఎస్సీ సామాజిక వర్గాన్నే అవమానించారన్నారు. దీంతో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటామాటా పెరిగింది. చివరికి బాలు వ్యాఖ్యలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రికార్డుల నుంచి తొలగించారు.



అందుబాటులోకి 'భారత్ రైస్'

కేజీ ధర రూ.29

న్యూఢిల్లీ: రాయితీ ధరకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 'భారత్ రైస్' బియ్యం విక్రయాలు దేశవ్యాప్తంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. కిలో బియ్యం ధరను రూ.29గా ప్రభుత్వం నిర్ణయించిన విషయంతెల్సిందే. భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్), భారత జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య(ఎన్సీసీఎఫ్), కేంద్రీయ భండార్ రిటైల్ ఔట్‌లెట్‌లలో ఈ బియ్యాన్ని విక్రయిస్తారు. గత ఏడాదికాలంలో బియ్యం ధరలు రిటైల్ మార్కెట్లో 15 శాతం మేర పైకెగసిన నేపథ్యంలో సాధారణ ప్రజానీకానికి ధరల నుంచి కాస్తంత ఉపశమనం కల్పించే లక్ష్యంతో కేంద్రం ఇలా రాయితీ బియ్యం అమ్మకాలు ప్రారంభించింది. '' సగటు భారతీయునికి రోజువారీ ఆహార పదార్థాల ధరలు అందుబాటులో ఉంచేందుకే ఇలా బియ్యాన్ని రాయితీ ధరకు విక్రయిస్తున్నట్లు ఢిల్లీలో సబ్సిడీ రైస్ అమ్మకాల ప్రారంభోత్సవంలో కేంద్ర ఆహార, వినియోగ వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. 5 కేజీలు, 10 కేజీల ప్యాకెట్లలో భారత్‌రైస్ అందుబాటులో ఉంటుంది. ఢిల్లీలో భారత్‌రైస్‌ను విక్రయించే 100 మొబైల్ వ్యాన్లను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో ఐదుగురు లబ్ధిదారులకు ఐదు కేజీల బ్యాగులను పంపిణీచేశారు. ఈ బియ్యాన్ని ఆన్‌లైన్‌లో ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపైనా ఆర్డర్‌చేయవచ్చు.

'పోటీ పరీక్షల' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

విపక్షాలు సూచించిన సవరణలకు తిరస్కరణ

న్యూఢిల్లీ: పోటీ పరీక్షల్లో అక్రమాలను అరికట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లు-2024ను మంగళవారం లోక్‌సభ ఆమోదించింది. కొందరు ప్రతిపక్ష సభ్యులు సైతం బిల్లుకు మద్దతు పలికారు. ఈ బిల్లుకు మరికొందరు విపక్ష ఎంపీలు కొన్ని సవరణలు సూచించగా, ప్రభుత్వం తిరస్కరించింది. ప్రతిభ కలిగిన విద్యార్థుల, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడడానికే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో వెల్లడించారు.

త్వరలో 10 వందే భారత్ స్లీపర్ రైళ్లు

న్యూఢిల్లీ: వందే భారత్ ఎక్స్‌ప్రెస్ మాదిరిగానే వందే భారత్ స్లీపర్ రైళ్లు త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో రూపుదిద్దుకున్న ఈ రైళ్ల ట్రయల్ రన్ ఏప్రిల్ నుంచి ప్రారంభం కానుంది. మొదటి దశలో 10 రైళ్లను ప్రవేశపెడతారు. ఇందులో ఏసీ, నాన్ ఏసీ స్లీపర్ కోచ్‌లుంటాయి. సుమారుగా 16 నుంచి 20 వరకు కోచ్‌లుండే ఈ రైళ్లను మొదటి దశలో ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-హౌరా మార్గాల్లో నడిపేందుకు ఏర్పాట్లు శరవేగంతో జరుగుతున్నాయి. రాజధాని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల కంటే ఇవి వేగంగా ప్రయాణించనున్నాయి. వీటిలో ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉండటంతోపాటు, ప్రయాణ సమయం కనీసం రెండున్నర గంటలు ఆదా అవుతుందని సమాచారం.

ఢిల్లీలో లష్కరే ఉగ్రవాది అరెస్ట్

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా మాడ్యూల్‌కు చెందిన ఉగ్రవాది రియాజ్ అహ్మద్ రథేర్‌ను అరెస్ట్ చేసినట్లు ఢిల్లీ పోలీసులు మంగళవారం తెలిపారు. ఇతడు గత ఏడాది జనవరిలో రిటైరైన ఆర్మీ అధికారి అని వెల్లడించారు. నియంత్రణ రేఖ వెంబడి సరిహద్దు ఆవలి నుంచి లష్కరే శ్రేణుల నుంచి ఇతడు ఆయుధాలు, మందుగుండు సామగ్రిని దొంగచాటుగా తీసుకురావడంలో ఇతడు కీలకంగా ఉన్నాడన్నారు. ఈ కుట్రలో పాలుపంచుకుంటున్న ఖుర్షీద్ అహ్మద్ రథేర్, గులాం సర్వర్ రథేర్‌తోపాటు అయిదుగురిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు.

సీఎం సిద్దరామయ్యకు హైకోర్టు షాక్

శివాజీనగర: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు హైకోర్టులో చుక్కెదురైంది. ధర్నా, రాస్తారోకోలో పాల్గొని ప్రజలకు ఇబ్బంది కలిగించిన కేసును రద్దు చేయాలని కోరుతూ ఆయన వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో సిద్దరామయ్య, కాంగ్రెస్ నేతలు రణదీప్ సింగ్ సుర్జేవాలా, ఎంబీ పాటిల్, ఎమ్మెల్యే రామలింగారెడ్డి తదితరులు 2022 ఏప్రిల్ 14న కాంట్రాక్టర్ సంతోష్ ఆత్మహత్యను ఖండిస్తూ బెంగళూరులోని సీఎం బస్వరాజ్ బొమ్మై నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ధర్నాతో ప్రజలకు ఇబ్బంది కలిగించారంటూ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఆ కేసును కొట్టివేయాలని ఇటీవల సిద్దరామయ్య హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసును మంగళవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్.దీక్షిత్.. ప్రజాప్రతినిధులు నిబంధనలను పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎస్ఐని వ్యక్తిగతంగా ప్రతివాదిగా చేర్చినందుకు సిద్దరామయ్యతోపాటు మిగతా వారికి రూ. 10 వేలు జరిమానా విధిస్తూ అర్జీని కొట్టివేశారు.


సీజన్ వర్షపాతమంతా రెండ్రోజుల్లోనే

లాస్‌ఏంజెలెస్‌లో కుంభవృష్టి • కాలిఫోర్నియాకు కొండచరియల ముప్పు

లాస్‌ఏంజెలెస్: అమెరికాలో తుపానులు మోసుకొచ్చిన కుండపోత వర్షాలతో కాలిఫోర్నియా దక్షిణ ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షకాల సీజన్ మొత్తం కురవాల్సిన వర్షపాతం కేవలం రెండ్రోజుల్లోనే పడి లాస్‌ఏంజెలెస్‌ను పూర్తిగా ముంచెత్తింది. దీంతో కొండచరియలు విరిగి పడే ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గంటకు దాదాపు 3 సెంటీమీటర్ల మేర వర్షం పడే అవకాశం ఉందని పేర్కొంది. తుపానుకు కాలిఫోర్నియాలో ముగ్గురు బలయ్యారు. ఎడతెగని వానలు లాస్‌ఏంజెలెస్‌నూ ముంచెత్తాయి. ఇక్కడ వార్షిక సగటు వర్షపాతం 36 సెంటీమీటర్లయితే ఒక్క సోమవారమే 18 సెంటీమీటర్ల మేర కురిసింది. మంచు, హిమపాతం నేపథ్యంలో కాలిఫోర్నియాలోని 8 కౌంటీల్లో ఎమర్జెన్సీ విధించారు.

ప్రొస్టేట్ కేన్సర్ కాదు

చార్లెస్ అనారోగ్యంపై ప్యాలెస్ వివరణ



లండన్: బ్రిటన్ రాజు చార్లెస్-3 (75) అనారోగ్యంపై బకింగ్‌హమ్ ప్యాలెస్ స్పష్టతనిచ్చింది. ఇటీవల ఆయన ప్రొస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్‌కు చికిత్స తీసుకున్న విషయం తెలిసిందే. ఈ వ్యాధి చికిత్స సమయంలో చేసిన ఇతర పరీక్షలతో కాన్సర్ వంటి లక్షణాలు బయట పడినట్లు బకింగ్‌హమ్ ప్యాలెస్ తెలిపింది. అవి ప్రొస్టేట్‌కు సంబంధించినవి మాత్రం కాదని సోమవారం సాయంత్రం స్పష్టం చేసింది. అయితే, అది ఏ రకమైన కేన్సర్ అనే విషయం వెల్లడించలేదు. రాజుకు కేన్సర్ చికిత్స మొదలైందని కూడా తెలిపింది. ఎన్నో కేన్సర్ చారిటీలకు నేతృత్వం వహిస్తున్న ఆయన..తనకు కేన్సర్ సోకిన విషయాన్ని బహిరంగపరచాలని భావించారని తెలిపింది. చికిత్స కొనసాగుతున్న సమయంలో అధికార పత్రాల పరిశీలన, ఆమోదం వంటి విధులను స్వయంగా ఆయనే చూసుకుంటారని, మిగతా బాధ్యతలను రాణి కెమిల్లా, ప్రిన్స్ విలియమ్ పంచుకుంటారని పేర్కొంది. రాజు చార్లెస్-3 ప్రొస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్ చికిత్స అనంతరం గత సోమవారం ఆయన డిశ్చార్జి అయ్యారు. ఆదివారం రాణి కెమిల్లాతో కలిసి శాండ్రింగ్‌హమ్ చర్చికి వెళ్తూ చివరి సారిగా బహిరంగంగా కనిపించారు. కేన్సర్ విషయాన్ని రాజు చార్లెస్ తన తోబుట్టువులు, పిల్లలకు స్వయంగా తెలిపినట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ వర్గాలు తెలిపాయి.

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 7 । ఫిబ్రవరి । 2024



జీఓ 142ను రద్దు చేయాలి

గత ప్రభుత్వం విడుదల చేసిన లోపభూయిష్టమైన 142 జీఓను రద్దు చేయాలని వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు కాంగ్రెస్ సర్కార్‌ను కోరారు. -8లో



రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని ఆ సంఘం తెలంగాణ గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి సూచించారు. -8లో

జలమండలి ఎండీని కలిసిన ఈఎస్‌సీఐ డైరెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డిని మంగళవారం ఈఎస్‌సీఐ డైరెక్టర్ జి.రామేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ) నిర్వహించే శిక్షణ, పరిశోధన కార్యక్రమాలను ఎండీకి వివరించారు. శిక్షణ కార్యక్రమాల షెడ్యూల్‌ను సమర్పించారు.

న్యూస్‌రీల్

దివ్యాంగుల ఉపాధి నైపుణ్యాల కల్పనకు కృషి

- హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ బీజే రావు



ల్యాప్‌టాప్‌లు అందుకున్న దివ్యాంగులతో బీజే రావు తదితరులు

రాయదుర్గం: దృష్టిలోపం ఉన్న దివ్యాంగులకు సమగ్ర విద్య, ఉపాధి కోసం నైపుణ్యాల కల్పనకు ప్రోత్సహిస్తామని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు స్పష్టం చేశారు. మంగళవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని వైస్ చాన్స్‌లర్ కాన్ఫరెన్స్ హాల్‌లో హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ (హెచ్‌టీబీఎఫ్) సహకారంతో శిక్షణ పొందుతున్న దృష్టి లోపం దివ్యాంగ ట్రైనీలకు ల్యాప్‌టాప్‌లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ షామన్న, పి.తుకారాం, ఎస్.అన్నవరం, ఆశిష్ జాకబ్ థామస్, శివాజీరావు, నటరాజ్ శంకరన్, దీపా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రహీల్ ఎస్కేప్ కేసులో మరో ఇద్దరి పాత్ర

పంజగుట్ట: ప్రజాభవన్ ఎదురుగా రోడ్డు ప్రమాదం చేసిన బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ కుమారుడు రహీల్ ఎస్కేప్ కేసులో మరో ఇద్దరి పాత్ర ఉన్నట్లు వెలుగులోకి వచ్చినట్లు వెస్ట్‌జోన్ డీసీపీ ఎం.విజయ్‌కుమార్ మంగళవారం వెల్లడించారు. సోమవారం గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో చిక్కిన పంజగుట్ట ఠాణా మాజీ ఇన్‌స్పెక్టర్ బి.దుర్గారావు విచారణలో వీరి పేర్లు వెలుగులోకి వచ్చాయని, దీంతో వీరిని నిందితులుగా చేర్చి గాలిస్తున్నామని పేర్కొన్నారు. దుర్గారావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా.. సొంత పూచీకత్తుపై షరతులతో కూడిన బెయిల్ మంజూరైందని వివరించారు. రహీల్‌ను తప్పించడంలో హనుమాన్, వెంకటేశ్వరరావు పాత్ర ఉన్నట్లు దుర్గారావు బయటపెట్టాడని, దీంతో ఈ ఇద్దరినీ 14, 15వ నిందితులుగా చేర్చామని విజయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం పరారీలో ఉన్న వీరినీ అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. దుర్గారావుపై ఐపీసీ 201, 217, 218, 225 ఏ, రెడ్‌విత్ 119 సెక్షన్ల కింద ఆరోపణలు చేసినట్లు వివరించారు. షకీల్, రహీల్ సహా విదేశాల్లో ఉన్న నిందితులపై లుక్ ఔట్ నోటీసులు జారీ చేసినట్లు డీసీపీ తెలిపారు.

మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించడంతో..

- మియాపూర్ ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు



ప్రేమ్‌కుమార్

మియాపూర్: కేసు విషయంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళపై దురుసుగా ప్రవర్తించిన మియాపూర్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. తన భర్త వేధిస్తున్నాడంటూ ఓ మహిళ మియాపూర్ ఠాణాకు వచ్చి ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్‌కు మొరపెట్టుకుంది. ఈ నేపథ్యంలోనే తన పట్ల ప్రేమ్‌కుమార్ దురుసుగా ప్రవర్తించాడని సదరు మహిళ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతికి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై ఉన్నతాధికారులు విచారణ జరిపిన అనంతరం ప్రేమ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు సీపీ ఆదేశాలు జారీ చేశారు. 2007 బ్యాచ్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ గతంలో సీఐడీలో పని చేశారు. గత సంవత్సరం జులై నెలలో మియాపూర్ పీఎస్‌కు బదిలీపై వచ్చారు. కాగా.. మూడు నెలల క్రితం ఇదే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కోసం వచ్చిన మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో ఓ ఎస్ఐ సస్పెండ్ అయిన విషయం మరువక ముందే ఈ ఘటన చోటుచేసుకుంది.

ఉచిత విద్యుత్ కోసం వివరాల సేకరణ

- బస్తీల్లో ప్రారంభించిన టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ

సాక్షి, సిటీబ్యూరో: గృహ జ్యోతి అమలు కోసం విద్యుత్ వినియోగదారుల నుంచి వివరాల సేకరణ, బిల్లింగ్ మిషన్‌లో నమోదు ప్రక్రియను టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ప్రారంభించారు. మంగళవారం ముషీరాబాద్‌లోని పలు బస్తీల్లో సీఎండీ విద్యుత్ సిబ్బందితో కలిసి పర్యటించారు. వినియోగదారుల నుంచి ఆధార్, రేషన్ కార్డు, విద్యుత్ కన్జూమర్ నంబర్‌లను సేకరించి అక్కడికక్కడే బిల్లింగ్ మిషన్‌లో అప్‌లోడ్ చేశారు. అర్హులైన కుటుంబాలు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ పొందడానికి మీటర్ రీడింగ్ కోసం వచ్చే విద్యుత్ సిబ్బందికి ఆధార్, రేషన్ కార్డు, విద్యుత్ కన్జూమర్ నంబర్ ఇవ్వాలని సూచించారు.





చిరునవ్వుల సాక్షిగా..

నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం చిల్డ్రన్ ఆఫ్ చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో పెద్దల రక్షణ కరువైన, అనాథ, ప్రైవేటు చిల్డ్రన్స్ హోమ్స్‌లో ఉంటున్న పిల్లలకు జనన, కుల, నదరం ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులను మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఓ పసికందును ఆనందంగా తన చేతుల్లోకి తీసుకుని బర్త్ సర్టిఫికెట్‌ను అందించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. - వివరాలు 8లో



ఎట్టకేలకు..

19న కౌన్సిల్ మీటింగ్

- హైకోర్టులో పిటిషన్ నేపథ్యంలో అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం
- బడ్జెట్, సాధారణ సమావేశం రెండూ ఒకే రోజు
- అసెంబ్లీ తరహాలో రెండు మూడు రోజులైనా జరపాలన్న సభ్యులు

సాక్షి, సిటీబ్యూరో: విషయం హైకోర్టుకు చేరిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు కసరత్తు మొదలైంది. సుదీర్ఘకాలంగా కౌన్సిల్ సమావేశం జరగకపోవడంతో ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదంటూ మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ (బీజేపీ) హైకోర్టును ఆశ్రయించడం.. అందుకు వివరణనివ్వాల్సిందిగా స్టాండింగ్ కౌన్సిల్‌ను హైకోర్టు ఆదేశించడంతో జీహెచ్ఎంసీలో చర్యలు మొదలయ్యాయి. కార్పొరేటర్లతో ఆగమేఘాలపై మంగళవారం మేయర్ అఖిలపక్ష సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎలాంటి ఆటంకాలు ఎదురవని పక్షంలో ఈ నెల 19న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. అదే రోజు బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించాలని భావించారు. రేపటి (గురువారం) నుంచే అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటం.. ఈ నెల రెండో వారం తర్వాత ఎప్పుడైనా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందనే అంచనాల నేపథ్యంలో ఈ తేదీని నిర్ణయించారు. కుదరని పక్షంలో అటూఇటూగానైనా నిర్వహించే అవకాశం ఉంది.

ఆ సమావేశాలు జరగని రోజుల్లోనే..

సాధారణంగా సభ్యులు సమావేశంలో ప్రస్తావించాల్సిన ప్రశ్నల్ని స్వీకరించేందుకు, అధికారులు వాటికి లిఖితపూర్వక సమాధానాలు సిద్ధం చేసేందుకు దాదాపు నెలరోజుల సమయం పడుతుంది. కానీ.. ఇప్పటికే బాగా ఆలస్యం కావడంతో పాటు లోక్‌సభ ఎన్నికల కోడ్ వస్తే ఇక సాధ్యం కాదు గనుక త్వరితంగా సమావేశం నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అసెంబ్లీ, లోక్‌సభ సభ్యులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా సమావేశానికి హాజరు కావాల్సి ఉన్నందున అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలు జరగని రోజుల్లో మాత్రమే జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తారు. దీన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఈ నిర్ణయం తీసుకున్న వెంటనే సభ్యుల నుంచి ప్రశ్నలను తీసుకోవడం కూడా ప్రారంభించారు.

ఒకే రోజు రెండు సమావేశాలు..

ప్రస్తుతం జీహెచ్ఎంసీకి స్టాండింగ్ కమిటీ లేకపోవడంతో రాబోయే ఆర్థిక సంవత్సర బడ్జెట్ నేరుగా కౌన్సిల్ సమావేశంలోనే ఆమోదం పొందేందుకు అనుమతించాల్సిందిగా సీఎంను కలిసిన మేయర్ విన్నవించడం.. అందుకు సీఎం సానుకూలంగా స్పందించడంతో ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకేరోజు ఉదయం బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం, దాని తర్వాత సాధారణ సమావేశం నిర్వహించాలని భావించారు. ఫలానా తేదీన సమావేశం నిర్వహిస్తున్నామని హైకోర్టుకు వివరణ ఇవ్వనున్నారు.

కుదరని సయోధ్య?

మేయర్, కమిషనర్ల మధ్య ఇంకా సఖ్యత కుదరలేదని సమాచారం. సీఎం ఆదేశాల నేపథ్యంలో కాబోలు.. బడ్జెట్ సమావేశ నిర్వహణకు ఓకే అన్న కమిషనర్.. సాధారణ కౌన్సిల్ సమావేశ నిర్వహణకు ఇంకా సుముఖంగా లేనట్లు తెలిసింది.

రెండు మూడు రోజులు నిర్వహించాలి

- ఎంతోకాలం తర్వాత జరిగే సమావేశంలో సభ్యులందరికీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని అఖిలపక్ష సమావేశంలో సభ్యులు కోరారు. అవసరమైతే అసెంబ్లీ తరహాలో రెండుమూడు రోజుల పాటు సమావేశాలు కొనసాగించాలనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇతరత్రా ప్రభుత్వ విభాగాలైన వాటర్‌బోర్డు తదితరాలు, జీహెచ్ఎంసీకి మధ్య సంబంధం లేకుండా ఉండటం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటి మధ్య అనుసంధానం ఉండేలా ఒక తీర్మానం చేయాలని సభ్యులు సూచించారు. అలాగే మరికొన్ని అంశాలపై తీర్మానాలు చేయాలని చెప్పారు.
- జీహెచ్ఎంసీలో డిప్యుటేషన్లపై కొనసాగుతున్న వారిని పంపించడం, పండుగల సందర్భంగా చేసే ఏర్పాట్లకు నిధుల మంజూరు తదితరాలు వాటిలో ఉన్నాయి. పారిశుద్ధ్యం, దోమల తీవ్రత, కుక్కకాట్లు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై సమావేశంలో చర్చించాలని భావించారు. అఖిలపక్ష సమావేశానికి బీఆర్ఎస్ నుంచి డిప్యూటీ మేయర్ శ్రీలత, సామల హేమ, బి.గీతాప్రవీణ్, సతీష్, సింధురెడ్డి, బీజేపీ నుంచి శ్రవణ్, వంగ మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి రజితా పరమేశ్వర్‌రెడ్డి, విజయారెడ్డి, సీఎస్ రెడ్డి, ఎంఐఎం నుంచి మీర్జా ముస్తఫాబేగ్, సయ్యద్ మినాజుద్దీన్ తదితరులు హాజరయ్యారు.







దేవుడా.. దారి చూపించు!

- తొలగింపులో అడుగడుగునా అడ్డంకులే
- ఏళ్లుగా ప్రపోజల్స్‌తోనే బల్దియా కాలక్షేపం
- అన్ని వర్గాలు కలిస్తేనే ఆశించిన ఫలితాలు

ట్రాఫిక్ HOT టాపిక్-2

నగరంలో నడిరోడ్లపై ప్రార్థన స్థలాలు

బహిరంగ ప్రదేశాల్లో అనధికారికంగా కొనసాగుతున్న ప్రార్థన మందిరాలను తొలగించడమో.. మరో ప్రదేశానికి తరలించడమో చేయాలి. ఈ తరహా ఒక్క ప్రార్థన స్థలం కూడా లేని అరుణాచల్ ప్రదేశ్ 'నాగరిక రాష్ట్రం'.



– దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు కొన్నాళ్ల క్రితం చేసిన వ్యాఖ్యలివి.

- నగరంలోని ప్రధాన రహదారులకు మధ్యలో ప్రార్థన స్థలాలు ఉండటం కూడా తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతోంది. వీటిపై అన్ని కోణాల్లో సమగ్ర అధ్యయనం చేసి నిర్దిష్ట విధానాన్ని రూపొందించాలి.
- గత నెల 11న ఐసీసీసీలో జరిగిన ట్రాఫిక్ ఫరిస్తేల సన్మాన కార్యక్రమంలో నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి చెప్పిన మాటలివి.

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లోని మూడు కమిషనరేట్ల పరిధిలో ఉన్న ఈ తరహా ప్రార్థన స్థలాలు అడుగడుగునా ట్రాఫిక్ అడ్డంకులను సృష్టిస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి గతంలో అనేక ప్రయత్నాలు జరిగినా... ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో ఫలితాలు సాధించలేదు. నగరంలో ఈ తరహా ప్రార్థన స్థలాలు 253 ఉన్నాయి. వీటికి తోడు మరికొన్ని ప్రాంతాల్లో శ్మశాన వాటికలూ అడ్డంకులుగా మారాయి.

అత్యధికంగా ఫలక్‌నుమాలో..

నగరంలో ఉన్న 253 'అక్రమ' ప్రార్థన స్థలాల్లో అత్యధికంగా ఫలక్‌నుమాలోనే ఉన్నాయి. ఇక్కడ గరిష్ఠంగా 43 ఉండటం గమనార్హం. ఇవి అనేక రకాలుగా ట్రాఫిక్ ఇబ్బందులను కలిగిస్తున్నాయి. అతి తక్కువగా ఉన్నది చార్మినార్ పోలీసుస్టేషన్ పరిధిలో. ఇక్కడ కేవలం ఒకే ప్రార్థన మందిరం ఇబ్బందికరంగా ఉంది. ఒకప్పుడు ఫలక్‌నుమా నగరానికి దూరంగా ఉండటం, ఇప్పుడది అంతర్భాగం కావడంతో అక్కడ ఈ పరిస్థితులు ఉన్నాయన్నది అధికారుల మాట.

తొలగింపు ప్రహసనమే..

అనేక సందర్భాల్లో ట్రాఫిక్ నరకానికి కారణమవుతున్న ఈ అనధికారిక ప్రార్థన మందిరాల తొలగింపు పెద్ద ప్రహసనంగా మారిపోయింది. నగరంలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఇది అత్యంత సున్నితమైన అంశంగా పరిగణించాల్సింది. 2009లో కోఠిలోని ఉమెన్స్ కాలేజీ బస్టాప్ వద్ద ఉన్న ఓ ప్రార్థన స్థలాన్ని జీహెచ్ఎంసీ అధికారులు 'తాకడం'తో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు ఆరు గంటల పాటు ఆ ప్రాంతం రణరంగంగా మారిపోయింది. మరికొన్ని ప్రాంతాల్లోని వాటి జోలికి వెళ్లినప్పుడూ ఇలాంటి పరిస్థితులే ఎదురయ్యాయి. ఫలితంగా వీటి విషయంపై మాట్లాడటానికే సంబంధిత అధికారులు పలుమార్లు ఆలోచించాల్సి వస్తోంది.

అంతా కలిసి ముందువెళితేనే...

ఏళ్లుగా వేధిస్తున్న ఈ సమస్యను పరిష్కరించి, అరుణాచల్‌ప్రదేశ్ తరహాలో భాగ్యనగరాన్నీ నాగరిక నగరం అంటూ అత్యున్నత న్యాయస్థానం కితాబు పొందాలంటే అన్ని వర్గాలు, శాఖల అధికారులు కలిసి ముందుకు పోవాల్సిన అవసరం ఉంది. నగరంలోని మూసారాంబాగ్, ఐఎస్ సదన్ తదితర ప్రాంతాల్లో ఒకటి కంటే ఎక్కువ వర్గాలకు చెందిన ప్రార్థనా స్థలాలు ఒకే చోట ఉన్నాయి. వీటి విషయం వచ్చేసరికి తరచూ ఎదురవుతున్న మాట 'ముందు వారిది తొలగించండి'. ఈ కారణంతోనే ఏళ్లుగా సమస్యలు అలాగే నిలిచిపోయి ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. సాధారణ సమయాల్లో కంటే సంబంధిత పర్వదినాలప్పుడు ఈ ఇబ్బందులు మరింత ఎక్కువ అవుతున్నాయి. ప్రభుత్వ శాఖలు సైతం వీటి విషయంలో ఎవరికి వారే అన్నట్లు ముందుకుపోకుండా అన్నీ కలిసి సమష్టి నిర్ణయం, ప్రణాళికతో వ్యవహరించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

'గ్రీన్ మాస్క్' వద్ద విజయవంతం..

బంజారాహిల్స్ రోడ్ నెం.3లో ఉన్న గ్రీన్ మాస్క్ ప్రహరీ గోడ విషయంలో పోలీసులు, దాని నిర్వాహకులు, మత పెద్దలు తీసుకున్న చర్యలు ఆదర్శప్రాయమని అధికారులు చెబుతున్నారు. ఏళ్లుగా ఈ ప్రార్థన మందిరం ఇక్కడే ఉన్నప్పటికీ.. ఈ మార్గం రద్దీగా మారడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. భారీ ట్రాఫిక్ జాంలతో పాటు ఎన్ఎఫ్‌సీ చౌరస్తా, జీవీకే మాల్ వరకు వాహనాలు ఆగిపోయేవి. దీంతో చొరవ తీసుకున్న ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులు మత పెద్దలతో చర్చించారు. ఫలితంగా రహదారిపైకి ఉన్న ప్రహరీ గోడలో కొంత భాగం తొలగించడంతో వాహన చోదకులకు భారీ ఊరట లభించింది. ఇదే విధానాన్ని మిగిలిన ప్రార్థన స్థలాల విషయంలో అవలంబించాల్సిన అవసరం ఉంది. ట్రాఫిక్ చిక్కులకు మోక్షం కలిగించాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉంది.



ఉమ్మడి కమిటీలు ఏర్పాటు చేయాలి: నిపుణులు

ఈ సమస్యను పరిష్కరించాలంటే పీస్ కమిటీల మాదిరి ఉమ్మడి కమిటీలను ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రాంతాల వారీగా సాధారణ పౌరులు, అధికారుల, భిన్న వర్గాలకు చెందిన పెద్దలు, వ్యాపార యూనియన్ లీడర్లతో వీటిని ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు. అంతా కలిసి సమావేశాలు ఏర్పాటు చేసుకుని సదరు ప్రార్థన స్థలం కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలను క్షేత్రస్థాయిలో చర్చించాలని, పూర్తిగా తొలగించే విషయం కాకపోయినా కనీసం ఇబ్బందులు లేని స్థానాలకు వీటిని మార్చడానికి అందరినీ ఒప్పించాలని వివరిస్తున్నారు. ఎలాంటి వివాదం లేని ప్రత్యామ్నాయ స్థలాలను చూపడానికి జీహెచ్ఎంసీ, రెవెన్యూ విభాగాలు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని చెబుతున్నారు.

ఓఆర్ఆర్‌పై ఘోర ప్రమాదం

ఇద్దరి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- కారు అతివేగమే కారణం



రెడ్డప్ప రెడ్డి (ఫైల్)



రెడ్డి గణేశ్



ప్రమాద స్థలి

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పరిధిలోని ఓఆర్ఆర్‌పై అతివేగంతో వచ్చిన కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎదురు లైన్‌లో వస్తున్న మరో కారును ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మేడ్చల్ ఎస్ఐ నవీన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వనస్థలిపురంనకు చెందిన రెడ్డప్ప రెడ్డి (50) ఉద్యోగ నిమిత్తం సోమవారం ఉదయం 10 గంటలకు ఇంటినుంచి తన ఇన్నోవా కారులో బయలుదేరి బాచుపల్లిలో విధులు ముగించుకుని రాత్రి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలోని మేడ్చల్ ఎగ్జిట్ నెంబర్–6 సమీపంలోకి చేరుకున్నాడు. ఇదే సమయంలో ఎదురు లైన్‌లో వేగంగా వస్తున్న ఎక్స్‌యూవీ కారు అతివేగంతో వచ్చి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎదురులైన్‌లోకి దూసుకొచ్చి రెడ్డప్ప రెడ్డి ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. రెండు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. విషయం తెలుసుకున్న మేడ్చల్ సీఐ నర్సింహారెడ్డి, ఎస్ఐ నవీన్‌రెడ్డి ఘటన స్థలికి చేరుకుని క్షతగాత్రులను కార్లలోంచి బయటికి తీశారు. ఇన్నోవా కారులో ప్రయాణిస్తున్న రెడ్డప్ప రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎక్స్‌యూవీ కారులో ఉన్న జగద్గిరిగుట్టకు చెందిన ముగ్గురిలో బీటెక్ విద్యార్థి రెడ్డి గణేశ్ (18) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మరో ఇద్దరు విద్యార్థులు మోక్షిత్‌రెడ్డి, మంగలపు గణేశ్‌లు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

ఏసీబీ హడల్

హెచ్ఎండీఏలో రెండో రోజూ ఫైళ్ల తనిఖీలు

- హైరైజ్ భవనాల అనుమతులు, భారీ లేఅవుట్‌లపై ఫోకస్
- వివిధ జోన్‌ల అధికారులపై ప్రశ్నల వర్షం
- శివబాలకృష్ణ అనుయాయులపై ప్రధాన దృష్టి



సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏలో రెండో రోజూ ఏసీబీ దాడులు హడలెత్తించాయి. అమీర్‌పేట్‌లోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లో ఉన్న హెచ్ఎండీఏ కార్యాలయానికి మంగళవారం ఉదయమే చేరుకున్న ఏసీబీ అధికారులు వివిధ జోన్‌లకు చెందిన ఫైళ్లను తెప్పించుకొని తనిఖీ చేశారు. హెచ్ఎండీఏ కార్యాలయంలోని ఏడో అంతస్తులో ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలను కొనసాగించారు. ఫైళ్లను పరిశీలించే క్రమంలో హెచ్ఎండీఏలోని ఘట్‌కేసర్, శంషాబాద్, శంకర్‌పల్లి జోన్‌లకు చెందిన ప్లానింగ్ అధికారులు, ఏపీఓలను తమ వద్దకు రప్పించుకొని పలు అనుమతులపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. ముఖ్యంగా 2018 నుంచి 2023 వరకు పని చేసిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ హయాంలో ఇచ్చిన హైరైజ్ భవనాల అనుమతులపై ఏసీబీ అధికారులు ప్రధానంగా దృష్టి సారించినట్లు సమాచారం.

ఆ జోన్‌ల ఫైళ్లపైనే నజర్..

- వివిధ జోన్‌లలో భారీ లేఅవుట్‌లకు అనుమతులివ్వడంలో చోటుచేసుకున్న అవకతవకలపైనా ఏసీబీ ఫోకస్ పెట్టింది. మరోవైపు ఏసీబీ సోదాల నేపథ్యంలో హెచ్ఎండీఏ అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగో అంతస్తు నుంచి ఏడో అంతస్తుకు ఉరుకులు పరుగులు పెట్టారు. ఒకవైపు ఏసీబీ అధికారులు అడిగిన సమాచారాన్ని, ఫైళ్లను అందజేయడంతో పాటు సందేహాలను నివృత్తి చేసేందుకు ప్లానింగ్ అధికారులు పరుగులు పెట్టారు. మొదటి రోజు సుమారు 26 మంది ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా, మంగళవారం రెండో రోజు 10 మందికి పైగా అధికారులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు శంషాబాద్, శంకర్‌పల్లి, ఘట్‌కేసర్ జోన్‌లకు సంబంధించిన ఫైళ్లనే తనిఖీ చేశారు. శివబాలకృష్ణ హయాంలో ఇచ్చిన అక్రమ అనుమతులపై ముందస్తు సమాచారాన్ని సేకరించిన ఏసీబీ అధికారులు...ఆ సమాచారానికి సంబంధించిన వివరాలను మరింత లోతుగా సేకరించేందుకే ఫైళ్లను తనిఖీ చేసినట్లు తెలిసింది. ఏసీబీ దాడులు కొనసాగిన సమయంలో బయటివారు ఏడో అంతస్తులోకి రాకుండా తలుపులు మూసివేశారు.

బడా సంస్థల అనుమతులే టార్గెట్..

- నిర్మాణరంగంలో బడా సంస్థలుగా కొనసాగుతున్న కొన్నింటికి శివబాలకృష్ణ అడ్డగోలుగా అనుమతులను ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా హైరైజ్ భవనాలకు అనుమతులనిచ్చే క్రమంలో కమిటీ సమావేశాలను ఏర్పాటు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులను ఇచ్చారు. ఈ క్రమంలో మాస్టర్‌ప్లాన్ నిబంధనలను కూడా తుంగలో తొక్కినట్లు ఆరోపణలు ఉన్నాయి. అడ్డగోలు అనుమతులను ఇవ్వడంలో ప్రస్తుతం సెలవులో ఉన్న ఒక ఏపీఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ గుర్తించింది. మరో ఇద్దరు ప్లానింగ్ అధికారులు కూడా శివ బాలకృష్ణకు అన్ని విధాలా అనుకూలంగా ఉండి అక్రమ అనుమతుల్లో ప్రధాన భాగస్వాములుగా నిలిచినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.
- తాజా సోదాల్లో ఈ మూడు జోన్‌లకు సంబంధించిన ఫైళ్లనే ప్రధానంగా విచారిస్తున్నారు. హైదరాబాద్ గ్రోత్‌కారిడార్ ప్రాంతంలో పెద్ద ఎత్తున బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. కొన్ని చోట్ల సమాంతర రోడ్ల కోసం కేటాయించిన భూములను ఆక్రమించుకోగా.. మరికొన్ని చోట్ల కన్జర్వేషన్ జోన్‌లలో ఉన్న భూములకు సైతం ఇష్టారాజ్యంగా అనుమతులను ఇచ్చినట్లు సమాచారం. తెల్లాపూర్, అమీన్‌పూర్ తదితర ప్రాంతాల్లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలను సైతం పక్కన పెట్టి చెరువుల్లో భారీ కట్టడాలకు అనుమతులనిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.
- శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో పార్కులు, ఎమ్యూనిటీస్ కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమించి భవనాలను నిర్మించేందుకు అప్పట్లో హెచ్ఎండీఏ అనుమతులను ఇచ్చిందని బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు శివ బాలకృష్ణను తమ కస్టడీలోకి తీసుకొని విచారణ చేస్తున్న అధికారులు, మరోవైపు ఏసీబీ కార్యాలయానికి వచ్చే బాధితుల నుంచి కూడా ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ఇలా శివబాలకృష్ణ నుంచి సేకరించిన వివరాలు, బాధితుల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని అందుకు సంబంధించిన ఫైళ్లపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిసింది. బుధవారం కూడా సోదాలు కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అంతా టెన్షన్.. టెన్షన్..

మంగళవారం సాయంత్రం వరకు ఫైళ్లను పరిశీలించిన ఏసీబీ అధికారులు కొన్నింటిని తమతో పాటు తీసుకెళ్లినట్లు తెలిసింది. కొన్ని బడా సంస్థలకు చెందిన అనుమతులపైనే అధికారులు ప్రధానంగా దృష్టి సారించి తమ సోదాలు కొనసాగించారు. దీంతో శివబాలకృష్ణ ఆదేశాల మేరకు అప్పట్లో ఆయా బడా సంస్థలకు అన్ని విధాలుగా వ్యవహరించిన అధికారులు ఇప్పుడు సందిగ్ధంలో పడ్డారు. ఆ ఫైళ్లు, ఆ అనుమతులు తమ మెడకు చుట్టుకుంటాయేమోననే భయాందోళనకు గురవుతున్నారు. శివబాలకృష్ణకు ప్రధాన అనుచరుడిగా వ్యవహరించిన ఒక ఏపీఓ ఇప్పటికే సెలవులో వెళ్లిపోవడం ఏసీబీ వర్గాల్లోనూ చర్చనీయాంశమైంది.

ఘనంగా తెలంగాణ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం


షబ్బీర్ అహ్మద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం కోఠిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఖైరతాబాద్ డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాబర్ట్ బ్రూస్, జె.అశోక్ తదితరులు యూనియన్ వ్యవస్థాపకులు షబ్బీర్ అహ్మద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందన్నారు. ఉద్యోగుల సమస్యల కోసం సంఘం వ్యవస్థాపకులు షబ్బీర్ అహ్మద్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అఖిల్ రజ్వి, శ్రీనివాస్, మహ్మద్ ఫారూఖ్, హన్మంతరావు, రాఘవేందర్, అబ్బాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 142 రద్దు చేయాలి


నోడల్ అధికారికి సమస్యను వివరిస్తున్న స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు

లక్డీకాపూల్ : ప్రాథమిక ఆరోగ్య రంగాన్ని పటిష్టం చేసే క్రమంలో మానవ వనరులను హేతుబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం విడుదల చేసిన లోప భూయిష్టమైన 142 జీవోను రద్దు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఈ మేరకు ప్రజావాణిలో నోడల్ అధికారిణి దివ్య దేవరాజన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద జీవో 142 రద్దు స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు బానోతు నెహ్రూచంద్, కె.యాద నాయక్, కొప్పు ప్రసాద్,టి.మాధవ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, పసియుద్దిన్ మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య రంగానికి గొడ్డలి పెట్టు లాంటి జీఓ 142 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని యూనియన్లు క్యాడర్ అసోసియేషన్లు గత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. అయితే ఇటీవల కొందరు అధికారులు మళ్లీ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి ఈ జీఓ అమలుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మానవ వనరుల హేతుబద్ధీకరణ జనాభా ప్రాతిపదికన, ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించే దిశగా జరగాలన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో అనుభవం కలిగిన ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి సమాచారాన్ని, సలహాలు సూచనలు తీసుకోకుండా తమ ఇష్టానుసారంగా జీఓను విడుదల చేయడం దారుణమన్నారు. ఈ జీఓ ద్వారా సివిల్ సర్జన్ స్పెషలిస్టు పోస్టులను సూపర్ న్యూమరీగా పేర్కొంటూ స్పెషాలిటీ డాక్టర్లను సీనియార్టీతో సంబంధం లేకుండా జిల్లాలకు డిఎంహెచ్వోలుగా ఏడిపిఏహెచ్ఓ గా నియమించడం సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకమన్నారు. దీనిపై ప్రజావాణి నోడల్ అధికారి స్పందిస్తూ ఆరోగ్యశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

అమెరికాలో నగరవాసిపై దుండగుల దాడి


దాడిలో గాయపడ్డ సయ్యద్

లంగర్‌హౌస్: ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లిన వ్యక్తిపై చికాగో నగరంలో కొందరు వ్యక్తులు దాడి చేసి మొబైల్ ఫోన్, డబ్బులు లాక్కెళ్లారు. వివరాల్లోకి వెళితే.... లంగర్‌హౌస్ హాషం నగర్‌కు చెందిన సయ్యద్ మజాహిర్ అలీ చికాగోలో క్యాంప్‌బెల్ ఏవ్‌లో ఉంటూ వెస్లీ యూనివర్సిటీలో ఎంఎస్ చేస్తున్నాడు.ఈ నెల 4న రాత్రి అతను ఇంట్లోకి వెళుతుండగా అదే సమయంలో తుపాకులతో అపార్టుమెంట్ వద్దకు వచ్చిన నలుగురు దుండగులు అతడిపై దాడి చేసి అతని వద్ద ఉన్న మొబైల్ ఫోన్, నగదు లాక్కుని పారిపోయారు. దీనిపై సమాచారం అందడంతో అతడి భార్య కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌ను కలిసి ఈ విషయమై కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జయశంకర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరింది. తన భర్తకు వైద్యం చేయించి తక్షణ వీసా ఇప్పించి దేశానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. ఆమె భర్తకు సంబంధించిన పూర్తి వివరాలను మంత్రికి మెయిల్ ద్వారా తెలియజేసింది.

అనాథ పిల్లలను అక్కున చేర్చుకోవాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతను అలవర్చుకుని అనాథ పిల్లలను అక్కున చేర్చుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రభుత్వ చిల్డ్రన్ ఆఫ్ చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పెద్దల సంరక్షణ కరువైన, అనాథ, ప్రైవేటు చిల్డ్రన్స్ హోమ్స్‌లో ఉంటున్న పిల్లలకు బర్త్, క్యాస్ట్, సదరం, ఆధార్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లలకు ప్రభుత్వం తరఫున శిశు విహార్ రక్షణగా నిలబడుతుందన్నారు. విద్యా, ఉపాధితో పాటు సమాజంలో గుర్తింపు లేని వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందస్తుందన్నారు. 50 కేంద్రాల్లో 2003 మంది విద్యార్థులు ఉన్నారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనాథలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ఎక్కడైనా అనాథలను గుర్తిస్తే స్త్రీ శిశు సంక్షేమ శాఖ చైల్డ్ కేర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ శైలజ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ అక్కేశ్వర్‌రావు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్, బాలా రక్ష భవన్ కోఆర్డినేటర్ సుమలత, తహసీల్దార్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అవార్డు బాధ్యత పెంచింది

సాక్షి, సిటీబ్యూరో: గత 14 ఏళ్లుగా మల్లారెడ్డి గ్రూప్స్‌కు చెందిన రెండు ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించడం తమ భాగ్యంగా భావిస్తున్నామని మల్లారెడ్డి యూనివర్శిటీ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్ ప్రీతిరెడ్డి తెలిపారు. ముంబై వేదికగా అందించే ప్రతిష్టాత్మక 'చాంపియన్స్ ఆఫ్ చేంజ్-2024' అవార్డును అందుకున్న సందర్భంగా మంగళవారం బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్ డక్కన్ వేదికగా మల్లారెడ్డి హెల్త్‌సిటీ ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రీతిరెడ్డి మాట్లాడుతూ చిన్న వయసులోనే విద్య-వైద్యం విభాగంలో ఈ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ అవార్డు తన బాధ్యతలను మరింత పెంచిందన్నారు. ఈ సందర్భంగా విద్య, సామాజిక రంగాలకు చెందిన పలువురిని ఆమె ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డా.సుధా రమణ, డా.సిద్ధప్పరావు తదితరులు పాల్గొన్నారు.


మీట్ ద గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ప్రీతిరెడ్డి, యూనివర్సిటీ అధ్యాపకులు, ఉద్యోగులు

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రెడ్డి సంఘం తెలంగాణ గౌరవ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి సంఘం తెలంగాణ నేతలు

బంజారాహిల్స్: రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని రెడ్డి సంఘం తెలంగాణ గౌరవ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో విలేకరులతో మాట్లాడుతూ గత పదేళ్లుగా రాష్ట్రంలో రెడ్లు తీవ్ర వివక్షకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నికల మేనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్‌తో పాటు పేద రెడ్డి విద్యార్థులకు విదేశీ విద్యను అందించేందుకు కృషి చేస్తామని, రెడ్డి భవన్ నిర్మిస్తామని ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. రెడ్ల సమస్యలు చెప్పుకునేందుకు ఎన్నోసార్లు అపాయింట్‌మెంట్ అడిగినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్లలో ఎంతోమంది పేదలు ఉన్నారని వారిని ఆదుకోవాలనేదే తమ ధ్యేయమన్నారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుతో పేద రెడ్లకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల సంజీవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ళ హరినాథ్‌రెడ్డి, సుమతిరెడ్డి, వసంతరెడ్డి, శ్రీపతిరెడ్డి, శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి


ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

దూద్‌బౌలి: కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం పురానాపూల్ గొల్లకిడికిలోని బీజేపీ సీనియర్ నాయకులు సి.అశోక్ కుమార్ యాదవ్ ఇంటికి వచ్చిన ఆయనకు స్థానిక బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అశోక్ కుమార్ యాదవ్‌ను యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్న అనంతరం పార్టీ అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ..దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు బీజేపీని అభిమానిస్తున్నారని..రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని, దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పురానాపూల్ మజ్లిస్ పార్టీ కార్పొరేటర్ సున్నం రాజ్ మోహన్, మాజీ కార్పొరేటర్ మహ్మద్ గౌస్,ప్రకాష్ యాదవ్,మక్కర్‌యాదవ్,శివానంద్ యాదవ్ పాల్గొన్నారు.

మజ్లిస్ ప్రజా ప్రతినిధుల స్వాగతం

చార్మినార్: పాతబస్తీకి వచ్చిన త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్ర సేనారెడ్డిని పురానాపూల్ డివిజన్ మజ్లిస్ పార్టీ కార్పొరేటర్ సున్నం రాజ్ మోహన్ తో పాటు మాజీ కార్పొరేటర్ మహమ్మద్ గౌస్, పార్టీ నాయకులు రాజేశ్వర్ వర్మ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

ఫ్లై ఓవర్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తదితరులు

బహదూర్‌పురా: జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు కొనసాగుతున్న ఫ్లై ఓవర్ పనులను జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, ఎమ్మెల్యే ముబీన్, ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాటిల్ నెక్ కారణంగా రాకపోకలు నెమ్మదిగా సాగుతున్నట్లు గుర్తించిన కమిషనర్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి వాహనాలు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇందిరానగర్, హసన్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముబీన్, ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ భారీ వర్షాల సమయంలో ముంపు ప్రాంతాలు, జీహెచ్ఎంసీ నీటి పారుదల విభాగం చేపట్టిన పనులను చూపించారు. కార్యక్రమంలో సీపీపీ రాజేంద్ర ప్రసాద్, జోనల్ కమిషనర్ వెంకన్న, చీఫ్ ఇంజినీర్ దేవానంద్, డిప్యూటీ కమిషనర్ రవి కుమార్, ఎస్ఈ ప్రాజెక్టు దత్తు పంతు, హెల్త్, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కాళోజీ హెల్త్‌వర్సిటీ ఈసీ మెంబర్‌గా ప్రొఫెసర్ రాజారావు


రాజారావును సన్మానిస్తున్న టీజీజీడీఏ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి : కాళోజీ నారాయణ రావు హెల్త్‌సైన్స్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్యరంగంలో అత్యంత ప్రతిభావంతులు, విద్యావేత్తలైన ముగ్గురిని ఈసీ సభ్యులుగా నియమించగా, అందులో ప్రొఫెసర్ రాజారావు ఒకరు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) గాంధీ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజారావుకు పుష్పగుచ్ఛం అందించి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ప్రొఫెసర్ రాజారావు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీజీజీడీఏ గాంధీ యూనిట్ ప్రతినిధులు భూపేంద్ర రాథోడ్, రవి, మురళీధర్, అబ్బయ్య, దేవోజీ, ఆర్ఎంఓ-1 జయకృష్ణ, లేడీ ఆర్ఎంఓ పద్మ పాల్గొన్నారు.

హైదరాబాద్ సౌత్ డీఆర్ సస్పెన్షన్


సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు శంకర్‌పల్లి పరిధిలోని ఒక భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ సౌత్ జిల్లా రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మంగళవారం రిజిస్ట్రేషన్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్‌కాగా, తాజాగా భూముల కొనుగోలు వ్యవహారంలో హైదరాబాద్ సౌత్ డీఆర్ పాత్ర విచారణలో బయటపడింది. కొనుగోలుదారుల్లో ఒకరు హైదరాబాద్ డీఆర్ భార్యేనని నిర్ధారణ కావడంతో రిజిస్ట్రేషన్ శాఖ ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

కన్సల్టెన్సీ కార్యాలయంలో రూ.కోటి స్వాధీనం

అమీర్‌పేట: అనధికారికంగా నగదు లావాదేవీలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో అమీర్‌పేటలోని ఓ కన్సల్టెన్సీ కార్యాలయంపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు దాడి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు.ఇన్‌స్పెక్టర్ సతీష్ కథనం మేరకు.. అమీర్‌పేట ధరం కరం రోడ్డులోని అతిథి ఇన్ హోటల్ ఎదురుగా ఉన్న ఎమినెంట్ కన్సల్టెంట్ కార్యాలయంలో పెద్ద ఎత్తున నగదు లావాదేవీలు జరుగుతున్నాయనే సమాచారం అందింది. దీంతో దాడి చేసిన పోలీసులు సిద్దిపేట జిల్లా, ములుగు మండలం,కొత్తూరుకు చెందిన జి.గోవర్దన్ రూ.కోటి నగదును కార్యాలయంలో ఉన్న వ్యక్తులను అందజేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. గోవర్ధన్‌తో పాటు వీరన్న, సుదర్శన్, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సర్ది చెప్పేందుకు వెళ్తే..

- అన్న దమ్ముల మధ్య ఘర్షణ
- నచ్చజెప్పేందుకు యత్నించిన యువకుడి హత్య


ప్రవీణ్ మోజెస్ మృతదేహం

వెంగళరావునగర్: బూట్లు విప్పమని చెప్పినందుకు అన్నదమ్ముల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ మరో యువకుడి హత్యకు దారి తీసిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజాంపేటకు చెందిన మార్త కుమారుడు ఎస్. ప్రవీణ్ మోజెస్(20) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం వరుసకు అమ్మమ్మ అయిన రాణి ఇంటికి వెళ్లి సెల్‌ఫోన్ రిపేర్ చేయాలని ఆమె కుమారుడు అభిలాష్ అలెక్స్‌ను అడిగాడు. దీంతో ఇద్దరూ కలిసి ఫోన్‌కు సంబంధించిన మెటీరియల్ కొనుగోలు చేసి రాత్రి ఇంటికి తిరిగి వచ్చారు. అయితే అదే సమయంలో అభిలాష్ సోదరుడు అభిషేక్ అలెక్స్ మద్యం మత్తులో బూట్లు విప్పకుండా నిద్రపోతుండటాన్ని గుర్తించిన అభిలాష్ బూట్లు విప్పి పడుకోవాలని అభిషేక్‌కు చెప్పాడు. దీంతో అన్నదమ్ములిద్దరి మధ్య గొడవ జరిగింది. చిన్న విషయానికి గొడవ ఎందుకు పడుతున్నారని వారికి అల్లుడి వరుసైన ప్రవీణ్ మోజెస్ సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా కోపంతో ఉన్న అభిషేక్ అలెక్స్ కత్తితో ప్రవీణ్ మోజెస్ గుండెల్లో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన అతడిని బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బల్దియా ఆరోగ్య విభాగంలో అక్రమాలపై విచారణ

సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య-ఆరోగ్యం విభాగంలో జరిగిన అక్రమాలు, అందిన ఫిర్యాదులపై కమిషనర్ రోనాల్డ్‌రాస్ విచారణ చేపట్టారు. మంగళవారం బుద్ధభవన్‌లోని ఈవీడీఎం కార్యాలయంలో ఆయన విచారణ నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికుల వారసుల నియామకాల్లో భారీగా ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలతోపాటు పలు ఫిర్యాదులు అందాయి. బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ మొదలు, హోటళ్ల నుంచి వసూళ్లు , శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి లంచాలు, తదితర ఫిర్యాదులపై విచారణ చేపట్టినట్లు తెలిసింది.

గోడను ఢీకొన్న బైక్- ఒకరి మృతి


అర్షద్ (ఫైల్)

బంజారాహిల్స్: ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి రోడ్డుపక్కన ఉన్న సరిహద్దు గోడను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..షేక్‌పేట గుల్షన్‌కాలనీకి చెందిన వ్యాపారి మొహమ్మద్ అర్షద్ (22) మంగళవారం ఉదయం హోండా యాక్టివా వాహనంపై వెళ్తున్నాడు. టోలిచౌకీ సమీపంలోకి రాగానే షేక్‌పేట నాలా నుంచి 7 టూంబ్స్ మెయిన్‌రోడ్డు వరకు ఉన్న శ్మశానవాటిక సరిహద్దు గోడను బలంగా ఢీకొట్టాడు. ఆ సమయంలో అర్షద్ హెల్మెట్ ధరించలేదు. తీవ్రంగా గాయపడిన అర్షద్‌ను మెహిదీపట్నంలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలి'

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల ఫోరమ్ చైర్మన్ కె.బాలక్రిష్ణ డీజీపీకి ఫిర్యాదు చేశారు. ప్రజల విశ్వాసాన్ని పొందిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కేసీఆర్ మెప్పు కోసం అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. బాల్కస్ సుమన్ వైఖరి దళిత సమాజం సిగ్గుపడేలా ఉందని, ఆయనను దళిత జాతి నుంచి వెలి వేయాలన్నారు.

చిట్టీల పేరుతో టోకరా

ఇద్దరు నిందితుల అరెస్ట్, పరారీలో మరొకరు

మాదాపూర్: చిట్టీల పేరుతో భారీ మోసాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లాకు చెందిన శ్రీనివాస్, రాకేశ్ వర్మ, గణేశ్ ఉప్పల్, ఈశ్వర్‌హైట్స్‌లో నివాసంఉంటున్నారు. వీరు సమతామూర్తి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మాదాపూర్‌లోని మెట్రో పిల్లర్ నెం.1720, వద్ద ఆరు నెలల క్రితం కార్యాలయాన్ని ప్రారంభించారు. రూ. లక్ష నుంచి రూ.కోటి వరకు చిట్టీలు వేస్తున్నారు. అధిక లాభాలు ఇస్తామని ప్రచారం చేసుకుని పలువురి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. అయితే గత కొన్నాళ్లుగా చిట్టీ పాడిన వారికి డబ్బులు చెల్లించకపోవడంతో కొందరు కార్యాలయానికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. దీంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం నిందితులు రాకేశ్‌వర్మ, గణేశ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరు 20 మంది నుంచి దాదాపు రూ.2 కోట్లకు పైగా వసూలు చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న శ్రీనివాస్ కోసం గాలిస్తున్నామన్నారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి మహిళ ఆత్మహత్య


అయేషా సిద్దిఖీ మృతదేహం

రహమత్‌నగర్: కుటుంబ కలహాలతో మనస్తాపానికిలోనైన ఓ మహిళ భవనం పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బోరబండ పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంగళరావునగర్ కాలనీకి చెందిన అయిషా సిద్దిఖీ (35) గత నాలుగు రోజులుగా అదే కాలనీలోని సౌభాగ్య రెసిడెన్సీలో ఉంటున్న తన పరిచయస్తుల ఇంట్లో ఉంటోంది. మంగళవారం ఉదయం ఆమె అదే భవనం మూడో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. స్థానికులు ఆమెను యశోద ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బోరబండ పోలీసులకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఇటీవల ఆమె భర్త సింగపూర్ వెళ్లిపోవడంతో సిద్దిఖీ తన పరిచయస్తుల ఇంట్లో ఆశ్రయం పొందుతోందని స్థానికులు తెలిపారు.

ట్రేడింగ్ పేరుతో రూ. 35 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: వాట్సాప్, టెలిగ్రామ్,ఫేస్‌బుక్‌లలో స్టాక్ మార్కెట్, ట్రేడింగ్ ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చునని వచ్చే సందేశాలు, లింక్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి అన్నారు. ట్రేడింగ్ ద్వారా ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి కాచిగూడకు చెందిన వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.35 లక్షలు కాజేశారు. ఏసీపీ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆన్‌లైన్ ట్రేడింగ్లో పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని వాట్సప్, టెలిగ్రామ్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు పంపిన మెసేజ్‌కు స్పందించిన కాచిగూడకు చెందిన యువకుడు వారు సూచించినట్లుగా యాప్ (మొబైల్ అప్లికేషన్)ను ఇన్‌స్టాల్ చేసుకుని మొదట కొంత డబ్బు పెట్టుబడి పెట్టాడు. అతడిని నమ్మించేందుకు ఎక్కువ లాభం వచ్చిందని చెప్పి, వాటిని విత్‌డ్రా చేసుకోవాలంటే మరింత డబ్బు పెట్టుబడి పెట్టాలని చెప్పారు. ఇలా విడతల వారీ రూ.35లక్షలు పెట్టుబడి పెట్టించి మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

హాష్ ఆయిల్ తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

రసూల్‌పురా: హాష్ ఆయిల్ తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను బొల్లారం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని వారి నుంచి మూడు లీటర్ల హాష్ ఆయిల్, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిస్సా రాష్ట్రం, మల్కాన్‌గిరి జిల్లా, రాలేగడ గ్రామానికి చెందిన హంతల్ బాలరాజు తన పొలంలో సాగు చేసిన గంజాయి నుంచి హాష్ ఆయిల్ తయారు చేసి విక్ర యించేవాడు. హైదరాబాద్‌లో హాష్ ఆయిల్‌కు డిమాండ్ ఉందని తెలుసుకున్న అతను తన బావ కొర్ర సుఖ్‌దేవ్, సిలేరుకు చెందిన బొమ్మెలి రాంబాబుతో కలిసి సరుకు తీసుకుని ఈ నెల 4న హైదరాబాద్ బయలుదేరారు. చింతూరు, భద్రాచలం, ఖమ్మం. సూర్యాపేట మీదుగా సోమవారం సాయంత్రం బొల్లారం చేరుకున్నారు. బొల్లారంలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులను గుర్తించి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు బైక్‌ను ఆపి తనిఖీ చేయగా హాష్ ఆయిల్ పట్టుబడింది. దీంతో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి హాష్ ఆయిల్, పల్సర్ బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరం

బంజారాహిల్స్: పుట్టుకతో వచ్చే గుండె లోపాల అవగాహన మాసం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్డు నంబర్–1లోని కేర్ ఆస్పత్రిలో నేటి నుంచి ఈనెల 14వ తేదీ వరకు ఉచిత పీడియాట్రిక్ కార్డియక్ స్క్రీనింగ్ శిబిరం జరగనుంది. ఈ విషయాన్ని ఆస్పత్రి వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. పుట్టుకతో వచ్చే గుండె లోపాలను గుర్తించడం కోసం ఈ శిబిరం ఉపయోగపడుతుందన్నారు. పిల్లల్లో శ్వాస సరిగ్గా అందకపోవడం, వేగంగా శ్వాస తీసుకోవడం, ఎదుగుదల సరిగా లేకపోవడం, బరువు పెరగకపోవడం, పెదవులు పాలిపోయినట్టు కనిపించడం తదితర లక్షణాలు ఉంటే పీడియాట్రిక్ కార్డియాలజిస్టును సంప్రదించాలని తెలిపారు. ఈ శిబిరం ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు కొనసాగుతుందన్నారు. చిన్నారులకు టూడీ ఎకో పరీక్షలపై 50 శాతం తగ్గింపు కూడా ఉంటుందన్నారు. అపాయింట్‌మెంట్ కోసం ఫోన్: 94919 59909, 94400 33337లలో సంప్రదించవచ్చు.

ఈ నెల 14 నుంచి హైలైఫ్ ఎగ్జిబిషన్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నటి రాశీసింగ్, ఖుషితా తదదితరులు

బంజారాహిల్స్: ఈ నెల 14, 15, 16 తేదీల్లో హెచ్ఐసీసీ నోవాటెల్‌లో 'హై లైఫ్ లైఫ్‌స్టైల్' ఎగ్జిబిషన్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సన్నాహక కార్యక్రమం మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో జరిగింది. టాలీవుడ్ నటులు రాశీ సింగ్, ఖుషిత కల్లపుతో పాటు పలువురు మోడల్స్ పాల్గొని ఎగ్జిబిషన్‌లో ఉంచే వజ్రాభరణాలు, దుస్తులను ప్రదర్శించారు. అనంతరం ఎగ్జిబిషన్ బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ క్రియేటివ్ ఫ్యాషన్ వేర్‌తో పాటు బ్రైడల్ వేర్, డిజైనర్ వేర్, యాక్ససరీస్, జ్యువెల్లరీ విభిన్న రకాలు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు.

రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి

బంజారాహిల్స్: రౌడీషీటర్లు, సంఘ వ్యతిరేక శక్తులు తమ ప్రవర్తన మార్చుకోకుంటే చర్యలు తప్పవని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం హెచ్చరించారు. హత్యలతో సహా పలు క్రిమినల్ కేసుల్లో ప్రమేయం ఉన్న ఐదుగురు రౌడీషీటర్లను బంజారాహిల్స్ పోలీసులు కమిషనర్ ఎదుట హాజరుపరిచారు. వారికి ఏడాది పాటు సత్ప్రవర్తన కోసం రూ.50,000తో పాటు ఇద్దరు ష్యూరిటీలతో కూడిన సెక్యూరిటీ బాండ్లను సయ్యద్ మజీద్, మొహమ్మద్, నేముతుల్లా, సయ్యద్ ఐజాజ్, సయ్యద్ సాజీద్‌కు అందించారు.

బస్తీ ఎన్నికలకు సన్నాహాలు



సమావేశంలో మాట్లాడుతున్న స్థానికులు

రహమత్‌నగర్: హ బీబ్ ఫాతీమానగర్ ఫేజ్–1బస్తీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈక్రమంలో మంగళవారం స్థానిక కమ్యూనిటీ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించారు. వారం రోజుల్లో మరోసారి సమావేశం నిర్వహించి.. ఎన్నికల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు చాంద్‌పాషా, నాగేశ్, దస్తగిర్, సతీశ్, చెరుపెల్లి సత్యనారాయణ భీంరావు, రాంధారి బాబు, వెంకటేశ్, జాహిర్, హబీబ్, లతీఫ్, ముఖీమ్, సాబేర్, సాదిక్, శేరహన్, శంషాద్దీన్, నాగేశ్ పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



రహమత్‌నగర్: మాజీ ఎంపీ బాల్క సుమన్ దిష్టిబొమ్మను కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి నేతృత్వంలో రహమత్‌నగర్ కూడలిలో మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. బాల్క సుమన్ తన స్థాయిని మరచి సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు మన్సూర్ ఎక్బాల్, నాయకులు తంగలపెల్లి లక్ష్మణ్, షేక్ సాబేర్, అడవయ్య, అనంతయ్య, లింగమూర్తి, సింగారి శ్రీనివాస్, బోడ రవికిరణ్, సంజీవరావు, శాంతకుమార్, ఎండీ గౌస్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో 2,192 అర్జీల స్వీకరణ

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం ప్రజావాణి నోడల్ అధికారిణి దివ్య దేవరాజన్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలపై 2192 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. విధుల్లోంచి తొలగించిన తమకు న్యాయం చేయాలని హైదరాబాద్ సిటీ హోంగార్డులు పలువురు విన్నవించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు అకారణంగా తొలగించిన తమను విధుల్లోకి తీసుకోవాలని హోంగార్డ్స్ ప్రతినిధి చైతన్య కుమార్ వినతిపత్రం అందించారు.

జలమండలి ఉద్యోగుల కేలండర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: జలమండలి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ కేలండర్–2024ను యూనియన్ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఆవిష్కరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షులు కె.రాజిరెడ్డి, మహ్మద్ జహంగీర్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఈ.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి టీవీ లక్ష్మణ్, అడ్వైజర్ విశ్వనాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు మహమ్మద్ ఆశం, బి నర్సింగరావు, అజయ్ నాథ్ తదితరులు పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్ అనుబంధ జలమండలి ఉద్యోగుల సంఘంలోని వివిధ సంఘాలకు చెందిన కీలక నేతలు పెద్ద ఎత్తున చేరారు. మంగళవారం గాంధీభవన్‌లో జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మధుయాష్కీ గౌడ్ సమక్షంలో చేరారు.

నో ఎంట్రీ..!

రద్దీ ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝళిపిస్తున్నారు. నిషేధిత సమయాల్లోనూ ఇష్టారాజ్యంగా తిరుగుతుండటంతో చల్లాన్లు విధించడంతో పాటు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. ఈక్రమంలో వెస్ట్‌జోన్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ సైతం నిర్వహిస్తున్నారు.



నిషేధిత సమయంలో రోడ్డెక్కిన బోర్‌వెల్ వాహనాన్ని సీజ్ చేసిన బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

- ట్రాఫిక్ నియంత్రణకు 'వెస్ట్‌జోన్' చర్యలు
- భారీ వాహనాలకు సమయాల కేటాయింపు
- రూల్స్ అతిక్రమిస్తే జరిమానాలు, కేసులు

బంజారాహిల్స్: నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, బేగంపేట, ఎస్ఆర్‌నగర్, సైఫాబాద్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా విద్యాసంస్థల బస్సులతో పాటు ఉద్యోగులు ఆఫీసులకు వెళ్లొచ్చే సమయాల్లో ట్రాఫిక్ విపరీతంగా ఉంటోంది. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బేగంపేట ప్రాంతాల్లో రోడ్లపై వాహనాలు అడుగడుగునా ఆగిపోతుంటాయి. ఈ నేపథ్యంలో భారీ వాహనాలు నగరంలోకి రాకుండా ప్రభుత్వం నిషేధిత సమయాలను విధించింది. అయా కూడా రోడ్ల పైకి భారీ వాహనాలు వస్తే ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కేసులు కూడా నమోదు చేస్తున్నారు.

225 భారీ వాహనాలపై ఎఫ్ఐఆర్‌లు

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, బేగంపేట, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జనవరి 28వ తేదీ నుంచి ఈ నెల 5 వరకు నిర్వహించిన తనిఖీల్లో నిషేధిత సమయాల్లో రోడ్ల మీదకు వచ్చిన 225 భారీ వాహనాలకు చలాన్లతో పాటు ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదయ్యాయి.

రాత్రి 10 గంటల నుంచి..

లారీలు, టిప్పర్లు, ట్రావెల్ బస్సులు, రెడీమిక్స్ వాహనాలు.. ఇవన్నీ భారీ వాహనాల కేటగిరిలోకి ట్రాఫిక్ పోలీసులు చేర్చారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 7 వరకు మాత్రమే ఈ భారీ వాహనాలు నగరంలో తిరగాల్సి ఉంటుంది. కాగా, నిషేధిత సమయాల్లో ఈ వాహనాలు రోడ్డు మీద తిరిగితే చలాన్లు విధిస్తున్నారు. మరోవైపు రెడీమిక్స్ కాంక్రీట్ వాహనాలను సీజ్ చేసి ఆర్టీఏకు పంపిస్తున్నారు.

డీసీఎంలకు అనుమతి

భవన నిర్మాణ వ్యర్థాలు, చిన్న సరుకులు తరలించే డీసీఎంలు మాత్రం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు తిరిగేందుకు అనుమతి ఉంది. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు నిషేధించారు. తిరిగి రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు కూడా డీసీఎంలు తిరగొచ్చు. అయితే, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాకపోకలు నిషేధించారు.

బంజారాహిల్స్ పరిధిలో..

ఇంకోవైపు నిషేధిత సమయాల్లో వచ్చే భారీ వాహనాలపై బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఇప్పటి వరకు 51 కేసులు నమోదు చేయగా, ఇందులో ఒక ఎఫ్ఐఆర్ కూడా ఉంది. అలాగే జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు కూడా భారీ వాహనాలపై పెద్ద ఎత్తున చలాన్లు విధిస్తున్నారు. అక్రమంగా ప్రవేశించే వాహనాల చెక్ రిపోర్ట్ తయారు చేసి ఆర్టీఏకు సిఫారసు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా భారీ వాహనాలపై నిషేధిత చర్యలు తీసుకోగా మంచి ఫలితాలను ఇస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఎంవీ యాక్ట్ ప్రకారమే ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, మరికొన్ని రోజులు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.



నిషేధిత సమయంలో తిరుగుతున్న భారీ వాహనానికి చలాన్ వేస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్సై శ్రీధర్

న్యాయం కోసం నర్సింగ్ స్టాఫ్ విజ్ఞప్తి



న్యాయస్థాన ఆదేశాలను చూపుతున్న బాధితులు

పంజగుట్ట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల లోపే తమను కోర్టు ఉత్తర్వుల ప్రకారం స్థానిక జోన్‌లకు బదిలీ చెయ్యాలని మెడికల్, హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లోని నర్సింగ్ ఆఫీసర్స్ స్టాఫ్ 317 జీఓ బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింగ్ ఆఫీసర్స్ 317 జీఓ బాధితులు రాపోలు శేఖర్, ఎ.మంజుల, మమతలు మాట్లాడారు. గత ప్రభుత్వంలో స్థానికతను తీసి వేసి కేవలం సీనియారిటీ ప్రకారం బదిలీలు చేపడతామని జీవో 317 తీసుకువచ్చారని గుర్తుచేశారు. దీంతో సుమారు 600 మంది నర్సింగ్ ఆఫీసర్స్ స్టాఫ్ తమ స్థానికతను కోల్పోయి మరొక చోట ఉద్యోగం చెయ్యాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పెద్దలను ఎన్నోసార్లు కలిసి వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందని.. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయస్థానం కూడా గతేడాది ఒకసారి, గత నెలలో మరోసారి తమను స్థానిక ప్రాంతాలకు బదిలీ చేసిన తర్వాతే కొత్త రిక్రూట్‌మెంట్ చెయ్యాలని ఆదేశించినా ఫలితం లేదన్నారు. సమావేశంలో కిరణ్ కుమార్, సోమేశ్వర్ పాల్గొన్నారు.

'రిజర్వేషన్' బిల్లుపై నిర్ణయం తీసుకోవాలి

లిబర్టీ: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టడానికి ప్రభుత్వానికున్న అభ్యంతరం ఏమిటని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్రు కుమార స్వామి ప్రశ్నించారు. దాదాపు 10 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం బీసీలకు చేసింది శూన్యమన్నారు. మంగళవారం దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టాలని ఏళ్లుగా పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. బీసీ కుల గణనపై ప్రధాన మంత్రి పార్లమెంటులో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

మేకల అపహరణ

రహమత్‌నగర్: బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధి హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్–2లో మేకల దొంగతనం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్–2కు చెందిన అబ్దుల్ జలీల్ మూడు మేకలు పెంచుకుంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి ముందున్న మేకలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. అయితే కొంతమంది మేకలను ఆటోలో తీసుకెళ్లారని తెలుసుకొని పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు.

రోడ్డుపై గొడవ.. యువకుల అరెస్టు

వెంగళరావునగర్: నడిరోడ్డుపై ఘర్షణ పడుతున్న యువకులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం అర్ధరాత్రి కొందరు రహమత్‌నగర్ చౌరస్తాలో గొడవ పడుతుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో చౌరస్తా గొడవ పడుతున్న రాములు, ఎం.రాకేశ్‌కుమార్, సయ్యద్ అఫ్రోజ్, సయ్యద్ అమీర్, షేక్ అర్బాజ్, షేక్ సైబాజ్, ఎండీ అమీర్‌ని పోలీసులు అరెస్టు చేశారు.

సిగరెట్ తగిలిందని దాడి

వెంగళరావునగర్: సిగరెట్ తగిలిందంటూ ఇద్దరు స్నేహితులపై కొందరు యువకులు దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. బడంగ్‌పేటకు చెందిన శ్రీనిధ్ ఈనెల 2వ తేదీన తన స్నేహితుడు అఖిల్‌ని కలిసి యూసుఫ్‌గూడలో మాట్లాడుతున్నాడు. కాగా, ఇస్మాయేల్ అతని స్నేహితుడు రహమత్ తదితరులు అదే మార్గంలో వెళ్తున్నారు. ఈక్రమంలో అఖిల్ సిగరెట్ తగిలిందని వారంతా గొడవకు దిగి.. కొద్దిసేపటికి రాజీ పడ్డారు. రెండు రోజుల తర్వాత కాలేజీ నుంచి బయటకు వస్తున్న శ్రీనిధ్, అతని స్నేహితుడు గణేశ్‌తో సదరు యువకులు గొడవ పెట్టుకున్నారు. అంతే కాకుండా కూల్‌డ్రింక్ సీసాలు, ఇనుప రాడ్లతో దాడి చేయడంతో శ్రీనిధ్‌కు గాయాలయ్యాయి. చికిత్స అనంతరం బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యలుంటే మెసేజ్ చేయండి



పింఛన్‌దారులను సన్మానించిన నాయకులు

వెంగళరావునగర్: పింఛన్‌దారులు తమ సమస్యలను మెసేజ్ ద్వారా తెలియజేస్తే పరిష్కరిస్తామని పంజగుట్ట పెన్షన్ చెల్లింపు అధికారి శివకుమార్ తెలిపారు. అఖిల భారత పింఛన్‌దారుల దినోత్సవం ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శివకుమార్ మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. సమస్యలు ఉంటే కార్యాలయం వరకు సీనియర్ సిటిజన్లు రావద్దని, ఫోన్‌లో సందేశం పంపితే చాలని చెప్పారు. కార్యక్రమంలో రాజీవ్‌నగర్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పీఎస్‌జీ కృష్ణశర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.చంద్రశేఖర్, కార్యదర్శి శ్యాంరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంటయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసింగ్, పంజగుట్ట అధ్యక్షుడు ఈశ్వరయ్య, రాజీవ్‌నగర్ సహ అధ్యక్షుడు భుజంగరావు, కోశాధికారి భద్రుద్దీన్, ఉపాధ్యక్షుడు ఇసాక్ పాల్గొన్నారు.

సీపీసీఎల్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులకు స్పోర్ట్స్ యూనిఫాం అందజేస్తున్న నాయకులు

రహమత్‌నగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ క్రికెట్ లీగ్ పోటీలు మంగళవారం ఎస్పీఆర్ హిల్స్ క్వారీ మైదానంలో ప్రారంభమయ్యాయి. పోటీలను నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, నగర కాంగ్రెస్ నాయకుడు ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలతో ఉల్లాసంగా ఉండొచ్చన్నారు. అనంతరం క్రీడాకారులకు యూనీఫామ్‌లు, బ్యాట్లు అందించారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజర్ స్వామి, నాయకులు కిరణ్‌యాదవ్, గ్యార నాగరాజు, సుల్తాన్, అండాలు, మేఘన పద్మ, మన్సూర్, ఎక్బాల్, ఒర్సు అడవయ్య, అనంతయ్య, తంగలపెల్లి లక్ష్మణ్, షేక్ సాబేర్, సుందర్, రవీందర్ రెడ్డి, అరుణ్ గౌడ్, సాయి, అహ్మద్, బెన్నార్, రాంబాబు పాల్గొన్నారు.

28న రాష్ట్రస్థాయి యువజన సమ్మేళనం

హిమాయత్‌నగర్: 'దేశ పాలకుల విధానాలు–నేటి యువత కర్తవ్యం' అనే అంశంపై రాష్ట్రస్థాయి యువజన సమ్మేళనం నిర్వహించనున్నట్టు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర వెల్లడించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో వరంగల్‌లో ఫిబ్రవరి 28న నిర్వహించే రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను హిమాయత్‌నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లో మంగళవారం విడుదల చేశారు. సదస్సుకు రాష్ట్రంలోని యువజన, విద్యార్థి, మేధావులతో పాటు జాతీయ నేతలు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాలకుల వినాశకర విద్యా విధానాల వల్ల దేశంలోని 30 శాతం మంది యువతకు ఉపాధి అవకాశాలు లేవన్నారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, టి.సత్యప్రసాద్, రామకృష్ణ, మహేందర్, శ్రీమాన్, యుగంధర్ రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లంకి మహేశ్, నయీమ్ పాల్గొన్నారు.

'పీటీఈ కోర్'కు బుకింగ్స్ మొదలు

- కెనడాలో పని, శాశ్వత నివాసానికి అవకాశం
- 'పియర్సన్' ఇండియా డైరెక్టర్ ప్రభుల్ రవీంద్రన్



మాట్లాడుతున్న ప్రభుల్ రవీంద్రన్

బంజారాహిల్స్: ప్రముఖ లెర్నింగ్ కంపెనీ పియర్సన్ ఇంగ్లిష్ ప్రావీణ్య పరీక్ష పీటీఈ కోర్ కోసం బుకింగ్‌లు ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. పీటీఈ కోర్ గత ఏడాది కెనడా ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్, సిటిజన్‌షిప్ ఆమోదం పొందినట్టు తెలిపారు. కెనెడియన్ ఆర్థిక వలస ప్రయోజనాలకు అనుగుణంగా పీటీఈ కోర్‌ను ప్రవేశపెట్టినట్టు పియర్సన్ ఇండియా ఇంగ్లిష్ లాంగ్వేజ్ లెర్నింగ్ డైరెక్టర్ ప్రభుల్ రవీంద్రన్ తెలిపారు. బంజారాహిల్స్ రాడిసన్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్‌లోని టెస్ట్ టేకర్‌లకు పీటీఈ కోర్‌ను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. కెనడాలో జీవించాలనుకునే, పనిచేయాలనే వారి కలలను పీటీఈ కోర్ సాకారం చేస్తుందన్నారు. స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్(ఎస్‌డీఎస్) వీసా దరఖాస్తుల కోసం పీటీఈ కోర్‌ను ఐఆర్‌సీసీ ఆమోదించిన ఇంగ్లిష్ ప్రావీణ్య పరీక్షగా పేర్కొన్నారు. ఇప్పటికే కెనడాలో 97 శాతం కంటే ఎక్కువ విశ్వవిద్యాలయాలు, 95 శాతం కళాశాలలచే పీటీఈ కోర్ గుర్తించబడిందన్నారు. పరీక్ష రాసేవారు పీటీఈ కోర్‌ను 24 గంటల ముందుగానే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలన్నారు. ఏడాది పొడవునా ప్రపంచవ్యాప్తంగా పరీక్షా కేంద్రాల స్లాట్‌లను పొందవచ్చన్నారు. ఇందులో కెనడా వ్యాప్తంగా 25 పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు.

జర్నలిస్టుల పాత్ర కీలకంగా ఉండాలి



సభలో మాట్లాడుతున్న నవీన్‌యాదవ్

డీజేఎఫ్ సభలో వక్తల సూచన

వెంగళరావునగర్: ప్రజా సమస్యల పరిష్కారంలోనూ జర్నలిస్టుల కృషి ఉండాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.నవీన్ యాదవ్, విరించి ఆస్పత్రి చైర్మన్ మాధవీలత పేర్కొన్నారు. డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్(డీజేఎఫ్) 4వ జాతీయ మహాసభ యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జరిగింది. సభలో వక్తలు మాట్లాడుతూ.. చిన్న పత్రికలకు కూడా గుర్తింపు కార్డులు, ప్రకటనలు ఇవ్వాలన్నారు. కొన్నేళ్లుగా జర్నలిస్టుల కుటుంబాలకు విద్య, వైద్యం అందని ద్రాక్షగా ఉన్నాయని, ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వాలని కోరారు. కాగా మూడు వేల మంది జర్నలిస్టులకు త్వరలో విరించి హాస్పిటల్ తరఫున హెల్త్‌కార్డులు అందించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీజేఎఫ్ జాతీయ అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి మహ్మద్ యూసఫుద్దీన్ ఖాద్రీ, రాష్ట్ర అధ్యక్షుడు వి.రత్నాకర్, ప్రధాన కార్యదర్శి యాదిరెడ్డి, కార్యదర్శి నసీరుద్దీన్ ఖాద్రీ, మహిళా అధ్యక్షురాలు గీత, హైదరాబాద్ ఇన్‌చార్జి మహ్మద్ జలాలుద్దీన్, పీఆర్‌టీ సిద్ధు, కాంగ్రెస్ నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

సమాజసేవకు అవకాశం ఇవ్వండి



ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన వేణుగోపాలస్వామి

బంజారాహిల్స్: సమాజ సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చే తనలాంటి వారికి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నేత, సీపీ వేణుగోపాల స్వామి కోరారు. ఈమేరకు మంగళవారం సివిల్ సప్లయ్స్, నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. సికింద్రాబాద్ పార్లమెంటు స్థానానికి అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల స్వామి మాట్లాడుతూ.. తాను రాజకీయాల్లోకి రాక ముందు నుంచి తన ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నానని చెప్పారు. రాజకీయాల్లోకి వస్తే మరింత సేవ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



డైరీ ఆవిష్కరిస్తున్న మధుయాష్కి

హిమాయత్‌నగర్: రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్(టీటీటీఏ) నాయకులు మధుయాష్కిని మంగళవారం ఆయన నివాసంలో కలిసి వారి సమస్యలు తెలిపారు. ఈ సందర్భంగా టీటీటీఏ డైరీ, కేలండర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు సభావట్ హరికిషన్ చవాన్, ఇతర సభ్యులతో కలిసి మధుయాష్కి ఆవిష్కరించారు. అనంతరం హరికిషన్ చావాన్ మాట్లాడుతూ.. గిరిజన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, జీఓ నంబర్ 342ను పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతి సందర్భంగా ప్రభుత్వం అధికారికంగా సెలవుదినం ప్రకటించాలని కోరారు. ఈ విషయాలపై మధుయాష్కి సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీటీటీఏ ప్రధాన కార్యదర్శి వి.శ్రీను నాయక్, కోశాధికారి కె.లక్ష్మణ్ రాథోడ్, రాష్ట్ర సలహాదారుడు సభావట్ లక్ష్మణ్ సింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, రంగారెడ్డి జిల్లా సలహాదారుడు శ్రీనివాస్ నాయక్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్, ట్రెజరర్ శ్రీమతి కె.లీలా పాల్గొన్నారు.

స్టేట్‌హోం ఎదుట ఆయాల నిరసన



స్టేట్‌హోం ఎదుట నిరసన తెలియజేస్తున్న ఆయాలు

వెంగళరావునగర్: తమ నాయకురాలిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పలువురు ఆయాలు మంగళవారం నిరసన తెలిపారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ మహిళా శిశుసంక్షేమ శాఖలో పనిచేస్తున్న వర్కర్స్ యూనియన్ నాయకురాలు సుజాత సోమవారం అధికారులతో గొడవ పడ్డారు. దీంతో అధికారులు ఆమెను మందలించారు. ఈక్రమంలో మంగళవారం ఆమెను ఆఫీసులోకి రాకుండా అధికారులు అడ్డుకోవడంతో ఆయాలు ఎదురుతిరిగారు. అయినప్పటికీ అధికారులు వినకపోవడంతో గేటు బయట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు అశోక్, సాయి శేషగిరిరావు మాట్లాడుతూ.. స్టేట్‌హోంలోని సమస్యలపై ఇటీవల మంత్రి సీతక్కకు ఆయాలు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో అధికారులు ఆయాలపై కక్ష పెంచుకున్నారని ఆరోపించారు.

సాక్షార భారత్ ఉద్యోగులను ఆదుకోవాలి



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కృష్ణంరాజు తదితరులు

హిమాయత్‌నగర్: సాక్షర భారత్ ఉద్యోగులను బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు తొలగించి తమ కుటుంబాలను రోడ్డున పడేశాయని సాక్షర భారత్ కో–ఆర్డినేటర్ల సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ఎం.కృష్ణంరాజు ఆవేదన చెందారు. ఈ మేరకు బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం సదస్సు నిర్వహించారు. అనంతరం బషీర్‌బాగ్ కూడలిలో సీఎం రేవత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ.. బీజేపీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వాల వల్ల వయోజన విద్య–సాక్షర భారత్‌లో పని చేస్తున్న 443 మంది మండల కో–ఆర్డినేటర్లు, 17,863 మంది గ్రామ కో–ఆర్డినేటర్లు ఉద్యోగాలు పోయాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో తమను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సురేశ్, నాయకులు రాములు గౌడ్, శ్రీనివాస్, స్నేహలత, వినోద్, రవి తదితరులున్నారు.



'రోహిత్ బ్యాటర్‌గా రాణించాలని కెప్టెన్సీ తప్పించాం'

ఐపీఎల్‌లో రోహిత్ శర్మ యథేచ్ఛగా పరుగులు చేయాలనే ఉద్దేశంతోనే కెప్టెన్సీ నుంచి తప్పించినట్లు ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మార్క్ బౌచర్ వివరించాడు. ఇది చాలా కఠినమైన నిర్ణయం. కానీ జట్టు కోసం తప్పలేదు. రోహిత్ గత రెండు సీజన్లుగా జట్టును సమర్థంగా నడిపించాడు. ఇందులో సందేహం లేదు. కానీ పరుగులు చేయడంలో వెనుకబడ్డాడు. ఇప్పుడు అతను ఏ ఒత్తిడి లేకుండా తనకిష్టమైన ఓపెనింగ్ పాత్రలో మెరిపించేందుకు మా నిర్ణయం దోహదం చేస్తుంది' అని బౌచర్ అన్నాడు.



గుజరాత్ జెయింట్స్ జట్టు హెడ్ కోచ్‌గా క్లింగర్

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో తలపడే గుజరాత్ జెయింట్స్ జట్టుకు కొత్త హెడ్ కోచ్‌గా ఆస్ట్రేలియాకు చెందిన మైకేల్ క్లింగర్‌ను నియమించారు. తొలి సీజన్‌లో ఆస్ట్రేలియాకే చెందిన రాచెల్ హేన్స్ కోచింగ్‌లో బరిలోకి దిగిన జెయింట్స్ అట్టడుగున నిలిచింది. 2017లో ఆస్ట్రేలియా తరఫున మూడు అంతర్జాతీయ టి20లు ఆడిన క్లింగర్ తదనంతరం మహిళల బిగ్‌బాష్‌లో సిడ్నీ థండర్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా పనిచేశారు. డబ్ల్యూపీఎల్-2 ఈ నెల 25న మొదలవుతుంది.

రష్మిక సంచలనం

ప్రపంచ 93వ ర్యాంకర్‌పై గెలుపు



సాక్షి, హైదరాబాద్: ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సంచలనం సృష్టించింది. తొలి రౌండ్‌లో ప్రపంచ 520వ ర్యాంకర్ రష్మిక 2-6, 6-1, 7-6 (7/5)తో ప్రపంచ 93వ ర్యాంకర్, రెండో సీడ్ నావో హిబినో (జపాన్)ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. 2 గంటల 17 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఐదు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది.

అనిరుధ్‌కు రజతం



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక లాస్ వేగస్ షూట్ అంతర్జాతీయ ఆర్చరీ టోర్నమెంట్‌లో భారత సంతతి కుర్రాడు పింజల అనిరుధ్ కల్యాణ్ రజత పతకంతో మెరిశాడు. హైదరాబాద్‌లోని లంగర్ హౌస్ ప్రాంతానికి చెందిన అనిరుధ్ కుటుంబం అమెరికాలో నివసిస్తోంది. లాస్ వేగస్‌లో రెండు రోజులపాటు జరిగిన ఈ టోర్నీలో అమెరికాకు ప్రాతినిధ్యం వహించిన అనిరుధ్ రికర్వ్ కబ్ కేటగిరీలో పోటీపడి రెండో స్థానంలో నిలిచాడు. అనిరుధ్ మొత్తం 547 పాయింట్లు స్కోరు చేసి రజతం నెగ్గాడు. ఇదే టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ స్టార్ వెన్నం జ్యోతి సురేఖ 898 పాయింట్లతో పదో ర్యాంక్‌లో నిలిచింది.

జూలైలో జింబాబ్వేకు భారత్

హరారే: భారత క్రికెట్ జట్టు ఈ ఏడాది జూలైలో జింబాబ్వేలో పర్యటించనుంది. వెస్టిండీస్, అమెరికాల్లో నిర్వహించే టి20 ప్రపంచకప్ జూన్ 29న ముగియగానే ఈ టూర్ ఉంటుందని బీసీసీఐ తెలిపింది. రెండు జట్ల మధ్య హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జూలై 6, 7, 10, 13, 14 తేదీల్లో ఐదు టి20 మ్యాచ్‌లు జరుగుతాయి.

శ్రమించి... ఛేదించి...

అండర్-19 ప్రపంచకప్‌లో తొమ్మిదోసారి ఫైనల్ చేరిన యువ భారత్

సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై 2 వికెట్లతో విజయం ● సచిన్, ఉదయ్ వీరోచిత పోరాటం

ఈ టోర్నీలో ఆడిన మ్యాచ్‌లన్నీ గెలిచిన యువ భారత జట్టుకు 245 లక్ష్యం సులువైందే! కానీ 32 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయిన టీమిండియాకు ఆ సులువైన లక్ష్యమే క్లిష్టంగా మారింది. ఈ దశలో కెప్టెన్ ఉదయ్ సహారణ్‌కు జతయిన సచిన్ దాస్ ఐదో వికెట్‌కు 171 పరుగులు జోడించడంతో ఓటమి కోరల్లోంచి బయటపడిన భారత్ ఈ మెగా టోర్నీ చరిత్రలో తొమ్మిదోసారి ఫైనల్ పోరుకు అర్హత పొందింది.

బెనోని (దక్షిణాఫ్రికా): ఆరంభం నుంచి అండర్-19 ప్రపంచకప్‌లో అలవోకగా జైత్రయాత్ర చేస్తున్న డిఫెండింగ్ చాంపియన్ భారత్‌కు సెమీస్‌లో అసాధారణ పోరాటం ఎదురైనా... అద్భుతమైన విజయంతో ఫైనల్ చేరింది. తొలి సెమీఫైనల్లో యువ భారత్ 2 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. మొదట దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 7 వికెట్లకు 244 పరుగులు చేసింది. ప్రిటోరియస్ (102 బంతుల్లో 76; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), రిచర్డ్ (100 బంతుల్లో 64; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. రాజ్ లింబాని 3; ముషీర్ ఖాన్ 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 48.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఉదయ్ (124 బంతుల్లో 81; 6 ఫోర్లు), సచిన్ దాస్ (95 బంతుల్లో 96; 11 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత పోరాటం చేశారు.

సీన్ మార్చిన సచిన్

జట్టు ఖాతా తెరువక ముందే తొలి బంతికే ఆదర్శ్ సింగ్ (0), కాసేపటికే ముషీర్ ఖాన్ (4), అర్షిన్ (12), ప్రియాన్షు (5) పెవిలియన్ చేరారు. ఈ దశలో క్రీజులో ఉన్న కెప్టెన్ ఉదయ్‌కి సచిన్ దాస్ జతయ్యాడు. కెప్టెన్ నింపాదిగా ఆడుతుంటే అడపాదడపా బౌండరీలతో సచిన్ దాస్ లక్ష్యఛేదనకు అవసరమైన పరుగులు పేర్చాడు. అర్ధసెంచరీలతో ఇన్నింగ్స్‌ను గాడిన పెట్టారు. ఇద్దరు 30 ఓవర్లపాటు అసాధారణ పోరాటం చేశారు. 4 పరుగుల తేడాతో సచిన్ సెంచరీ అవకాశాన్ని చేజార్చుకోగా... హైదరాబాద్ ఆటగాళ్లు అరవెల్లి అవనీశ్ రావు (10), అభిషేక్ మురుగన్ (0) వికెట్లు పడటంతో ఉత్కంఠ పెరిగింది. ఈ దశలో రాజ్ లింబాని (4 బంతుల్లో 13 నాటౌట్; 1 సిక్స్, 1 ఫోర్) జట్టును విజయ తీరానికి చేర్చాడు. గురువారం ఆస్ట్రేలియా, పాకిస్తాన్ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌తో తలపడుతుంది.



ఉదయ్



సచిన్ దాస్

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: ప్రిటోరియస్ (సి) అభిషేక్ (బి) ముషీర్ 76; స్టీవ్ స్టోల్క్ (సి) అవనీశ్ (బి) రాజ్ 14; టీగెర్ (బి) రాజ్ 0; రిచర్డ్ (సి) మొయిలా (బి) నమన్ 64; ఒలీవర్ (సి) సచిన్ (బి) ముషీర్ 22; మరయిస్ (సి) అభిషేక్ (బి) సామీ పాండే 3; జేమ్స్ (సి) అవనీశ్ (బి) రాజ్ 24; నార్టన్ నాటౌట్ 7; ట్రిస్టన్ నాటౌట్ 23; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 244. వికెట్ల పతనం:** 1-23, 2-46, 3-118, 4-163, 5-174, 6-214, 7-220. **బౌలింగ్:** రాజ్ లింబాని 9-0-60-3, నమన్ తివారి 8-0-52-1, అభిషేక్ మురుగన్ 4-0-14-0, అర్షిన్ 2-0-10-0, సామీ పాండే 10-0-38-1, ముషీర్ 10-1-43-2, ప్రియాన్షు 7-1-25-0.

భారత్ ఇన్నింగ్స్: ఆదర్శ్ (సి) ప్రిటోరియస్ (బి) మఫక 0; అర్షిన్ (సి) జేమ్స్ (బి) ట్రిస్టన్ 12; ముషీర్ (సి) జేమ్స్ (బి) ట్రిస్టన్ 4; ఉదయ్ (రనౌట్) 81; ప్రియాన్షు (సి) ప్రిటోరియస్ (బి) ట్రిస్టన్ 5; సచిన్ (సి) టీగెర్ (బి) మఫక 96; అవనీశ్ (సి) నార్టన్ (బి) మఫక 10; అభిషేక్ (రనౌట్) 0; రాజ్ (నాటౌట్) 13; నమన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 27; **మొత్తం (48.5 ఓవర్లలో 8 వికెట్లకు) 248. వికెట్ల పతనం:** 1-0, 2-8, 3-25, 4-32, 5-203, 6-226, 7-227, 8-244. **బౌలింగ్:** మఫక 10-0-32-3, ట్రిస్టన్ 10-1-37-3, నార్టన్ 9-0-53-0, మొకీనా 7.5-0-45-0, స్టోల్క్ 2-0-18-0, జేమ్స్ 8-0-44-0, వైట్‌హెడ్ 2-0-17-0.

ఆసీస్ క్లీన్‌స్వీప్



కాన్‌బెర్రా: వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' జేవియర్ బార్ట్‌లెట్ (4/21) దెబ్బకు తొలుత బ్యాటింగ్ దిగిన వెస్టిండీస్ 24.1 ఓవర్లలో కేవలం 86 పరుగులకే ఆలౌటైంది. అనంతరం ఆస్ట్రేలియా దూకుడుగా ఆడి కేవలం 6.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 87 పరుగులు చేసి నెగ్గింది. జేక్ ఫ్రేజర్ (18 బంతుల్లో 41; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), జోష్ ఇంగ్లిస్ (16 బంతుల్లో 35 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) మెరిపించారు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్ 31 ఓవర్లలోనే ముగియడం గమనార్హం. ఆస్ట్రేలియాకిది 1000వ వన్డే కావడం విశేషం. భారత్ (1055 వన్డేలు) తర్వాత 1000 వన్డేలు ఆడిన రెండో జట్టుగా ఆస్ట్రేలియా నిలిచింది.

విలియమ్సన్ మరో సెంచరీ

528 పరుగుల ఆధిక్యంలో న్యూజిలాండ్



మౌంట్ మాంగనుయ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టుపై న్యూజిలాండ్ పూర్తిగా పట్టుబిగించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తమ ఆధిక్యాన్ని 528 పరుగులకు పెంచుకుంది. 349 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన న్యూజిలాండ్ ప్రత్యర్థి జట్టుకు ఫాలోఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ ఆడింది. ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 43 ఓవర్లలో 4 వికెట్లకు 179 పరుగులు చేసింది. కేన్ విలియమ్సన్ (109; 12 ఫోర్లు, 1 సిక్స్) రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ సాధించడం విశేషం. తద్వారా ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు చేసిన ఐదో న్యూజిలాండ్ క్రికెటర్‌గా విలియమ్సన్ గుర్తింపు పొందాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 80/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 72.5 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌటైంది. కివీస్ బౌలర్లలో హెన్రీ (3/31), సాన్‌ట్నర్ (3/34), జేమీసన్ (2/35), రచిన్ రవీంద్ర (2/16) రాణించారు.

రుత్విక శివాని ఖాతాలో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్



సాక్షి, హైదరాబాద్: ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి రుత్విక శివాని మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో టైటిల్ సాధించింది. బెంగళూరులో మంగళవారం ముగిసిన ఈ టోర్నీలో క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో అడుగుపెట్టిన రుత్విక (తెలంగాణ)-రోహన్ కపూర్ (ఢిల్లీ) జోడీ చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో రుత్విక-రోహన్ ద్వయం 21-12, 21-16తో ధ్రువ్ రావత్ (ఉత్తరాఖండ్)-త్రిషా హెగ్డే (కర్ణాటక) జోడీపై నెగ్గింది. టైటిల్ గెలిచే క్రమంలో రుత్విక-రోహన్ తమ ప్రత్యర్థులకు ఒక్క గేమ్ కూడా కోల్పోలేదు.

భారత హాకీ ప్లేయర్ వరుణ్ కుమార్‌పై రేప్ కేసు



యశవంతపుర: 'అర్జున' అవార్డు గ్రహీత, భారత హాకీ ప్లేయర్ వరుణ్ కుమార్‌పై రేప్ కేసు నమోదైంది. 22 ఏళ్ల మహిళ తను మైనర్‌గా ఉన్నప్పుడు వరుణ్ అత్యాచారం చేశాడని ఆరోపిస్తూ బెంగళూరు పోలీసులను ఆశ్రయించింది. తనకు 17 ఏళ్ల వయసులో 2018లో ఇన్‌స్టాగామ్ ద్వారా ప్లేయర్ పరిచయమయ్యాడని, బెంగళూరులోని 'సాయ్' కేంద్రంలో హాకీ జట్టుకు శిక్షణ శిబిరం జరుగుతుండగా వరుణ్‌ని కలిసినట్లు ఆమె చెప్పింది. ఆ సమయంలో తనని పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అతను పలుమార్లు అత్యాచారం చేశాడని సదరు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. వరుణ్ భారత్ తరఫున 141 మ్యాచ్‌లు ఆడి 40 గోల్స్ సాధించాడు.

సినిమా

కేరాఫ్ ముంబై

కొందరు దక్షిణాది హీరోలు చలో ముంబై అన్నారు. ఎందుకంటే ఈ హీరోలు కనిపించే చిత్రాల్లో 'ముంబై' బ్యాక్‌డ్రాప్ ఉంది. కేరాఫ్ ముంబై అంటూ సాగే చిత్రాల్లో కొన్నింటి గురించి తెలుసుకుందాం.



● రజనీకాంత్



● రామ్



● ధనుష్



● దుల్కర్ సల్మాన్

డాన్ మొయిద్దీన్ భాయ్

రజనీకాంత్-ముంబై కాంబినేషన్ అంటే 'బాషా', 'కాలా' వంటి సినిమాలు గుర్తుకు వస్తాయి. ఈ జాబితాలో తాజాగా 'లాల్ సలామ్' సినిమా చేరింది. కానీ ఈ చిత్రంలో రజనీకాంత్ హీరో కాదు. ఓ లీడ్ క్యారెక్టర్. క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్ లీడ్ రోల్స్ చేయగా, రజనీకాంత్, కపిల్ దేవ్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో ముంబై డాన్ మొయిద్దీన్ భాయ్ పాత్రలో కనిపిస్తారు రజనీకాంత్. రెండు వర్గాలకు చెందిన క్రికెటర్ల మధ్య గొడవలను మొయిద్దీన్ ఎలా తీర్చాడు? అనేది చిత్రం ప్రధానాంశం. ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది.

డబుల్ ఇస్మార్ట్

ముంబైకి షిఫ్ట్ అయ్యాడట ఇస్మార్ట్ శంకర్. హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందిన హిట్ ఫిల్మ్ 'ఇస్మార్ట్ శంకర్'. ఈ చిత్రానికి సీక్వెల్‌గా ప్రస్తుతం 'డబుల్ ఇస్మార్ట్' చేస్తున్నారు రామ్, పూరి జగన్నాథ్. ఈ చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. కాగా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం మేజర్‌గా ముంబై నేపథ్యంలో సాగుతుందని ఫిల్మ్ నగర్ సమాచారం. ఓ కీలక షెడ్యూల్ చిత్రీకరణ కూడా ముంబైలో జరిగింది. పూరి జగన్నాథ్, ఛార్మీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను మార్చి 18న విడుదల చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల ఈ చిత్రం విడుదల వాయిదా పడినట్లుగా తెలుస్తోంది.

ధారావి?

'గోదావరి', 'హ్యాపీ డేస్', 'లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్', 'ఫిదా' 'లవ్‌స్టోరీ' వంటి సెన్సిబుల్ సినిమాలు తీసిన దర్శకుడు శేఖర్ కమ్ముల సడన్‌గా ట్రాక్ మార్చారు. ముంబై మాఫియా నేపథ్యంలో 'డీఎన్ఎస్' (వర్కింగ్ టైటిల్) సినిమాను తీస్తున్నారట. ధనుష్, నాగార్జున హీరోలుగా నటిస్తున్న మల్టీస్టారర్ ఫిల్మ్ ఇది. ఇందులో రష్మికా మందన్నా హీరోయిన్. ఇక 'డీఎన్ఎస్' కథ రీత్యా నాగార్జున ఓ పెద్ద డాన్ పాత్రలో కనిపిస్తారని, ఓ సాధారణ యువకుడి స్థాయి నుంచి మాఫియా గ్రూప్ లీడర్‌గా ఎదిగే పాత్రలో ధనుష్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాకు 'ధారావి' అనే టైటిల్ పరిశీలించారనే ప్రచారం కూడా జరిగింది. ముంబైలో మురికివాడ ప్రాంతం అయిన 'ధారావి' నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందట. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ తిరుపతిలో మొదలై, పూర్తయింది. నెక్స్ట్ షెడ్యూల్‌ను గోవాలో ప్లాన్ చేశారని తెలిసింది. 'లవ్‌స్టోరీ' చిత్రం తర్వాత దర్శకుడు శేఖర్ కమ్ములతో సునీల్ నారంగ్, పుస్కూరు రామ్మోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ముంబైలో క్యాషియర్

బొంబాయిలో 'లక్కీ భాస్కర్'గా మారిపోయారు దుల్కర్ సల్మాన్. వెంకీ అట్లూరి దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్. 1980 కాలంనాటి బొంబాయి నేపథ్యంలో ఈ చిత్రం కథాంశం ఉంటుంది. ఇందులో మగధ బ్యాంకులో క్యాషియర్‌గా పని చేసే భాస్కర్ పాత్రలో కనిపిస్తారు దుల్కర్ సల్మాన్. ఇటీవలే ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజయ్యే చాన్స్ ఉంది.

గగనాల తేలాను నీ ప్రేమలోన...



● మానుషీ చిల్లర్, వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటించిన ద్విభాషా (తెలుగు-హిందీ) చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మానుషీ చిల్లర్ హీరోయిన్. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 1న విడుదల కానుంది. ఈ సినిమా నుంచి 'గగనాల తేలాను నీ ప్రేమలోన...' పాట లిరికల్ వీడియోను యూనిట్ రిలీజ్ చేసింది. సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ స్వరకల్పనలో రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను అర్మాన్ మాలిక్ పాడారు. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో వరుణ్ తేజ్ మాట్లాడుతూ– ''దేశాన్ని కాపాడే సైనికుడు 130 కోట్ల మందిని తన కుటుంబంలా భావించి, తన కర్తవ్యాన్ని నిర్వహిస్తాడు. అలాంటి సైనికుల కోసం, వాళ్లు చేసిన త్యాగాల కోసం, వాళ్ల కథని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే గొప్ప ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశాం'' అన్నారు.

బేబీని కల్ట్ బొమ్మగా రీమేక్ చేస్తున్నాం

– ఎస్‌కేఎన్



''ట్రూ లవర్' చిన్న సినిమా. 'ఈగల్'తో పోటీపడేంత పెద్ద చిత్రం కాదు. అయినా అందరి ఆమోదం ఉండటంతో ఈ నెల 10న మా 'ట్రూ లవర్'ని రిలీజ్ చేస్తున్నాం. చిన్నా.. పెద్దా ఇలా అన్ని సినిమాలు విజయం సాధించాలి. అప్పుడే చిత్ర పరిశ్రమలో ఎక్కువమందికి పని దొరుకుతుంది'' అని నిర్మాత ఎస్‌కేఎన్ అన్నారు. మణికందన్, శ్రీ గౌరీప్రియ, కన్న రవి లీడ్ రోల్స్‌లో నటించి తమిళ చిత్రం 'ట్రూ లవర్'. ప్రభురామ్ వ్యాస్ దర్శకుడు. ఈ చిత్రానికి డైరెక్టర్ మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ సమర్పకులుగా వ్యవహరిస్తూ ఈ నెల 10న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎన్ మాట్లాడుతూ– ''ఏ బంధంలో అయినా నమ్మకం పునాదిగా ఉండాలనేది 'ట్రూ లవర్'లో మెయిన్ పాయింట్. ప్రేమికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ చిత్రంలో చక్కగా చూపించాడు దర్శకుడు. 'బన్నీ' వాసు ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాడు. 'బేబి' సినిమాను హిందీలో 'కల్ట్ బొమ్మ' టైటిల్‌తో సాయి రాజేశ్ డైరెక్షన్‌లోనే రీమేక్ చేయనున్నాం. ప్రస్తుతం సంతోష్ శోభన్, ఆనంద్ దేవరకొండలతో సినిమాలు చేస్తున్నాను. ప్రొడ్యూసర్‌గా అప్పర్ ప్రైమరీలో ఉన్నాను. కాలేజ్ స్థాయికి వచ్చాక అల్లు అర్జున్‌గారితో సినిమా నిర్మిస్తాను'' అన్నారు.

మా కెమిస్ట్రీ చాలా కొత్తగా ఉంటుంది

– కావ్యా థాపర్



''ఈగల్' సినిమాలో చాలా అద్భుతమైన ప్రేమకథ ఉంది. ఇందులో రచన అనే పాత్ర చేశాను. రవితేజగారు, నా పాత్ర మధ్య కెమిస్ట్రీ చాలా కొత్తగా ఉంటుంది. ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను చాలా గొప్పగా అలరిస్తుంది'' అని హీరోయిన్ కావ్యా థాపర్ అన్నారు. రవితేజ హీరోగా అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కావ్యా థాపర్ మాట్లాడుతూ– ''ఓ బాలీవుడ్ సినిమా షూటింగ్ కోసం ముంబైలో ఉన్నప్పుడు కార్తీక్ ఘట్టమనేనిగారు 'ఈగల్' స్టోరీ చెప్పారు. కథ చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. ఆ తర్వాత లుక్ టెస్ట్ చేసి, నన్ను ఎంపిక చేశారు. ఈ చిత్రంలో యాక్షన్, రొమాన్స్ చాలా కొత్తగా ఉంటాయి. 'రచన పాత్రలో అద్భుతంగా నటించారు. తెరపై కావ్య కాకుండా రచన కనిపించింది' అంటూ చిత్ర రచయిత మణిగారు ప్రశంసించడం చాలా తృప్తిగా అనిపించింది. నా వరకూ రచన పాత్రకు వంద శాతం న్యాయం చేశానని నమ్ముతున్నాను'' అన్నారు.

యాత్ర 2లో ఆ భావోద్వేగాలే చూపించాను

– మహి వి. రాఘవ్



● కేతకీ నారాయణ్, మహి వి. రాఘవ్, జీవా

''యాత్ర 2'లోని పాత్రలు ఎవర్నీ కించపరిచేలా ఉండవు. ఏ పార్టీనీ విలన్‌గా చూపించలేదు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డిగారి మరణం తర్వాత ఇచ్చిన మాట కోసం (ఓదార్పు యాత్ర) కొడుకుగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిగారు చేసిన భావోద్వేగ ప్రయాణాన్ని మాత్రమే చూపించాను'' అన్నారు దర్శకుడు మహి వి. రాఘవ్. వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో మహి వి. రాఘవ్ తెరకెక్కించిన 'యాత్ర' సినిమా మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి కొనసాగింపుగా రూపొందిన చిత్రం 'యాత్ర 2'. వైఎస్ఆర్ పాత్రను మమ్ముట్టి చేయగా, ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా, వైఎస్ భారతీ రెడ్డి పాత్రలో కేతకీ నారాయణ్ నటించారు. త్రీ ఆటమ్ లీవ్స్, వి సెల్యూలాయిడ్‌తో కలసి శివ మేక నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో మహి వి. రాఘవ్ మాట్లాడుతూ– ''మమ్ముట్టిగారు, జీవా, కేతకి, శివ మేక, నేను, సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్, కెమెరామేన్ మది.. ఇలా యూనిట్ అందరి వల్లే 'యాత్ర 2' బాగా వచ్చింది. జీవా అద్భుతమైన నటుడు. జగన్ అన్న పాత్రకి న్యాయం చేయగలడనే నమ్మకంతో ఎంచుకున్నాను. తెలుగు రాకపోయినా డైలాగ్స్ నేర్చుకుని అంకితభావంతో చేశాడు. 'యాత్ర 2' కథ, ప్రారంభం, ముగింపు అందరికీ తెలిసి ఉండొచ్చు. కానీ సినిమాను ఎలా తీశాం, ఏ భావోద్వేగాలతో నడిపించామన్నది ఎవరికీ తెలియదు. టీజర్, ట్రైలర్‌లో చూసిన ఇలాంటి ఎన్నో ఎమోషనల్ సీన్స్, ప్రజలకు తెలియని ఎన్నో అంశాలు సినిమాలో ఉంటాయి. ఈ మూవీలో వైఎస్ఆర్‌గారి మరణానికి సంబంధించిన కారణాలు చూపించలేదు. జగన్‌గారు ఢిల్లీ పెద్దలను ఎదిరించడం, సీఎం అయిపోవడం అనేది నా కథ కాదు. ఒక పాత్రని హీరో చేయడం కోసం ఇంకో పాత్రను తక్కువ చేసి చూపించాల్సిన అవసరం లేదు. మనమంటే గిట్టని వారు మనపై రాళ్లు వేస్తుంటారు.. బురద జల్లుతుంటారు.. అలాంటి వారిని పట్టించుకోకపోవడమే మంచిది'' అన్నారు.

జీవా మాట్లాడుతూ– ''మహీగారు నాకు కథ చెప్పి, వైఎస్ జగన్‌గారి పాత్ర అన్నప్పుడు షాక్ అయ్యాను. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి నాకు అవగాహన లేదు. కానీ జగన్‌గారి పాత్ర చేయడం బాధ్యతగా అనిపించింది. జగన్‌గారు ఎలా మాట్లాడతారు? ఎలా నడుస్తారు? అని వీడియోలు చూసి తెలుసుకున్నాను. మహీగారు ఈ పాత్రకు నన్ను ఓకే చేయడానికే చాలా టైమ్ తీసుకున్నారు. తొలి సన్నివేశం ఆయన ఓకే చెప్పడంతో నాకు పెద్ద ఉపశమనం అనిపించింది. నేను ఇప్పటి వరకూ వైఎస్ జగన్‌గారిని కలవలేదు.. కలిసే చాన్స్ వస్తే వదులుకోను. 'యాత్ర 2' విడుదల తర్వాత జగన్‌గారు మమ్మల్ని పిలిచి, అభినందిస్తారనే నమ్మకం ఉంది. 'యాత్ర 2' చేస్తున్నప్పుడు ప్రతిపక్షాల నుంచి నాకెలాంటి బెదిరింపు కాల్స్ రాలేదు. అయితే 'యాత్ర' చేస్తున్నప్పుడు మీకేమైనా అలాంటి కాల్స్ వచ్చాయా? అని మమ్ముట్టిగారిని అడిగాను. 'మనం యాక్టర్స్.. ఇది క్రియేటివ్ స్పేస్.. దీన్ని కేవలం సినిమాలానే చూడు' అని ఆయన చెప్పారు. ఈ మూవీలోని 'చూడు నాన్నా' పాట తీస్తున్నప్పుడు చాలా ఎమోషన్‌కు లోనయ్యాను. పులివెందులలో షూటింగ్ చేస్తున్నప్పుడు అక్కడి ప్రజల ప్రేమ, అభిమానం మరచిపోలేను. నా కెరీర్‌లో 'యాత్ర 2' తప్పకుండా ఓ మైలురాయిగా నిలుస్తుందని కచ్చితంగా చెప్పగలను'' అన్నారు. **కేతకీ నారాయణ్ మాట్లాడుతూ–** ''నేను మరాఠీ, హిందీ సినిమాలు చేశాను. తెలుగులో 'యాత్ర 2' నా మొదటి చిత్రం. తొలిసారి ఓ రియల్ పాత్ర చేశాను. పాత్రకు తగ్గ భావోద్వేగాలు పండించాను. పులివెందులలో షూటింగ్ చేసినప్పుడు అక్కడి మహిళలు నన్ను హత్తుకుని ఆప్యాయతతో మాట్లాడారు. అప్పుడు ఆ పాత్రలోని ఇంటెన్సిటీ నాకు అర్థమైంది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
455	158
72,186	21,929

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,548	▼ 49
డోజోన్స్	38,480	▲ 100
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,680	▲ 68
డాక్స్	17,033	▲ 129
షాంఘై	2,789	▲ 87
నికాయ్	36,161	▼ 194

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,479 ▼	33
బంగారం (99.5 స్వచ్ఛత)	62,299 ▼	37
వెండి (కిలో)	69,684 ▼	434

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.64	83.66
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.50	105.60
€	యూరో	ఒకటి	88.19	90.54
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.10	57.38
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.14	55.06
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.41	64.08
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.72	23.51
¥	చైనా యువాన్	పదింటికి	10.43	12.50

బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్ బంపర్ లిస్టింగ్



ముంబై: గత వారమే ఐపీవోకు వచ్చిన బీఎల్ఎస్ ఈ–సర్వీసెస్ బంపర్ లిస్టింగ్‌ను సాధించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.135)తో పోలిస్తే ఏకంగా రూ. 174(129%) పెరిగి రూ.309 వద్ద లిస్టయ్యింది. తదుపరి ఒక దశలో 175% దూసుకెళ్లి రూ.371 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి లిస్టింగ్ ధర(రూ.309)తో పోలిస్తే 20% అప్పర్ సర్క్యూట్‌ను తాకి రూ.371 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,919 కోట్లుగా నమోదైంది.

కెన్‌స్టార్ ప్రచారకర్తగా నటుడు రాజ్‌కుమార్ రావ్



న్యూఢిల్లీ: ప్రముఖ ఎయిర్‌కూలర్ల తయారీ సంస్థ కెన్‌స్టార్ ప్రచారకర్తగా బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు నియమితులయ్యారు. కెన్‌స్టార్ కూలర్ల అధునాతన స్టైల్, సరికొత్త సామర్థ్యాలను వివరించే ప్రకటనలో రాజ్‌కుమార్ రావు, ఆయన భార్య పత్రలేఖ పాల్ నటించారు. రాజ్‌కుమార్ రావు ప్రచారంతో కంపెనీ మరింత మంది కస్టమర్లకు చేరువ అవుతుందని సంస్థ సీఈవో సునీల్ జైన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే వేసవిలో వినియోగదారుల కోసం పలు కూలర్ల మోడళ్లను కంపెనీ అందుబాటులో ఉంచిదన్నారు.

ఇంధన రంగంలో 67 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

- రానున్న ఆరేళ్లపై భారత్ అంచనాలు
- ఇండియా ఎనర్జీ వీక్ ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని మోదీ

గోవా: భారత్ వృద్ధి బాటలో భాగస్వామ్యం కావాలని ప్రపంచ పెట్టుబడిదారులను భారత్ ఆహ్వానిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. వచ్చే 5 నుండి 6 సంవత్సరాలలో భారత దేశం ఇంధన రంగంలో 67 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షిస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇండియా ఎనర్జీ వీక్.. రెండవ ఎడిషన్‌ను ఇక్కడ ప్రారంభించిన ప్రధాని ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత్ ఎకానమీ 7.5% కన్నా అధిక వృద్ధి రేటుతో పురోగమిస్తోందన్నారు. అమెరికా (25.5 ట్రిలియన్ డాలర్లు) చైనా (18 ట్రిలియన్ డాలర్లు), జపాన్ (4.2 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4 ట్రిలియన్ డాలర్లు)ల తర్వాత దాదాపు 3.8 ట్రిలియన్ డాలర్లతో ప్రస్తుతం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్, త్వరలో మూడో స్థానానికి చేరడం ఖాయమని మోదీ ఉద్ఘాటించారు. ఇదే విషయాన్ని పలు సంస్థలూ స్పష్టం చేస్తున్నాయని ప్రధాని అన్నారు. 2030 నాటికి దేశం తన రిఫైనింగ్ సామర్థ్యాన్ని 254 ఎంఎంటీపీఏ (సంవత్సరానికి మిలియన్ మెట్రిక్ టన్నులు) నుండి 450 ఎంఎంటీపీఏకి పెంచుతుందని భావిస్తున్నామని ఆయన పేర్కొంటూ... ఈ నేపథ్యంలో భారతదేశ ఇంధన రంగ వృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రపంచ ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. ఇంధన రంగంలో మునుపెన్నడూ జరగని విధంగా భారతదేశం భారీ పెట్టుబడులు పెడుతోందని ప్రధాని అన్నారు. 2045 నాటికి దేశ ప్రాథమిక ఇంధన డిమాండ్ రెట్టింపు అవుతుందని కూడా ఆయన చెప్పారు.



ముడిచమురు, ఎల్‌పీజీల్లో మూడో స్థానం...

ముడిచమురు, ఎల్‌పీజీ వినియోగం విషయంలో భారత్ మూడవ అతిపెద్ద దేశంగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. ఎల్ఎన్‌జీ విషయంలో నాల్గవ అతి పెద్ద దిగుమతిదారుగా భారతదేశం ఉందని మోదీ అన్నారు. గత రెండేళ్లలో భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గాయని పేర్కొన్న ఆయన, ప్రపంచ సవాళ్ల నేపథ్యంలో దేశం ఇంధన నిర్వహణ వ్యూహాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ సంస్కరణలు దేశీయ సహజ వాయువు ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతున్నాయని మోదీ తెలిపారు.

చమురు, గ్యాస్ రంగంలో ఇన్వెస్ట్ చేయండి

గ్లోబల్ దిగ్గజ సంస్థల సీఈవోలతో ప్రధాని భేటీ

చమురు, గ్యాస్ రంగంలో ప్రత్యేకించి అన్వేషణ, ఉత్పత్తిలో పెట్టుబడులకు వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో అపార అవకాశాలు ఉన్నాయని ప్రధాని మోదీ ఈ రంగంలో ప్రముఖ ఎగ్జిక్యూటివ్‌లకు విజ్ఞప్తి చేశారు. ఇండియా ఎనర్జీ వీక్ సందర్భంగా ఎక్సాన్‌మొబిల్, బీపీల నుండి ఖతార్ ఎనర్జీ, ఫ్రెంచ్ దిగ్గజం టోటల్ ఎనర్జీస్ వరకు దాదాపు 20 మంది టాప్ ఎగ్జిక్యూటివ్‌లతో మోదీ సమావేశమయినట్లు అత్యున్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి హాజరైన భారతీయ సీఈఓలలో వేదాంత చైర్మన్ అనిల్ అగర్వాల్‌తో పాటు రిలయన్స్ అధికారులు ఉన్నారు. దేశంలో చమురు, గ్యాస్ వనరులను కనుగొని, ఉత్పత్తి చేయడంలో పెట్టుబడులు పెట్టేందుకు గాను ప్రపంచ దిగ్గజ సంస్థలను ఆహ్వానించేందుకు ఇటీవల ప్రారంభించిన 'ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్సింగ్ రౌండ్' విధానాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాగా, రానున్న మూడేళ్లలో చమురు, గ్యాస్ ఉత్పత్తిని రోజుకు 300,000 బ్యారెళ్లకు రెట్టింపు చేయడానికి 4 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడికి తమ సంస్థ యోచిస్తున్నట్లు ఈ సందర్భంగా అనిల్ అగర్వాల్ తెలిపారు.

ఖతార్‌తో ఎల్ఎన్‌జీ డీల్ పొడిగింపు

- 20 ఏళ్లకు 78 బిలియన్ డాలర్ల డీల్
- ఏటా 6 బిలియన్ డాలర్ల ఆదా

బెతుల్ (గోవా): ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) దిగుమతులకు సంబంధించిన డీల్‌ను మరో 20 ఏళ్ల పాటు పొడిగిస్తూ ఖతార్‌ఎనర్జీతో దేశీ దిగ్గజం పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ ఒప్పందం కుదుర్చుకుంది. దీని విలువ 78 బిలియన్ డాలర్లుగా ఉంటుంది. ఈ డీల్ 2048 వరకు అమల్లో ఉంటుంది. ఏటా 7.5 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ కొనుగోలు కోసం ఖతార్‌ఎనర్జీతో ఒప్పందాన్ని పొడిగించుకున్నట్లు పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యుత్, ఎరువుల ఉత్పత్తి కోసం ఈ గ్యాస్ ఉపయోగపడనున్నట్లు పేర్కొంది. ప్రస్తుత రేట్ల కన్నా తక్కువ ధరకే ఎల్ఎన్‌జీని ఖతార్ సరఫరా చేయనుండటంతో భారత్‌కు ఏటా 6 బిలియన్ డాలర్లు ఆదా కాగలదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పుడున్న ధరలతో పోలిస్తే కొత్త ఒప్పందం ప్రకారం యూనిట్‌కు (ఎంబీటీయూ) భారత్‌కి 0.8 డాలర్ల మేర మిగులుతుందని పేర్కొన్నాయి. ప్రస్తుతం బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 80 డాలర్లుగా ఉండగా ఏటా 7.5 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ దిగుమతుల బిల్లు 3.9 బిలియన్ డాలర్లుగా ఉండనుంది. ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలనే భారత్ లక్ష్యానికి ఈ కాంట్రాక్టు తోడ్పడగలదని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. భారత ఎకానమీ వృద్ధిలో తాము కూడా భాగంగా ఉండాలని ఆశిస్తున్నట్లు ఖతార్ ఇంధన శాఖ మంత్రి, ఖతార్‌ఎనర్జీ సీఈవో సాద్ అల్-కాబి తెలిపారు. ఎల్ఎన్‌జీ సరఫరా కోసం ఆస్ట్రేలియా, అమెరికా, రష్యాతో కూడా భారత్ ఒప్పందాలు కుదుర్చుకుంది.



పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి, ఖతార్ ఇంధన వ్యవహారాల సహాయ మంత్రి సాద్ అల్-కాబి సమక్షంలో ఒప్పందంపై సంతకాలు చేస్తున్న ఇరు కంపెనీల ప్రతినిధులు

ప్రస్తుతం ఏటా 8.5 ఎంటీపీఏ దిగుమతి..

ఖతార్‌ఎనర్జీ నుంచి పెట్రోనెట్ రెండు కాంట్రాక్టుల కింద ఏటా 8.5 మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) ఎల్ఎన్‌జీ దిగుమతి చేసుకుంటోంది. వాటిలో 25 ఏళ్లకు సంబంధించిన 2024లో కుదుర్చుకున్న ఒక ఒప్పందం 2028తో ముగిసిపోనుంది. దీన్నే పెట్రోనెట్ తాజాగా పొడిగించింది. భారత ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో ఖతార్ ఎనర్జీతో పెట్రోనెట్ ఒప్పందం వాటా దాదాపు 35%గా ఉంటుంది.

ఐటీ, ఇంధన షేర్లకు డిమాండ్

- సెన్సెక్స్ లాభం 455 పాయింట్లు
- 158 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- కలిసొచ్చిన విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు

ముంబై: ఐటీ, ఇంధన కంపెనీల షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మంగళవారం దాదాపు లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు సెంటిమెంట్‌ను బలపరిచాయి. సెన్సెక్స్ 455 పాయింట్లు పెరిగి 72,186 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 158 పాయింట్లు బలపడి 21,929 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ షేర్లు మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 530 పాయింట్లు పెరిగి 72,261 వద్ద, నిఫ్టీ 179 పాయింట్లు బలపడి 72,261 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒకశాతానికి పైగా రాణించాయి. సెన్సెక్స్ 455 పాయింట్లు పెరగడంతో బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ల విలువ రూ.4.27 లక్షల కోట్లు పెరిగి రూ.386.88 లక్షల కోట్లకు చేరింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.93 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1096 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. ఆసియాలో హాంగ్‌కాంగ్ 4%, చైనా 3%, థాయిలాండ్ 1%, ఇండోనేసియా, తైవాన్ సూచీలు అరశాతం చొప్పున పెరిగాయి. యూరప్ మార్కెట్లు 0.50% – 0.75% చొప్పున లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- వరుస 3 రోజుల్లో 42% పతనాన్ని చవిచూసిన పేటీఎం షేరు కోలుకుంది. కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈలో 3% లాభపడి రూ.452 వద్ద స్థిరపడింది.
- టీసీఎస్ కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది. ఐటీ షేర్లలో ర్యాలీలో భాగంగా టీసీఎస్ షేరు ట్రేడింగ్‌లో 4.5% ర్యాలీ చేసి రూ.4,150 వద్ద జీవితకాల గరిష్టాన్ని అందుకుంది. చివరికి 4% లాభపడి రూ.4,133 వద్ద స్థిరపడింది.



ఎస్‌బీఐ క్యాప్స్‌లో ఎస్‌బీఐకు వాటా

డీల్ విలువ రూ. 708 కోట్లు

కోల్‌కతా: ఎస్‌బీఐ క్యాప్ వెంచర్స్‌లో 100 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు పీఎస్‌యూ దిగ్గజం ఎస్‌బీఐ తాజాగా పేర్కొంది. ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ చేతిలో ఉన్న ఈ వాటా కొనుగోలుకి రూ. 708 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు బ్యాంకు సెంట్రల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదముద్ర వేసినట్లు ఎస్‌బీఐ తెలియజేసింది. ఎస్‌బీఐ క్యాప్ వెంచర్స్ అసెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ బిజినెస్ నిర్వహణలో కార్యకలాపాలు కలిగి ఉంది. 2023 డిసెంబర్‌కల్లా రూ. 33,055 కోట్ల నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) కలిగి ఉంది. ఉత్తమ పాలనకు వీలుగా ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్‌లో వాటా కొనుగోలు చేస్తున్నట్లు ఎస్‌బీఐ ఈ సందర్భంగా పేర్కొంది. నియంత్రణ సంస్థలు ఆర్‌బీఐ, సెబీ సైతం ఇందుకు అనుమతించినట్లు వెల్లడించింది. స్వతంత్ర సంస్థల మధ్య లావాదేవీ పద్ధతిలో వాటాను కొనుగోలు చేస్తున్నట్లు వివరించింది.



వాటా కొనుగోలు నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు 1.2 శాతం బలపడి రూ. 651 వద్ద ముగిసింది.

జాబ్ పాయింట్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 1025 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ప్రధాన కార్యాలయం, మానవ వనరుల విభాగం.. దేశవ్యాప్తంగా వివిధ శాఖల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1025
» **పోస్టుల వివరాలు:** ఆఫీసర్–క్రెడిట్(జేఎంజీ స్కేల్1)–1000, మేనేజర్–ఫారెక్స్(ఎంఎంజీ స్కేల్2)–15, మేనేజర్–సైబర్ సెక్యూరిటీ(ఎంఎంజీ స్కేల్2)–05, సీనియర్ మేనేజర్ సైబర్ సెక్యూరిటీ(ఎంఎంజీ స్కేల్3)–05.
» **అర్హత:** ఖాళీలను అనుసరించి బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ, సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీజీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.01.2024 నాటికి ఆఫీసర్ పోస్టులకు 21 నుంచి 28 ఏళ్లు, మేనేజర్ పోస్టులకు 25 నుంచి 35ఏళ్లు, సీనియర్ మేనేజర్ పోస్టులకు 27 నుంచి 38 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ఆఫీసర్‌కు రూ.36,000 నుంచి రూ.63,840, మేనేజర్‌కు రూ.48,170 నుంచి రూ.69,810, సీనియర్ మేనేజర్‌కు రూ.63,840 నుంచి రూ.78,230.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** పార్ట్–1లో రీజనింగ్(25 ప్రశ్నలు–25 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్(25 ప్రశ్నలు–25 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(50 ప్రశ్నలు–50 మార్కులు), పార్ట్–2లో ప్రొఫెషనల్ నాలెడ్జ్(50 ప్రశ్నలు–100 మార్కులు) అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:**07.02.2024
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:**25.02.2024
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** మార్చి/ఏప్రిల్ 2024.
» **వెబ్‌సైట్:** www.pnbindia.in

ఏపీ పశుసంవర్ధక శాఖలో 26 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ బ్యాక్‌లాగ్ ఖాళీల నియామక ప్రక్రియలో భాగంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 26
» **అర్హత:** బీవీఎస్సీ అండ్ ఏహెచ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.54,060 నుంచి 1,40,540.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయం, లబ్బీపేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.02.2024.
» **వెబ్‌సైట్:** https://ahd.aptonline.in

యూపీఎస్సీలో 69 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. దేశవ్యాప్తంగా కేంద్ర విభాగాలు/శాఖల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 69
» **పోస్టుల వివరాలు:** స్పెషలిస్ట్ గ్రేడ్3–40, సైంటిస్ట్ బి–28, అసిస్టెంట్ డైరెక్టర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.02.2024
» **వెబ్‌సైట్:** www.upsc.gov.in

పార్వతీపురం మన్యం జిల్లాలో 14 డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం.. అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **పోస్టుల వివరాలు:** డేటా ఎంట్రీ ఆపరేటర్–07, ఆఫీస్ సబార్డినేట్–07.
» **అర్హత:** ఆఫీస్ సబార్డినేట్‌కు పదో తరగతి, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు డిగ్రీ, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి. వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, కలెక్టర్ కార్యాలయం, పార్వతీపురం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.02.2024.
» **వెబ్‌సైట్:** www.parvathipurammanyam.ap.gov.in.

ఐఐటీల్లో మందకొడిగా ప్లేస్‌మెంట్స్

» ఆచితూచి నియామకాలు చేపడుతున్న కంపెనీలు
» ఈ ఏడాది ఐటీ రంగ రిక్రూట్‌మెంట్స్‌లో తగ్గుదల
» కోర్ సెక్టార్‌లో నియామకాలు ఆశాజనకంగానే!

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు.. కార్పొరేట్ కంపెనీల ఫేవరెట్ క్యాంపస్‌లు. ఇక్కడ విద్యార్థులకు టాప్ కంపెనీలు రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతూ.. లక్షల ప్యాకేజీతో ఆఫర్లు ఇస్తుంటాయి. కానీ.. 2024 బ్యాచ్‌కు క్యాంపస్ డ్రైవ్స్‌లో కొంత అనిశ్చితి! పలు ఐఐటీ క్యాంపస్‌లకు.. ప్రముఖ కంపెనీలు అడుగు పెట్టని వైనం!! ఈ నేపథ్యంలో.. ఐఐటీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ తాజా ట్రెండ్స్‌పై ప్రత్యేక కథనం..



ఐఐటీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియ ప్రతి ఏటా డిసెంబర్ నుంచి మార్చి వరకు పలు దశలుగా సాగుతుంది. 2024లో సర్టిఫికెట్లు అందుకునే వారికి 2023 డిసెంబర్‌లో తొలిదశ ప్లేస్‌మెంట్ డ్రైవ్ జరిగాయి. గతేడాదితో పోల్చితే 15 నుంచి 30 శాతం మేరకు ఆఫర్లలో తగ్గుదల కనిపించింది. తొలిదశలో వాస్తవానికి మొదటి రెండు రోజుల్లోనే పూర్తవ్వాల్సిన రిక్రూట్‌మెంట్ ప్రక్రియ.. వారం రోజుల పాటు కొనసాగడం తాజా జాబ్ మార్కెట్ పరిస్థితులకు అద్దం పడుతోందంటున్నారు.

ఆఫర్ల సంఖ్య తగ్గించిన కంపెనీలు

ఈ ఏడాది క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న కంపెనీలు.. ఆఫర్ల సంఖ్యను తగ్గించడం గమనార్హం. గతంలో ఒక్కో క్యాంపస్‌లో పది మంది వరకు విద్యార్థులను నియమించుకునేవి. తాజాగా గరిష్ఠంగా రెండు ఆఫర్లకు పరిమితం చేశాయి. ఐఐటీ–ఢిల్లీలో తొలిదశలో ఏడు రోజులకు మొత్తం 1,181 మందికి ఆఫర్లు ఇచ్చారు. గత ఏడాది అయిదో రోజుకే 1,300మందికి ఆఫర్లు లభించాయి. ఐఐటీ–చెన్నైలో సైతం తొలి దశ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో 50 శాతం మందికే ఆఫర్లు లభించాయి. ఐఐటీ ఖరగ్పూర్‌లో కూడా గత ఏడాది తొలి దశలోనే 1,128 ఆఫర్లు లభించగా.. ఈ ఏడాది తొలిదశ డ్రైవ్స్ ముగిసే నాటికి 989 మందికి మాత్రమే ఆఫర్లు దక్కాయి. ఐఐటీ కాన్పూర్‌లో సైతం గత ఏడాదితో పోల్చితే 30 శాతం తగ్గుదల కనిపించింది.

టాప్ జాబ్ ప్రొఫైల్స్

ఐఐటీల్లో తొలి దశ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియలో.. డేటా సైంటిస్ట్స్, అల్గారిథమ్ ఇంజనీర్స్, డేటా లాంగ్వేజ్ ఎక్స్‌పర్ట్, ప్రొడక్ట్ మేనేజర్ వంటి జాబ్ ప్రొఫైల్స్‌కు డిమాండ్ నెలకొంది. ముఖ్యంగా ట్రేడింగ్ సంస్థలు, ఈ–కామర్స్, లాజిస్టిక్స్, బ్యాంకింగ్ సంస్థలు, ఐటీ కంపెనీలు, స్టార్టప్ సంస్థల నుంచి ఈ ఆఫర్లు లభించాయి.

డిమాండింగ్ స్కిల్స్

ఈసారి క్యాంపస్ డ్రైవ్స్‌లో సంస్థలు.. విద్యార్థుల్లోని కోడింగ్ నైపుణ్యాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టాయి. రిటెన్ టెస్టులు, టెక్నికల్ రౌండ్స్‌లో కోడింగ్ సంబంధిత నైపుణ్యాలను కంపెనీలు ఎక్కువగా పరిశీలించాయని ఆయా క్యాంపస్‌ల ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొన్నాయి. కోర్ ఇంజనీరింగ్, సర్క్యూట్ బ్రాంచ్‌లకు సంబంధించి సదరు విభాగాల్లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ అంశాలపై విద్యార్థులకున్న అవగాహనను పరిశీలించినట్లు తెలిపారు.

టాప్ రిక్రూటర్స్ వీరే

అంతర్జాతీయ ఆఫర్స్ ఇవ్వడంలో.. క్వాల్ కామ్, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, గూగుల్, బార్‌క్లేస్, ఎస్ఏపీ ల్యాబ్స్, సిటీ బ్యాంక్, వెల్ ఫార్గో, మైక్రోసాఫ్ట్, బీసీజీ, బెయిన్ అండ్ కో సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా నిలిచాయి. డొమెస్టిక్ ఆఫర్స్ విషయంలో ఉబెర్, హనీవెల్, మైక్రాన్ టెక్నాలజీ, ఓఎన్‌జీసీ, ఫ్లిప్‌కార్ట్, బజాజ్ ఆటో, టాటా స్టీల్, ఎస్‌టీఎం మైక్రో ఎలక్ట్రికల్స్ వంటి సంస్థలు ముందు వరుసలో ఉన్నాయి. పలు పబ్లిక్ సెక్టార్ యూనిట్లు కూడా ఈసారి ప్లేస్‌మెంట్స్ చేపట్టాయి.

వేతనాలు ఇలా

తొలిదశ క్యాంపస్ డ్రైవ్స్‌లో సగటు వేతనం రూ.12 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు నమోదైంది. అత్యధిక వేతనం డొమెస్టిక్ ఆఫర్లకు రూ.50 లక్షలు, ఇంటర్నేషనల్ ఆఫర్లకు రూ.3.5 కోట్ల వరకు లభించింది. ఈ వేతనాలు కూడా గత ఏడాదితో పోల్చితే 10 నుంచి 20 శాతం మేరకు తక్కువగా ఉండడం గమనార్హం. ఐఐటీ చెన్నైలో అత్యధిక వేతనం రూ.రెండు కోట్లు కాగా, సగటు వేతనం రూ.22 లక్షలుగా నమోదైంది. ఐఐటీ–ముంబైలో 22 మంది విద్యార్థులకు రూ.కోటికి పైగా వేతనంతో ఆఫర్లు వచ్చాయి. మొదట్లో ఈ సంఖ్య 85గా వార్తలు వస్తే.. ఐఐటీ–ముంబై వర్గాలు మాత్రం 22 మందికే రూ.కోటికి పైగా ఆఫర్లు వచ్చినట్లు స్పష్టం చేశాయి.

పెద్ద సంస్థల వెనుకంజ

ఈసారి రిక్రూట్‌మెంట్స్ డ్రైవ్స్‌లో పెద్ద సంస్థలు.. ఎక్కువ సంఖ్యలో ఆఫర్లు ఇచ్చేందుకు అంతగా మొగ్గు చూపట్లేదని ఐఐటీల ప్లేస్‌మెంట్ వర్గాలు తెలిపాయి. అమెజాన్, ఐబీఎం వంటి సంస్థలు తొలి దశలో పలు క్యాంపస్‌లలో అసలు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌నే చేపట్టలేదు. కొన్ని ఐఐటీల్లో చేపట్టినా ఆఫర్ల సంఖ్య తక్కువగా ఉంది. అంతర్జాతీయ ఆఫర్లలోనూ ఈ ఏడాది తగ్గుదల కనిపించింది. ముఖ్యంగా కన్సల్టింగ్, బ్యాంకింగ్ రంగాల్లో ఎక్కువగా లభించే ఇంటర్నేషనల్ ఆఫర్స్ ఈ ఏడాది తగ్గాయి. అమెరికాలో సంక్షోభ పరిస్థితులనే దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. అదే విధంగా అమెరికాకు ఐటీ సేవలు అందించే సంస్థలు ఇచ్చే ఆఫర్లు కూడా తక్కువగా నమోదయ్యాయి.

తగ్గిన ఐటీ జాబ్స్

ఈ ఏడాది ఐఐటీల ప్లేస్‌మెంట్ డ్రైవ్స్‌లో ఐటీ కంపెనీలు తక్కువ సంఖ్యలో పాల్గొన్నాయి. అంతే కాకుండా.. ఐటీ జాబ్ రోల్స్, ఆఫర్స్ కూడా తక్కువగా నమోదయ్యాయి. దీనికి ప్రధాన కారణం.. కోవిడ్ సమయంలో భారీగా నియామకాలు చేపట్టిన ఐటీ కంపెనీలు ఆ సిబ్బందితోనే కార్యకలాపాలు కొనసాగించాలని నిర్ణయించడమేనని పేర్కొంటున్నారు.

కోర్ సెక్టార్‌లో ఓకే

కోర్ సెక్టార్‌లో నియామకాలు ఆశాజనకంగానే ఉండటం కొంత ఊరటనిచ్చే విషయమని చెబుతున్నారు. క్యాంపస్ డ్రైవ్స్ కోసం ఆటోమొబైల్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు సంబంధించిన పలు సంస్థలు వచ్చాయి. సర్వీస్ సెక్టార్ నుంచి కూడా ముఖ్యంగా బీఎఫ్ఎస్ఐ నుంచి కంపెనీలు క్యాంపస్ డ్రైవ్స్ చేపట్టాయి. మొత్తంగా చూస్తే.. ఐటీ సెక్టార్‌లో ఆఫర్లు తగ్గినా..కోర్ సెక్టార్, సర్వీస్ సెక్టార్‌లో క్యాంపస్ డ్రైవ్స్ ఆశాజనకంగానే ఉన్నట్లు ప్లేస్‌మెంట్స్ వర్గాలు పేర్కొంటున్నాయి.

అదే కారణమా!

ఐఐటీల్లో ఈసారి ప్లేస్‌మెంట్స్‌లో తగ్గుదలకు రెండు కారణాలు కనిపిస్తున్నాయి. అవి.. అంతర్జాతీయంగా నెలకొన్న సంక్షోభం మొదటిది.. కాగా, రెండో కారణం.. కోవిడ్ సమయంలో ప్లేస్‌మెంట్స్ భారీగా చేపట్టడం. ఈ కారణంగా..ఇప్పటికే ఆయా సంస్థల్లో మానవ వనరుల సంఖ్య అవసరానికి మించి ఉందని, అందుకే పలు ఐటీ సంస్థలు ఈ సారి నియామకాల సంఖ్యను తగ్గిస్తున్నాయని అంటున్నారు.

స్టార్టప్స్‌వైపు దృష్టి

క్యాంపస్ డ్రైవ్స్ విషయంలో దిగ్గజ సంస్థలు ఆచితూచి వ్యవహరిస్తున్న పరిస్థితుల్లో... ఐఐటీ ప్లేస్‌మెంట్ సెల్స్ వర్గాలు స్టార్టప్ సంస్థల వైపు దృష్టి పెట్టాయి. గత ఏడాది ఆఫర్లు ఇచ్చి జాయినింగ్ లెటర్లు ఇవ్వని కంపెనీలను పక్కనపెట్టి.. పేరున్న ఇతర స్టార్టప్‌లకు ఐఐటీ వర్గాలు స్వాగతం పలుకుతున్నాయి. ఐటీ కంపెనీల్లో నియామకాలు తగ్గుతూ.. స్టార్టప్ సంస్థల్లో పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో స్టార్టప్ ఆఫర్స్‌ను అంగీకరించే విషయంలో విద్యార్థులు సందిగ్ధ పరిస్థితికి లోనవుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం.. స్టార్టప్ సంస్థల్లో వేతనాలు తక్కువగా ఉండడం. దీంతోపాటు ఆయా సంస్థల సక్సెస్‌పై సందేహాలు. ఒకవేళ స్టార్టప్ సంస్థ విజయం సాధించకపోతే తమ కెరీర్ కూడా ప్రతికూలంగా మారుతుందనే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

మలిదశపైనే ఆశలన్నీ

తొలిదశలో క్యాంపస్ డ్రైవ్స్ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో.. విద్యార్థులు మలిదశపైనే తమ ఆశలు పెట్టుకున్నారు. ప్లేస్‌మెంట్ వర్గాలు సైతం రెండో దశలో ఐటీ, కోర్ ఇంజనీరింగ్ సంస్థలు వచ్చేలా కృషి చేస్తున్నాయి. ప్లేస్‌మెంట్ శాతం 75 నుంచి 77 శాతం నమోదయ్యేలా కృషి చేస్తున్నాయి. మొత్తం ప్లేస్‌మెంట్ ప్రక్రియ పూర్తయ్యే నాటికి 70 శాతం మందికి మాత్రమే ఆఫర్లు లభించే అవకాశం ఉందని, గత ఏడాది ఈ సంఖ్య 77 శాతంగా ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా...

ఇక మిషన్ భగీరథ పనులపై విజిలెన్స్

- గత ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు
- విచారణ చేపట్టి నిగ్గు తేల్చాలని సీఎం ఆదేశం?

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని గ్రామాల్లో జరిగిన మిషన్ భగీరథ పనులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించింది. గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.6 వేల నుంచి రూ.7 వేల కోట్ల పనులు జరిగినట్టు అంచనా కాగా, ఇంట్రా విలేజీ వర్క్స్‌లో గోల్‌మాల్‌జరిగిందనే అనుమానాలు వెల్లువెత్తాయి. నల్లాలు, పైపు లైన్లు వేయకుండానే బిల్లులు తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే కొనకుండానే మెటీరియల్ కొన్నట్లుగా చూపి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న వాదనలూ ఉన్నాయి. ఇక కొన్న మెటీరియల్ వాడకుండా పక్కన పడేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒక మండలంలోని ఓ గ్రామాన్ని ఎంపిక చేసుకుని విచారణ చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

లైసెన్సుల్లేని మెడికల్ షాప్‌లపై డీసీఏ కొరడా

హైదరాబాద్, నిర్మల్ జిల్లాల్లో రూ.లక్షల విలువైన మందులు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: డ్రగ్ లైసెన్స్‌లు లేకుండా మందులు నిల్వ ఉంచుతున్న, విక్రయిస్తున్న మందుల దుకాణాలపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) కొరడా ఝళిపిస్తోంది. ఈ మేరకు అధికారులు ఆయా దుకాణాలపై దా డులు చేస్తున్నారు. డీసీఏ అధికారుల ప్రత్యేక బృందాల తనిఖీల్లో ఇప్పటికే చాలాచోట్ల అలాంటి మందుల దుకాణాలను గుర్తించారు. తాజాగా హైదరాబాద్, నిర్మల్ జిల్లాల్లోనూ మంగళవారం డీసీఏ అధికారుల సోదాలు కొనసాగినట్టు డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా రామంతపూర్‌లోని శారదానగర్‌లో శ్రీసాయి క్లినిక్ నిర్వహిస్తున్న పి.శైలజ డ్రగ్ లైసెన్స్ లేకుండానే మందులు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఈ దుకాణంలో 50 రకాల రూ.3.50 ల క్షల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నా రు. నిర్మల్ జిల్లా కుంటాల మండలం, లింబా (కే)గ్రామంలో మంగళవారం జరిపిన సోదా ల్లో మాముళ్ల జీవన్ అనే వ్యక్తి డ్రగ్ లైసె న్స్ లేకుండానే మందులు విక్రయిస్తున్నట్టు గు ర్తించారు. ఇక్కడ రూ.1.60 లక్షల విలువైన 125 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

రూ. 8 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

నైజీరియన్ స్టాన్లీని అరెస్టు చేసిన టీఎస్ నాబ్

- కొకైన్ సహా ఎనిమిది రకాలైన మాదకద్రవ్యాలు సీజ్
- దేశవ్యాప్తంగా 511 మంది వినియోగదారులు గుర్తింపు
- నగరానికి చెందిన ఏడుగురి కోసం ముమ్మర గాలింపు



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను మీడియాకు చూపుతున్న డీసీపీ విజయ్ కుమార్

సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట: మెట్రోనగరాల్లో తన నెట్‌వర్క్ ద్వారా డ్రగ్స్ దందా చేస్తున్న నైజీరియన్ స్టాన్లీ ఉదోకాఇయూలను తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్ నాబ్) అధికారులు పట్టుకున్నారు. ఇతడి నుంచి రూ.8 కోట్ల విలువైన ఎనిమిది రకాలైన మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నట్టు పశ్చిమ మండల డీసీపీ ఎం.విజయ్‌కుమార్ చెప్పారు. ఎస్పీ కేసీఎస్ రఘువీర్, ఏసీపీ ఎస్.మోహన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్‌తో కలిసి పంజగుట్ట ఠాణాలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

బిజినెస్ వీసాపై ముంబై వచ్చి... గోవాలో స్థిరపడి

నైజీరియాకు చెందిన స్టాన్లీ 2009 నవంబర్‌లో బిజినెస్ వీసాపై ముంబైకి వచ్చాడు. తొలినాళ్లలో రెడీమేడ్ వస్త్రాల వ్యాపారం చేశాడు. వ్యాపార విస్తరణలో భాగంగా 2012లో తన మకాం గోవాకు మార్చాడు. అక్కడి కండోలిమ్ ప్రాంతంలో కొందరు స్నేహితులతో కలిసి ఉంటూ రెడీమేడ్ దుస్తుల వ్యాపారం చేశాడు. పాస్‌పోర్టు పోగొట్టుకొని, వీసా గడువు ముగిసినా అక్రమంగా తిష్టవేశాడు. ఈ విషయం పసిగట్టిన గోవా పోలీసులు అరెస్టు చేయడంతో ఆరు నెలలు జైలులో ఉన్నాడు. బయటకు వచ్చిన తర్వాత కండోలిమ్‌లోనే ఉండే రాజస్తానీ యువతి ఉషాచండేల్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటికే తన భర్త నుంచి వేరుపడిన ఆమెను వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ కలిసి స్టాన్లీ గ్రోసరీ పేరుతో కిరాణ దుకాణం ఏర్పాటు చేశారు. అక్కడకు సరుకులు ఖరీదు చేయడానికి వచ్చే ఇద్దరు నైజీరియన్లతో స్టాన్లీకి పరిచయమైంది. ఓ దశలో ఆర్థిక నష్టాల్లో చిక్కుకున్న స్టాన్లీకి ఈ ఇద్దరూ ఇచ్చిన సూచనల మేరకు ఎక్కువ లాభాలు ఉంటాయనే ఉద్దేశంతో డ్రగ్స్ దందా మొదలెట్టాడు.

సేల్స్ నుంచి సప్లై చైన్ వరకు...

తొలినాళ్లలో స్టాన్లీ ఆ ఇద్దరు నైజీరియన్ల నుంచి డ్రగ్స్ తీసుకొని స్థానికంగా విక్రయించేవాడు. వస్త్ర వ్యాపారంలో కంటే ఎక్కువ లాభాలు వస్తుండటంతో దీనినే కొనసాగించాడు. ఇద్దరు మిత్రులు నైజీరియాకు వెళ్లడంతో వారి డ్రగ్స్ వ్యాపారాన్నీ స్టాన్లీ టేకోవర్ చేశాడు. విదేశాల నుంచి డ్రగ్స్ తెప్పించడం, స్థానికంగా ఉన్న పెడ్లర్స్‌కు సప్లై చేయడం... ఇలా ఓ డ్రగ్స్ చైన్ ఏర్పాటు చేశాడు. 2017లో ఇదే ఆరోపణలపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులకు చిక్కి జైలుకు వెళ్లాడు. అక్కడ ఏర్పడిన పరిచయాలను తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. బయటకు వచ్చాక డ్రగ్స్ దందాను మరింత విస్తరించాడు. నైజీరియాతోపాటు నెదర్లాండ్స్‌లో ఉన్న డ్రగ్ సప్లయర్స్‌తో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. వారికి ఆర్డర్లు ఇస్తూ కొరియర్‌తో పాటు విమానాల్లో వివిధ రకాలైన డ్రగ్స్ తెప్పించుకునేవాడు. ఆయా దేశాల నుంచి కొందరు ట్రాన్స్‌పోర్టర్లు పెద్ద క్యాప్సూల్స్ రూపంలో కడుపులో దాచుకొని, బ్యాగుల్లోని రహస్య అరల్లో సర్దుకుని తీసుకొచ్చేవారు.

మాదకద్రవ్యాలు ముంబై టు గోవా

మాదకద్రవ్యాలు తొలుత ముంబై వచ్చేవి. అక్కడ ఉన్న సప్లయర్స్ ద్వారా గోవాకు తెప్పించుకునేవాడు. వీటిని కస్టమర్లతో పాటు ఇతర పెడ్లర్స్‌కు సరఫరా చేయడానికి ముగ్గురు దళారులను ఏర్పాటు చేసుకున్నాడు. వీరికి ప్రయాణ ఖర్చులతో పాటు ఒక్కో గ్రాము డెలివరీ చేసినందుకు రూ.2 వేల కమీషన్ ఇచ్చేవాడు. నైజీరియా వెళ్లిన ఇద్దరు మిత్రులు సైతం తమ పాత కస్టమర్ల ద్వారా వారికి వచ్చే ఆర్డర్స్‌ను వాట్సాప్ ద్వారా ఇతడికి పంపేవారు. ఇలా చేసినందుకు వారికీ గ్రాముకు రూ.2 వేలు కమీషన్ ఇచ్చేవాడు. ఇలా తన వ్యాపారాన్ని విస్తరించిన స్టాన్లీకి ప్రస్తుతం దేశవ్యాప్తంగా 511 మంది కస్టమర్లు ఉండగా, వారిలో ఏడుగురు నగరానికి చెందిన వారు. ఆర్థిక లావాదేవీలన్నీ క్రిప్టో కరెన్సీ లేదా హవాలా రూపంలో చేస్తుంటాడు. ముంబైలో వస్త్ర వ్యాపారం చేస్తుండగా పరిచయమైన నెట్‌వర్క్‌నే వాడుకుంటున్నాడు. స్టాన్లీ తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గోవాలో రూ.కోటి ఖరీదైన అపార్ట్‌మెంట్‌లో నివసిస్తూ విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు.

ఎస్ఆర్ నగర్‌లో దొరికిన తీగ లాగితే...

టీఎస్ నాబ్ అధికారులు గత నెల 18న ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దాడి చేసి 14 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి 38 ఎక్స్‌టసీ పిల్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరిలో కీలక నిందితుడైన బాబూసోను లోతుగా విచారించగా, డ్రగ్స్ స్టాన్లీ ద్వారా వస్తున్నాయని తేలింది. దీంతో గోవా వెళ్లిన టీఎస్ నాబ్ పోలీసులు నెల రోజులు శ్రమించి స్టాన్లీ ఆచూకీ కనిపెట్టారు. అతడి కదలికలపై నిఘా ఉంచిన అధికారులు మంగళవారం డ్రగ్స్ డెలివరీ ఇవ్వడానికి పంజగుట్టకు వచ్చినట్టు తెలుసుకున్నారు. అక్కడ వలపన్ని స్టాన్లీని పట్టుకోవడంతో పాటు అతడి నుంచి 557 గ్రాముల కొకైన్, 902 ఎక్స్‌టసీ మాత్రలు, 21 గ్రాముల హెరాయిన్, 45 గ్రాముల ఓజీ వీడ్, 105 ఎల్ఎస్‌డీ బోల్ట్స్, 215 గ్రాముల చరస్, 7 గ్రాముల యాంఫెటమైన్, 190 గ్రాముల గంజాయి, 8 సెల్‌ఫోన్లు, రూ.5.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సిటీలోని ఏడుగురు కస్టమర్ల కోసం గాలిస్తున్నారు. డ్రగ్స్ దందా వివరాలు తెలిసిన వారు 8712671111కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

జనారణ్యంలోకి ఎలుగుబంటి

- ఎనిమిది గంటలపాటు హైరానా
- ఎట్టకేలకు బంధించిన అధికారులు



పరుగులు తీస్తున్న ఎలుగుబంటి

మానకొండూర్ రూరల్: జనారణ్యంలోకి చొరబడిన ఎలుగుబంటి ఎనిమిది గంటలు హైరానా చేసి ఎట్టకేలకు బోనులో చిక్కింది. కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని చెరువుకట్ట సమీపంలో కరీంనగర్-వరంగల్ రహదారి పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూరేందుకు యత్నించింది. కుక్కలు అరవడంతో ఇంటి పక్కనున్న వేప చెట్టు ఎక్కింది. ఇంటి యజమాని ఉదయం ఎలుగుబంటి అరుపులు విని, భయపడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఎలుగుబంటి ఉన్న ప్రాంతానికి చేరుకుని ప్రజలను అప్రమత్తం చేసి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెటర్నరీ వైద్యుడు మత్తు ఇంజక్షన్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండగా.. గ్రామస్తుల సందడితో ఎలుగుబంటి చెట్టుదిగి చెరువు పక్కనున్న పొదల్లోకి దూరింది. పొదల్లో ఎలుగుబంటి కనిపించడంతో టపాసులు పేల్చి బయటకు రప్పించారు. అక్కడి నుంచి అది పంటపొలాల వెంట పరుగెత్తి సమీప ముంజంపల్లి గ్రామం వైపు వెళ్లింది. అటవీ అధికారులు మత్తు ఇంజక్షన్‌ను ఫైర్ చేయడంతో కిలోమీటర్ దూరం పరుగెత్తి పొలాల్లో సొమ్మసిల్లి పడిపోయింది. స్పృహ తప్పిన ఎలుగుబంటిని వలలో బంధించి వ్యాన్‌లో ఎక్కించి వరంగల్‌కు తరలించారు.



నీలి మెరుపుల భూమిపై.. అర్ధ చంద్రుడు..

చుట్టూ చీకటి.. దిగువన నీలి రంగులో మెరిసిపోతున్న భూమి.. కాస్త పైన ఏదో దీపం వెలుగుతున్నట్టుగా అర్ధ చంద్రుడు. భూమి, చంద్రుడు ఒకే చిత్రంలో వచ్చేలా.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి తీసిన ఫొటో ఇది. తాజాగా అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా'ఈ చిత్రాన్ని తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసింది. ''మరో 3 రోజుల్లో అమావాస్య. చంద్రుడు క్షీణదశలో ఉన్నాడు. చంద్రుడిపై మనకు కనిపించని అవతలివైపు సూర్యకాంతి పడి వెలుగుతోంది. ఆ వెలుగే ఇది..'' అని క్యాప్షన్ పెట్టింది. ఇన్‌స్టాలో వైరల్‌గా మారి న ఈ చిత్రానికి 24 గంటల్లోనే వేలాది షేరింగ్‌లతోపాటు ఏడు లక్షలకుపైగా లైక్‌లు వచ్చాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.